శ్రీ విష్ణు నిధి

మీ నక్షత్రం ఫలాలు ..... 32 పేజీలలో

సాక్షాత్తు బ్రహ్మ కడిగిన పాదాలు

ఉదయం లేవగానే కమలదళాల వంటి పాదాలను చూడగలిగితే... శుభకరం... ధనకరం... ఆనందకరం.

మైథిలి వెంకటేశ్వరరావు

శ్రీ విష్ణునిధి

మైథిలీ వెంకటేశ్వరరావు

శ్రీ విష్ణునిధి

మైథిలీ వెంకటేశ్వరరావు
వెల రూ.. 130/-లు.

కాపీరైట్ : గూటూరి వెంకటేశ్వరరావు

ప్రథమ ముద్రణ:
2012

నోట్: ఈ పుస్తకములో విషయసూచిక ఇవ్వకపోవటానికి కారణం ఇందులోని ప్రతి విషయమూ వరుసగా చదువుకుంటూ, తెలుసుకోవాలన్న సదుద్దేశంతో ఈ ప్రయత్నం చేస్తున్నాను.

-రచయిత

శ్రీ విష్ణునిధి

కొబ్బరికాయ సాంప్రదాయం

దేవలోకానిది

ఓసారి వినాయకుడు శివుణ్ని 'నీ తల కావాలి' అని అడిగాడు. ఏం చెయ్యాలో అర్థంకాక శివుడు శ్రీమహావిష్ణువుని తలచాడు. అనంతరం ఈశ్వరుడు 'అది కుదరదు కాని దానికి తగ్గదిస్తానని' చెప్పి మూడు కనులున్న నారీకేళమును విఘ్నేశ్వరునికిచ్చి తృప్తి పరిచాడట. ఆపై దేవతలు టెంకాయలు సమర్పించే సంప్రదాయం ప్రారంభమైంది. దేవలోకంలో ప్రారంభమైన ఆ సాంప్రదాయం భూలోకంలోకీ వచ్చింది.

పురుషులకి ఏం అదిరితే

ఏం ఫలం

సప్తకల్పంలో శ్రీమహావిష్ణువు మనువుకు బోధించిన మత్స్యపురాణం ప్రకారం పురుషులకి కుడిభాగంలో వెన్ను ప్రాంతంలో అదిరితే శుభం.. అదే ఎడమవైపు వెన్ను భాగంలో, ఇంకా గుండె మీద అదిరితే మంచిది కాదు. అదే లలాటం మీద అదిరితే మంచి ఉన్నత స్థానాభివృద్ధి. తల అదిరితే స్థిరాస్థులు కొనే అవకాశం ఉంటుంది. ఇక కనుబొమలు అదిరితే అంబుజాక్షిల కటాక్షం. మహాధనం కంటి కొస అదిరితే కలుగుతుంది. ఇక కనురెప్పలు అదిరితే ఆ రోజున మీకు ఎదురుండదు. చెవి అదిరితే కుటుంబంలో శుభకార్యం జరుగుతుంది. పొట్ట అదిరితే సంతోష సౌఖ్యాలు. అదే చేయి అదిరితే ఆకస్మిక ధనలాభం. భుజం అదిరితే సుఖం. ముక్కు మహా సౌఖ్యకీర్తి. జఘనమందు అదిరితే ధనం.. స్త్రీలకు ఎడమవైపు, పురుషులకి కుడివైపు అదిరితే శుభము.

చిమ్మిలి అనగా నువ్వులు, బెల్లం, ఎండుకొబ్బరిలతో తయారు చేసినది

పూజలో పాటించాల్సినవి

★ శుభ్రత తొలుత ముఖ్యంగా పాటించాల్సినది.

★ పూజా సమయంలో ధరించిన దుస్తులు ఎక్కడా చిరిగి ఉండకూడదు.

★ పట్టుబట్టలకి నలుపు ఉన్నా దోషం లేదు.. కానీ...? అంచు వుండాలి.

★ పూజకు సిద్ధమై పట్టు దుస్తులు ధరించి ఏదైనా తింటే ఆ దుస్తులు పూజకు పనికి రావు. వివాహాది శుభకార్యాల్లో వాడిన పట్టువస్త్రాలు భగవంతుని పూజకు పనికి రావు.

★ పూజ చేసే స్త్రీ లక్ష్మీదేవిలా వుండాలి.

★ పూజా సమయంలో దీపం ఆరితే, వెలిగించి మొదట్నించి పూజను ప్రారంభించాలి.

★ పూజలో అలంకరించినవి ఏవైనా తీయాలంటే సూర్యోదయానికి ముందే తీయాలి.

★ పూల తొడిమలు, తీగలు వంటివి తీసి పూలను పూజకి వాడుకోవాలి.

★ నీటితో పూలను కడుగరాదు.

★ అక్షింతలను ఎప్పటికప్పుడు తయారు చేసుకుని పూజలో వాడాలి.

★ పూజామందిరంలోకీ, పూజలు జరిగే ప్రదేశాలలోకి కుడికాలు ముందు పెట్టి ప్రవేశించాలి.

★ భగవంతునికి సమర్పించే పండ్లూ, తమలపాకులూ వంటి వాటిని నేలపై ఉంచరాదు.

★ పవిత్ర దినములలో శ్రీమహావిష్ణువు తులసిలో ఉంటాడు. ఆ రోజుల్లో తులసి దళాలను కోయకూడదు.

★ పూజ మధ్యలో ఎక్కువ సార్లు లేవకుండా పూజకు కావాల్సిన అన్ని వస్తువులనూ సిద్ధం చేసుకుని పూజని ప్రారంభించాలి.

పానకాలస్వామికి పానకం సమర్పించే ఆచారం ఎప్పటిది

గజాకృతిలో వున్న కొండ మంగళగిరి కొండ. పూర్వము మేత కోసం ఓ గోవు నిత్యం కొండపైకి వెళ్ళి వస్తుండేది. సాయంత్రం ఇంటికి వచ్చాక దాని పొదుగు వట్టిపోయి వుండేది. అలా రోజూ ఎందుకు జరుగుతుందో అర్థంకాక ఓ రోజు గోపాలకుడు ఆ గోవుని

అనుసరించాడు. ఆ గోవు క్షీరాన్ని ఛాయా రూపంలో ఉన్న ఓ వ్యక్తి గ్రోలుతుండటం చూస్తాడు. తర్వాత ఆ ఛాయ పర్వత బిలంలోకి వెళ్ళటం చూస్తాడు. ఆ రాత్రి కలలో శ్రీమహావిష్ణువు అతడికి కనిపించి 'నముచి' అనే రాక్షస సంహారం కోసం తాను ఆవిర్భవించనట్టు సందేశం ఇస్తాడు. ఆ మరుసటి రోజు అందరితో కలిసి ఆ బిలం వద్దకెళ్ళి గోక్షీరాన్ని సమర్పిస్తాడు. ఆశ్చర్యంగా అందులోంచి సగం బైటికి వచ్చేస్తాయి. దాన్ని భక్తిశేషంగా స్వీకరిస్తారు అంతా. ఆ విషయం మహారాజుకి తెలిసి గోపురం కట్టించాడు. కృతయుగం నాటిది. అప్పుడు దేవతలు అమృతాన్ని నివేదించేవారు. త్రేతాయుగంలో గోఘృతాన్నీ, ద్వాపరయుగంలో గోక్షీరాన్నీ ఈ కలియుగంలో పానకాన్నీ సమర్పిస్తున్నారు. గాలిలో తేలుతున్నట్లుండే ఈ మంగళగిరి గాలిగోపురం కంచిలోని ఏకామ్రనాథాలయంలోని గాలిగోపురంతో సమానమైనది. అంతటి విశిష్ఠతలు గల ఈ పానకాల స్వామి కొండమీద మధ్యాహ్నం తర్వాత దేవతలు సందర్శిస్తారని చెబుతారు. అందుకే మధ్యాహ్నం దాటితే కొండ మీద ఎవరూ వుండరు.

భార్యని బాధపెడితే

పరస్త్రీ వ్యామెహంతోనో ... మరో కారణంతోనో గానీ భార్యని వదిలిన వాడి పాపం ఎంతటిదంటే గాడిద చర్మాన్ని వెంట్రుకలు పైకి కనిపించేలా కప్పుకొని 'భార్యని వదలినవాడిని... భిక్ష వేయండి...' అని రోజుకు ఆరు ఇళ్ళు అడుక్కుంటూ, అలా ఆరుమాసాలు చేస్తే మరుజన్మలో పురుగుగా పుట్టే గతీ, ఈ జన్మలో అంతకన్నా హీనంగా బ్రతికే ఖర్మ తప్పుతుందని శాస్త్ర సారాంశము. పతితుడైన తండ్రినైనా వదిలించుకోవచ్చు గాని పతిత అయిన తల్లిని వీడరాదని మహా శాస్త్ర పరమార్థము.

నిరాశా నిస్పృహలతో వుంటే శ్రీరామాయణ మహాభారతాలు చదవండి

★ సకల పురాణ ఇతిహాస వేద సారంశములవి.

★ లోకంలో భోగాలంటే అర్థమవుతుంది.

★ ధనం కోసం అధికారం కోసం ఎంతటి నీచానికైనా పాల్పడేవాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో తెలుస్తుంది.

★ సకల ధర్మ శాస్త్ర సారాంశము.

★ ధనాన్ని ఎలా కాపాడుకోవాలి.

★ స్త్రీ పతివ్రతా ధర్మాలు.

★ కష్టాలూ, సుఖాలూ వచ్చినప్పుడు ఎలా ప్రవర్తించాలి.

★ పగా, ప్రతీకారాలు ఎలా తీర్చుకోవాలి.

★ యజ్ఞ, యాగాది వ్రతాలు ఏ ఏ ఫలితాల్నిస్తాయి.

★ తీర్థయాత్రల స్థల మహత్యాలు.

★ గృహాన్ని ఎలా నడపాలి... స్త్రీ గృహ ధర్మాలు.

★ శత్రువులెలా అవుతారు?

★ బలమూ, శక్తి, అండ ఎంతటి విజయాన్నిస్తాయి.

★ కామం, కోర్కెలు, అహం.. ఎంతటి వినాశనాన్ని తెస్తాయి.

★ స్నేహానికి నిర్వచనము.

★ ధనం వుంటే సమాజం ఎలా చూస్తుంది, ఆ ధనమే లేకపోతే ఎలా చూస్తుంది?

★ సకల పితృదేవ రుణాలు ఎలా తీర్చుకోవాలి.

★ మంచితనమూ, ధర్మతత్త్వమూ ఎంతటి మహర్దశను కలిగిస్తుంది.

★ శ్రమ, పట్టుదలలు ఎంతటి అపజయాన్ని విజయంగా మారుస్తాయి.

★ పెద్దల యెడల భక్తి వుంటే, అదే లేకపోతే ఎటువంటి శుభాలూ, అశుభాలు జరుగుతాయి.

★ అతిప్రేమ ఎంతటి విధ్వంసాన్ని సృష్టిస్తుంది.

★ పరస్త్రీ పొందు కోరితే ఎంతటి అవమానం.

★ అసలు సిసలు మహా సౌఖ్యసుఖాలు ఎలా వుంటాయి.

★ జనకుని భార్య పేరు ఎంతమందికి తెలుసు... ఆ పేరు తల్చుకున్నంతనే మహాసౌభాగ్యం. ఆ చిన్ని గాథ ఎందులో వుంది?

ఆ ప్రశ్నని ఎంతోమంది నన్ను అడుగుతుంటారు. ఒక్క పదంలో రాయచ్చు. కానీ తెలుసుకోండి. జనకుని భార్య గూర్చి మహాభారతంలో వుంది. సన్యసిస్తానని చెప్పిన జనకునికి గృహస్థ ధర్మాలు గూర్చి చెప్పింది ఆ ఇల్లాలు.

★ అందులో లేనిది ఎక్కడా లేదు. ఎక్కడైనా వున్నది అందులో వుంది. అదే వ్యాసమహర్షి రచియించిన శ్రీమహాభారతము. లక్షల వేలకోట్ల సమస్యలకి పరిష్కారం శ్రీమహాభారతము. ఒక్కసారి చదివినంతనే మహా మోక్షము. మహా సుఖాలను ఇస్తుంది. చదవాల్సింది ముఖ్యంగా మీ పిల్లలే... జీవితంలో మీలా, మనలా మోసపోకుండా వుండటానికీ... లౌక్య ధర్మాలు తెలియటానికి శ్రీరామాయణ మహాభారతములను చదివించండి... శ్రీరామాయణ భారతాలు శ్లోక వచనంలో వున్నవి చదివితే అందులో అంతర్లీనమైన, అమోఘమైన భావన అర్థమవుతుంది.

పద్మావతి శ్రీనివాసుల వివాహం సందర్భంగా జరిగిన విందులో పాండవ తీర్థం నుంచి శ్రీశైలం వరకు బంతులు పడ్డాయి.

దీపావళిని ఎలా చేసుకోవాలి

వ్రతపురాణాల ప్రకారం దివ్య దీపావళిని అయిదురోజులు చేసుకోవాలి. త్రయోదశినాడు అపమృత్యు నివారణార్థము దీపమును వెలిగించి ఇంటి ముంగిట వుంచాలి. దాన్నే యమదీపం అని అంటారు. చతుర్దశి నాడు అనగా నరక చతుర్దశి నాడు సూర్యోదయం ముందే అభ్యంగనస్నానం చేసి మట్టిపెళ్ళలతో ఉన్న ఉత్తరేణి కొమ్మలతో గృహస్థు దిష్టి తీయించుకోవాలి. చతుర్దశి నాడు యమునికి తప్పక దీపారాధన చేయాలి. పితరులు సంతృప్తులవుతారు. ఆపై అమావాస్య ప్రాతఃకాలమున తలంటు పోసుకుని దరిద్రాలు పోవటానికి శ్రీలక్ష్మీపూజ చేయాలి. ఆనాడు రావి, మేడి, జువ్వి, మామిడి, మర్రి కొమ్మలను నీటిలో వేసి స్నానం చేయాలి. ఆ తర్వాత గృహిణి చేత దీపముతో నివాళులిప్పించుకోవాలి. అర్ధరాత్రి ధక్కాలను, భేరీని మ్రోగించాలి. దాంతో జ్యేష్ఠాదేవి ఇంటినుంచి వెళ్ళిపోతుంది.

అమావాస్యానంతర దినము బలి పాడ్యమి. ఆ పూజ శ్రీమహావిష్ణువుకి ప్రీతికరము. ఆనాటి పూజ మహా

ఫలము. బలి పాడ్యమి నాడు జూదంలో గెలిస్తే సంవత్సరమంతా గెలుస్తారని మహా నమ్మకం. దానికి కారణం ఆనాడే పార్వతీదేవి పరమేశ్వరునితో జూదం ఆడి గెల్చింది. ఆ బలిపాడ్యమినాడు గోపూజ తప్పని సరిగా చేయాలి. ఆనాడు ఆవుల పాలు పిండరాదు. భ్రాత ద్వితీయ అనగా యమునాదేవి తన సోదరుడు యమున్ని గృహానికి ఆహ్వానించి తన ఇంట భోజనం పెట్టిన రోజు. ఆనాడు సోదరి ఇంట భోజనం చేసిన సోదరునికి పూర్ణాయుష్షుని పొందేలా సోదరికి వరమిచ్చాడు యమధర్మరాజు. అందుకే ఆ రోజు ప్రతి అన్న సోదరి ఇంటికెళ్ళి ఆమె చేతి భోజనం తిని యమునిపాశము నుంచి దూరంగా వుంటున్నాడు.

శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని చైత్రశుక్ల తదియ నాడు కృతమాలా నది నుంచి మత్స్యరూపుడై సత్యవ్రత రాజు చేతుల్లో పడ్డాడు. అ తిథే మత్స్యజయంతి.

అయిదు సంవత్సరాల లోపు పిల్లలని ఎక్కడైనా ముద్దు పెట్టుకోవచ్చు. ఆపై కేవలం రెండు చేతులతో తలను పట్టుకుని దగ్గరికి వంగాలి. సంతానమైనా సరే దగ్గరికి తీసుకోరాదు, ముద్దు పెట్టుకోరాదు. అది ధర్మము కాదు.. మంచిదీ కాదు.

- శ్రీరాముని సారాంశము

వృద్ధాప్యంలో ఉన్నవారు తమ అనుభవ అధర్మ జ్ఞానాన్ని చిన్నవారి మీద చూపించటం కన్నా మహాపాపం మరొకటి లేదు.

వరలక్ష్మీ వ్రత సమయంలో తామరపూవులో పెట్టి పూజించాలి

– మరో సందర్భంలో వాడితే శక్తి, సిద్ధి, వైభోగాలు తగ్గిపోతాయి. చిన్నశెనగలు, బొబ్బర్లు, ఉలవలు... వీటినే అలసందలంటారు. వరలక్ష్మీ పూజ చేసేటప్పుడు తప్పనిసరిగా తామరపూలలో లక్ష్మీదేవిని ఉంచి ఇంకా అలసందలను నైవేద్యంగా పెట్టి పూజచేస్తే శ్రీమహావిష్ణువుకి కూడా పూజ చేసిన ఫలం. అలాగే బిల్వము, జిల్లేడు, ఉమ్మెత్త, వేప.. దానిమ్మ, వెలగ, ఇప్ప, అవిశగింజలు... వీటిని పూజ, యజ్ఞయాగాదులలో మాత్రమే వాడాలి. వేరే కార్యాల్లో వాడితే దుఃఖ ధన కష్టములు తప్పవు.

శ్రీమహావిష్ణువే చెప్పిన ఫలశ్రుతి

ఫలశ్రుతులను దేవతలు, ఋషుల ఇంకా మహా పుణ్యాతిపుణ్యమైన వారు చెప్పారు. కానీ గజేంద్ర మోక్షం చదివితే ఎలాంటి ఫలశ్రుతి కలుగుతుందో సాక్షాత్తు శ్రీలక్ష్మీనారాయణుడు.. ఆ మహావిష్ణువు చెప్పాడు.

గజేంద్ర మోక్షం చదివితే.... 'కష్టం వస్తే వైకుంఠాన్ని వదలి వచ్చేస్తాననీ, మీ కష్టాన్ని తీరుస్తాననీ, మహా మోక్షాన్ని ఇస్తానని'.

ఏ పుష్పమందు నారాయణుడుంటాడు

నల్ల కలువల్లో ఈశ్వరపత్ని పార్వతీదేవి, మారేడులో శ్రీమహాలక్ష్మి, తెల్లకలువల్లో కుమారస్వామి, కమలాల్లో ఈశ్వరుడు, సృష్టికర్త బ్రహ్మదేవుడు తెల్ల జిల్లేడునందూ, చదువుల తల్లి సరస్వతి కొండగోగుల యందూ, కరివీర పుష్పములందు విఘ్నేశ్వరుడూ, మంచి సువాసన గల పూలల్లో గౌరీదేవి ఉన్నట్టుగా శ్రీమహావిష్ణువు శివమల్లికలందు వుంటాడు.

పరమేశ్వరునికి.. ఈశ్వరునికి నూలు బట్టలతో పూజచేస్తే ప్రీతి. అదే వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణునికి.. శ్రీమహావిష్ణువుకి పట్టువస్త్రాలతో పూజ చేస్తే ప్రీతి

పూజామందిరంలో దీపం ఎలా వుండాలి

★ వెండి కుందుల్లో దీపారాధన వల్ల సంపద వృద్ధి అవుతుంది.

★ ఇత్తడి కుందులు వాడవచ్చును, అయితే రాగి కుందులు దీపారాధనకు తగవు.

★ దీపం తూర్పు ముఖంగా వుంచితే ఆయుష్షు పెరుగుతుంది. ఉత్తర ముఖంగా వుంచటం వల్ల ధనం వృద్ధి అవుతుంది. పశ్చిమ, దక్షిణ ముఖాలుగా దీపాలు పెట్టడమంటే అశుభాలని ఆహ్వానించినట్టే.

★ ముఖ్యంగా చెయ్యకూడనిది దీపాలని అగ్గిపుల్లలతో వెలిగిస్తారు. ఎన్నిసార్లు చెప్పినా, ఎన్నిసార్లు రాసినా చెయ్యరు. కానీ గుర్తుంచుకుని అగరబత్తితో లేదా ఏకహారతిలో వత్తిని వెలిగించి దానితో దీపాల్ని వెలగించుకుంటేనే తత్పుణ్యం.

శ్రీమహావిష్ణువు పూజలో వాడకూడనివి

మందారము, జిల్లేడు, ఉమ్మెత్త, బూరుగ, దేవకాంచనము, తాంద్రలు వాడరాదు. అలాగే నరసింహ స్వామికి వీటితో పాటు రంగుల మొగలిపూవులను కూడా వాడకూడదు.

శ్రీమహావిష్ణువు పూజలో ఏ పూవు శ్రేష్ఠమైనది

తమ్మి పూలకన్నా, జమ్మి పూలకన్నా, మారేడుకన్నా, అవిసె పూలకన్నా, నందివర్ధనాలకన్నా, గన్నేరు పూలకన్నా, సంపెంగల కన్నా, అశోకపుష్పములకన్నా, తెల్లగులాబీల కన్నా, తెల్లని సన్నజాజులకన్నా, వసంతకాలం మల్లెలకన్నా, తామర పూలకన్నా జాజిపువ్వు శ్రీమహావిష్ణువుకు మహా ప్రీతికరమైనది. జాజిపూలతో మాలను చేసి ఆ మాలను శ్రీమహావిష్ణువుకి భక్తితో అర్పించితే వచ్చే ఫలమే మహా పరాక్రమము, కీర్తి, సంపదలు.

శ్రీహరికి ప్రీతికరమైన పత్రములు

ఉత్తరేణి, చంద్ర, జమ్మి, గరిక, దర్భ, దమనము, మారేడు, బిల్వము... వీటితో పాటు అత్యంత ప్రీతికరమైనది తులసి. ఎవరైతే తులసితో స్వామిని పూజిస్తారో వారి దోషాలను పూర్తిగా స్వామి తొలగించి వేస్తాడు.

శ్రీకృష్ణుడ్ని రక్తచందనము ఇంకా వాటి పూలతో, మారేడు దళములతో దాని పుష్పములతో పూజించకూడదు.

ఎర్రగన్నేరులనూ, బిల్వ పత్రాలనూ దేవకీసుతునికి అర్పించకూడదు.

అలాగే నరసింహ స్వామిని మొగలి పూలతో పూజించకూడదు.

సుఖసౌఖ్యాల కోసం శ్రీవాసుదేవుడ్ని ఎలా పూజించాలి

కడిమపూలతో పూజిస్తే మహా సుఖాలు లభ్యమవుతాయి. ఇక కదంబ పుష్పాలతో పూజిస్తే స్థిరమైన సిరిని కలుగచేస్తాడు. కార్తీకమాసంలో సన్నజాజులతో శ్రీమహావిష్ణువుని పూజిస్తే వేయి గోవులను దానం చేసిన ఫలం లభిస్తుంది. మహాకీర్తి కోసం, అధికారం కోసం అవిసెపువ్వులతో పూజించాలి. మొగలిరేకులతో పూజిస్తే మహాకీర్తి. అశోక పుష్పములతో పూజిస్తే శోకము, దుఃఖములు తొలగిపోతాయి. ఇక వర్షాకాలంలో చంపక పూలతో పూజిస్తే మనఃశ్శాంతి. ఎట్టి కోరికలూ లేకుండా సంతృప్తి పడేలా చేస్తాడు శ్రీమహావిష్ణువు. జమ్మి పత్రితో పూజిస్తే భయరోగదోషాలు సమసిపోతాయి. తామర పూలతో పూజిస్తే కోరుకున్నది ఏదైనా తీర్చేస్తాడు. ఇక తులసి దళాలతో పూజిస్తే కుటుంబమంతటికీ శ్రేయస్సును కలిగిస్తాడు ఆ వైకుంఠవాసుడు.

కోపానికి మించిన దరిద్రం..

దోషం మరింకేమీలేదు

★ మహాకోపంతో, ఆవేశంతో నిర్ణయాలను తీసుకున్న దుర్యోధనుడు ఏమయ్యాడు.

★ హుంకరించి, అహంకరించనందుకు కంసుడు ఏమయ్యాడు

★ కోపమే క్రోధం, క్రోధమే కామం.. ఆ కామంతోనేగా పదితలల రావణాసురుడు బంగారు లంకా నగరాన్నీ, తన వారినీ పోగొట్టుకున్నాడు. మహా పతివ్రత భార్యయైన మండోదరిని ఏకాకిని చేశాడు.

★ విశ్వామిత్రుడు ఆ కోపాన్ని పోగొట్టుకోవడానికి ఎన్నో వేల వందల సంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మర్షి అయ్యాడు.

★ కోపమన్నది లేకపోతే విశ్వామిత్రుడు వశిష్ఠుడికన్నా గొప్పవాడు.

★ కోపం వల్ల ధనం పోతుంది.. శక్తి పోతుంది.. స్త్రీ పోతుంది.

★ ఆ కోపమే ధనాన్నీ, ఐహికమైన సుఖాలనూ పోగొడుతుంది.

★ ధనం విషయంలో కోపం తెచ్చుకుంటే ఖచ్చితంగా మీకే నష్టం.

★ దశావతారాల్లో ఏ అవతారంలోనైనా రాక్షస సంహారం శ్రీమహా విష్ణువు చేసింది కేవలం శాంతంతోనే. ఆఖరికి నరసింహావతారంలో కూడా ఎంతో సహనంగా, శాంతంగా చూసి చూసి...ఆపై ఆ సమయంలోనే అత్యంత ఆవేశపూరితంగా హిరణ్యకశ్యపుణ్ని సంహరించాడు.

★ శ్రీరాముడు కోపం తెచ్చుకున్న సందర్భాలున్నాయా? శ్రీకృష్ణుడు కోపం తెచ్చుకున్నాడా? ఏ అవతారంలో కూడా శ్రీమన్నారాయణుడు కోపంగా వుండలేదు. ఎందుకంటే కోపమే సకల వినాశనాలకి పునాది.

★ దూర్వాసమహర్షి కోపిష్ఠి కాదు. ఆగ్రహపరుడు. కోపానికీ, ఆగ్రహానికీ తేడా ఉంది. కోపం అంటే తన గూర్చి, అదే ఆగ్రహం ... అంటే పొరపాటు చేస్తే వచ్చేది. గురువు శిష్యుడి మీద పడేది కోపం కాదు ఆగ్రహం.

★ యయాతి, నలుడు, హరిశ్చంద్రుడు, మాంధాత.. వారికి కోపమే లేదు. అందుకనే అన్ని యాగధర్మ కార్యాలు చెయ్యగలిగారు. కీర్తివంతులూ, ధనవంతులూ, పుణ్యమూర్తులయ్యారు.

★ కోపాన్ని వదిలేస్తే మీరు కుబేరులే.. వదిలి చూడండి. ధనం మీ వద్దకు ఎలా వస్తుందో చూడండి.

★ కోపంతో అశ్వమేధ యాగం చేసినా ఫలితం దక్కదు.

★ కోపం కారణంగానే శ్రీమహాలక్ష్మి వైకుంఠం వదలాల్సి వచ్చింది. కొల్హాపూర్‌లో కొంతకాలం ఉండాల్సివచ్చింది.

తిరుమల తిరుపతి శ్రీవారి పురాతన పుణ్య విషయాలు

అనాదికాలంలో ఇప్పుడు మనం దర్శించే శ్రీవేంకటేశ్వరుని దివ్య విగ్రహం సంపంగి చెట్టు కింద ఉండేదిట. ఇంకా పక్కనే చింతచెట్టు వుండేదట.

★ శ్రీవేంకటేశ్వరునిది భరద్వాజ గోత్రం, శ్రవణా నక్షత్రం.

★ శ్రీకృష్ణ భగవానుడు వేటగాడి బాణానికి శరీరాన్ని వదిలి వైకుంఠం చేరిన రోజు నుంచి కలికి యుగమైన కలియుగం ప్రారంభమైంది.

★ తిరుమలలోని శిలాతోరణం **200** బిలియన్ ఏళ్ళ నాటిది.

★ ధర్మరాజు తన వారిని చంపుకున్న మహా పాపం పోక పోవటంతో మార్కండేయ మహర్షి, భరద్వాజ మహర్షుల ఆదేశంతో తిరుమలలోని వేంకటాచలం వచ్చి జప ఉపవాసాదులతో శ్రీవేంకటేశ్వరుణ్ని సేవించుకుని దోషాలను పోగొట్టుకున్నాడు. అప్పుడు స్నానమాచరించిన తీర్థమే తిరుమలలోని పాండవతీర్థం.

★ పాపనాశనం వద్ద చేసే చిన్న దానం కూడా వేలరెట్ల సంపదలను దానమిచ్చిన ఫలాన్ని కలిగిస్తుంది.

★ తిరునామం ధరించిన భక్తుడంటే స్వామికి ఎనలేని ప్రీతి. నారదుడు ఎప్పుడూ పచ్చకర్పూర నామం ధరించే లోకసంచారం చేస్తుంటాడు.

★ తిరుమల కొండ కాదు, సాలగ్రామ పర్వతమే. అక్కడే స్వామి దివ్యరూపంలో వెలిసి ఉన్నాడు.

★ దశరథ మహారాజు ఈ శ్రీవేంకటాచల పర్వతాన్ని దర్శించిన తర్వాతే ఆయనకి పుత్రుడిగా శ్రీరామచంద్రుడిగా స్వామి జన్మించాడు.

★ నారాయణాద్రి.. అనగా బ్రహ్మాదిదేవతలకు శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమైన ప్రదేశం.. రావణ సంహారం చేస్తానని దేవతలకి అభయమిచ్చిన పుణ్య ప్రదేశం. బ్రహ్మోత్సవాలకి నాంది పలికిన పర్వతమే నారాయణాద్రి.

★ దేవతలలో శ్రీమహావిష్ణువు.. నక్షత్రాలలో చంద్రుడు, వృక్షములలో కల్పవృక్షము ఎలా శ్రేష్ఠాతిశ్రేష్ఠమైనవో నదుల్లో సువర్ణముఖి నది (అగస్త్యమహాముని తపః ఫలంగా ఆకాశం నుంచి దిగి వచ్చిన నదీదేవత... ఆ ప్రవాహమే సువర్ణముఖినది.) అంతటి శ్రేష్ఠమైనది.

★ కుమారాధార తీర్థస్నానం మహా వ్యాధులనూ, మానసిక శారీరిక రుగ్మతులను పోగొడుతుంది.

★ కుంతల అను అప్సరసకు శాపం కారణంగా జన్మించిన శ్రీవిష్వక్సేనులకి శ్రీవిష్ణుసేనాధిపత్యం ఇచ్చిన వాడు తిరుమలగిరివాసుడు.

★ తిరుమల పుష్కరిణి పక్కనే శ్రీమహాలక్ష్మీదేవి పదివేల సంవత్సరాలు తపస్సు చేసింది. అక్కడ సంకల్పం చెప్పుకుని స్నానం చేస్తే మహా ధనసంపదలు కలుగుతాయి.

★ జనకునికి సీతాదేవి భూమిలో లభించినట్లుగానే మహాలక్ష్మీదేవి పద్మావతీ దేవి కూడా అయోనిజగా చందనపు పెట్టెలో తామరపూల మధ్య ఆకాశరాజు, ధరణీదేవిలకు లభించింది.

కుబేరుని వద్ద శ్రీవేంకటేశ్వరస్వామి ఎప్పుడు ఋణం తీసుకున్నాడు

విళింబినామ సంవత్సర వైశాఖ మాసంలో వచ్చే సప్తమినాడు. ఇక పద్మావతీ శ్రీనివాసుల వివాహం జరిగింది ఉత్తర ఫల్గుణీ వైశాఖ మాసం శుక్లపక్షం దశమి నాడు. స్వామి తన వివాహానికి మూడురోజుల ముందు కుబేరుని వద్ద ధనాన్ని అప్పుగా తీసుకున్నాడు.

హోమజపపూజాదుల

శ్రీమహావిష్ణువుకి

సరిగా చేయాలి

ఈశ్వరునికి పుక్కిలించి అభిషేకం చేసినా భక్తుడనీ, అమాయకుడనీ సరిపెట్టుకుంటాడు. కానీ శ్రీమహావిష్ణువు మాత్రం నిబంధనలను పాటించకపోతే స్వీకరించడు. ఉపవాసాలతో, కందమూల ఫలాలను భుజిస్తూ హోమజపాదులు చేసినా శుచి, శుభ్రతలు లేని ధృతమతి అనే భక్తునికి పూర్తి ఫలం ఇవ్వలేదు. అలా వాని గాథ ఆధారంగా తిరుమలలోని పాపనాశనం వుంది. ధృతమతి ఆపై జన్మల్లో అక్కడికి వచ్చి ఆ తీర్థంలో స్నానం చేసి సకల పాపాలను భస్మం చేసుకున్నాడు. దాంతో ఆ తీర్థానికి పాపనాశనము అని పేరు ఏర్పడింది. పాపనాశనంలో స్నానం చేసి శ్రీవేంకటేశ్వరుణ్ని శతనామాలతో పూజిస్తే ధనం కావాల్సిన వారికి ధనం, భూమి కావాల్సినవ వారికి భూమినీ వచ్చేలా చేస్తాడు శ్రీనివాసుడు.

శ్రీమహావిష్ణువుకి

ఏ ప్రదక్షిణ అన్న ప్రీతి

అనేక బాధలూ, అనేక సమస్యలూ పడుతున్న వారు శ్రీమహావిష్ణువుకి గిరిప్రదక్షిణ చేస్తే శత్రువినాశనం సంపూర్ణంగా జరుగుతుంది. రావణుడితో మహా బాధలు పడుతున్న వారు శ్రీమహావిష్ణువు కోసం వెదుకగా ఆయన కాన రాకపోవటంతో బ్రహ్మదేవుడితో కలిసి శ్రీవేంకటాచల పర్వతాన్ని మూడుసార్లు ప్రదక్షిణ చేశారు.

పరుల సొమ్ము గోమాంసంతోనూ,
పరుల భార్యలను తల్లితో
సమానంగా చూసేవాడు సాక్షాత్తు
నారాయణుడే. తలుచున్నంతనే ఏ
ఆపదా రానీయడు నారాయణుడు.
శ్రీరామచంద్రుడ్ని కష్టంలో
తలుచుకుంటే, తలుచుకున్నంత
సేపట్లోనే ఆ కష్టం తీరిపోతుంది.

క్షమ అంటే

చేయగలిగి వుండీ.. చేతనయి వుండీ ... శక్తి వుండీ.. వదిలెయ్యటం. దాన్ని మాత్రమే క్షమ అని అంటారు. క్షమించేవాడు ఖచ్చితంగా పరమాత్ముడే. తప్పు చేసి తప్పక బాధ పడేవాడు క్షమకి అర్హుడు కాడు.

శ్రీవేంకటేశ్వరునికి రాగులతో పుట్టతేనెని కలిపి నైవద్యంగా సమర్పించి పూజిస్తే ఆ పొంగలి స్వీకరించిన స్వామి ఏం కావాలన్నా అనుగ్రహిస్తాడు. పూర్వం అలా నైవేద్యం పెట్టి సేవించిన వసువ, చిత్రావతి దంపతులకు మహా వరములను ఇచ్చాడు.

మహాధైర్యసాహసాలుగల

పుత్రుని కోసం

త్రేతాయుగంలో కేసరి అనే వానరుడి భార్య అంజనాదేవి సంతానం కోసం ఎన్ని పూజలూ, వ్రతాలూ చేసినా ఫలితం లేకపోయేసరికి మాతంగి మహర్షిని అభ్యర్థించి ఆయన ఆదేశం ప్రకారంగా రావిచెట్టుని పూజించి తిలదానమును ఇచ్చింది. తిరుమల పుష్కరిణిలో స్నానమాచరించింది. ఫలితంగా మహాబలవంతుడు ఆంజనేయుడు జన్మించాడు.

పద్మావతీ, శ్రీనివాసుల కళ్యాణ

ముహూర్తము

వైశాఖ మాసం, శుక్ల పక్షమి, దశమి తిథి, ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. ఆ మహా దివ్యముహూర్తాన్ని బృహస్పతి, మహర్షులు పెట్టగా బ్రహ్మదేవుడు నిశ్చయించాడు. వివాహ పత్రికలను గరుడుడు దేవతలకి అందించి శ్రీనివాసుడు వచ్చి పిలిచినట్టుగా భావించమని శ్రీనివాసుడు చెప్పిన విషయాన్ని చెప్పి అందించాడు. పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణానికి పెద్దరికం శుకమహర్షికి ఇచ్చాడు ఆకాశరాజు.

ధనం, సుఖముల గూర్చి కవి చౌడప్ప పద్యం

ఎంతెంతో దీర్ఘాయు

ష్మంతుడనై బుగుల బుద్ధిమంతుడనై భీ

మంతుడనై మన లక్ష్మీ

కాంతుని కృప కుందవడవు కవిచౌడప్పా

శ్రీమహావిష్ణువు దయచేత దీర్ఘాయువునీ, బుద్ధినీ సకల సంపదలని పొందండి.

శ్రీమహావిష్ణువు వర్ణన

ఆకాశంలో ఏడుకాంతులు వెలుగుతుండగా నవరత్నముల భూషణములతో, సమస్త పరివార దేవతలు వుండగా ఆదిశేషునిపై ఓ పాదం మడిచి, మరియొక పాదం చాపి.. అభయ వరద ముద్రలతో, జగన్మోహనంగా బంగారు వన్నెగల నెమలి కంఠంతో, నీలమైన వజ్రం వంటి శరీరకాంతితో, మకర కుండలాలు ధరించి పెద్ద రొమ్ములతో చంద్రకాంతిగల యజ్ఞోపవీతం ధరించి తామర పూలకాడల వంటి పొడవాటి చేతులలో రెండు చేతులలో పాంచజన్యమూ, సుదర్శన చక్రాలతోనూ,

మిగతా రెండు హస్తాల్లో ముసలము వంటి ఆయుధాలతో తులసీమాలాభూషితుడై మహా నక్షత్రాలను మరిపించే నవరత్న కిరీటాన్ని ధరించి, కనకపు కాంతులు చిమ్మే పీతాంబరాలు ధరించి పాదాల వద్ద గంగానది ప్రవహిస్తుండగా అతి నవయవ్వన రూపంలో చూసినంతనే, స్మరించినంతనే సకల పాపాలను పోగొట్టే దివ్య మంగళ స్వరూపంతో శ్రీమహాలక్ష్మీదేవి సమేతుడై శ్రీమన్నారాయణుడు వుంటాడు.

– వరాహ పురాణం

లేవలేని, మాట్లాడలేని పరిస్థితుల్లో వున్న వారి ఆరోగ్యం గూర్చి పూజలూ, వ్రతాలూ, యాగాలూ చేయాలనుకున్న రక్త సంబంధీకులు వారి దుస్తులను దగ్గర వుంచుకొని పూజలను నిర్వర్తిస్తే ఆ ఫలం వారికి అందుతుంది. అదే విధంగా తీర్థయాత్రలు కూడా చేస్తే ఫలితం వారికి అందుతుంది.

అపమృత్యు భయం ఎలా పోతుంది

తులసీ దళముల హరిపద

జలంజంబుల పూజసేయ సరసుల యమదూ

తలు జూచి ఏమి జేయ

శ్రీహరి పాదపద్మాలకు తులసీదళాలతో పూజ చేసేవారిని యమదూతలు కూడా చూడ సాహసించలేరని కవి చౌడప్ప తన పద్యాలలో తులసితో శ్రీహరిని పూజిస్తే ఎంత ఫలమో చెప్పాడు.

నారాయణ నామ మహత్తు

నారాయణ అన్న నామస్మరణ మహా పుణ్యం. అజామిళుడి పుత్రుడి పేరు నారాయణ. పుత్రుడ్ని మరణసమయంలో పిలిచి ఆ మహాపుణ్యంతో, ఆ హరినామ మహత్తుతో మహాముక్తిని పొందాడు.

గర్వమనేది ఇల్లాలికి ఉంటే ఆ గృహం కృష్ణపక్షమున చంద్రుడు క్షీణించినట్టు క్షీణిస్తుంది.

నారాయణ భక్తి కలగటం పుణ్యమంటేనే

పూర్వము తామ్రుడనే వాడు మహా పిసినారి. వ్యాపారంలో దొంగలెక్కలతో విపరీతంగా ధనం సంపాదించేవాడు. యవ్వనం అయ్యాక ఆ ధనపాపం తాలూకు మహా అవస్థలు.. మంచంలోనే అన్ని. అంతా అతను చేసిన పనులను తలుచుకుంటూ, తప్పక సేవలు చేయసాగారు. అవసాన దశ పూర్తిగా దగ్గరికొచ్చింది. ఓ జ్ఞానవేత్త 'హయ్యో.. ఎన్నో పాపాలు చేశాడు, ఇప్పుడైనా నారాయణా నారాయణా అని అనుకుంటే కాసింత పుణ్యం కలుగుతుందని నారాయణ నామాన్ని స్మరించుకోమని' చెప్పాడు. అయితే రోగగ్రస్థుడైన వానికి ఆ పుణ్యపు మాటలు వినపడలేదు. దాంతో జ్ఞానవేత్త వానికి ఎలా చెప్పాలో అర్థంకాక 'నారని' చూపించి 'నారాయణా' అని వత్తి పలికాడు. దానికి తామ్రుడు 'నార' అని ముమ్మార్లు పిలిచి కన్నుమూశాడు. హయ్యో అనుకున్నాడు జ్ఞానవేత్త. పుణ్యఫలం లేకపోతే నారాయణుడు తనని తలవనీయడు కూడా.

అంతటి వాళ్ళకే తప్పు లేదు..
మనమెంత?

వివాహం ఆలస్యం.. అప్పులు.. బాధలు.. దరిద్రం.. అవమానం ఇవేగా. తల్లి పార్వతీదేవి.. తండ్రి ఈశ్వరుడు.. తాత సకల రత్నాలకు నిలయమైన పర్వతరాజు.. అన్న గణేషుడు. తండ్రి మిత్రుడు శ్రీవేంకటేశ్వరునికే అప్పు ఇచ్చిన కుబేరుడు. ఇక తానేమో దేవతలకి సర్వసైన్యాధిపతి... సుబ్రహ్మణ్యుడు. ఆ కుమారస్వామి వివాహమే ఇంతవరకూ అవ్వలేదు. ఆ సంగతి అటుంచి సకల ప్రాణులకి సకల శక్తులనిచ్చే ఈశ్వరుడికే భిక్షాటన తప్పలేదు. చేయి చాపక తప్పలేదు. ఇక శ్రీమహావిష్ణువు.. శ్రీలక్ష్మీపతి.. ఆ స్వామీ ఆకలిదప్పికలతో భూమి మీద తిరగాల్సి వచ్చింది. పెళ్ళి కోసం శివుడూ, బ్రహ్మలను అడ్డం పెట్టి కుబేరుని వద్ద చేయి చాపాల్సి వచ్చింది. హరిశ్చంద్రుడూ నలదమయంతులు, వాసుదేవుడు మేనమామ మరియు రెండు చేతులతో బాణాలను వెయ్యగలిగిన అరివీర పరాక్రమవంతుడు అర్జునుడే తండ్రి అయినా అభిమన్యుడు నేలకొరగ తప్పలేదు. ఒక్కరేంటి ఎంతటి వారు ఎంత గొప్పవారు కూడా ఎన్నో కష్టాలు పడ్డారు. వారు పడిన

వాటిల్లో మనం పడేది, పడుతున్నది ఎంత? కాన కష్టాల గూర్చి వాపోకండి. దిగులు పడితే... అది పక్కనున్న వారు గమనిస్తే ఆ కష్టాలు మరిన్ని పెరుగుతాయని గుర్తించండి.

వైశాఖమాసంలో మామిడిపండ్ల రసము.. బాగా పండిన దోసకాయను దానం ఇవ్వటమూ, అలాగే సాయం సమయంలో పానకము, దద్ధ్యోజనమును ఆలయాల్లో ప్రసాదంగా పంచటం ద్వారా ఈతిబాధలు సమసిపోతాయని స్కాంద పురాణంలోని వైశాఖ మాస మహత్యం శెలవిస్తోంది

శ్రీమహాభాగవతం ఏం శెలవిస్తోంది

★ వానాకాలం నాలుగు నెలలు సుఖించటానికి మిగతా ఎనిమిది నెలలు కష్టించి పనిచేయాలని.

★ రాత్రి సుఖంగా నిద్రపోవటానికి పగలు మొత్తం పనిచేయాలి.

★ యవ్వనంలో సుఖించటానికి బాల్యంలో విద్యనభ్యసించాలి.

★ వృద్ధాప్యంలో సుఖించటానికి యవ్వనంలో కొంత కూడబెట్టాలి

ఇన్ని జీవ సుఖయాత్రలు చెయ్యటానికి తల్లి, తండ్రి తొలినుంచి సరైన దారిలో సంతానాన్ని పెట్టాలి. బాల్యంలో ఆకర్షణ ప్రమాదం. యవ్వనంలో కామం కాలకూట విషం వంటిది. కామం అంటే పాయసం.. ఏ పానీయ పాత్రలో పోసుకుని తాగినా అదే పాయసం. అదే ఇల్లాలి చేతితో అయితే అమృతం.. పరాయి వైపు వెళితే ఆ పాయసమే విషం.

అయిదూ ముందే నిర్ణయించబడతాయి

ప్రాణి గర్భములో వుండగానే ఆయుష్షు.. కర్మ... ధనం.. విద్య.. మరణం.. అన్నీ నిర్ణయించబడతాయి. అయితే వాటిని మార్చే శక్తి ఆ పరమాత్ముడికే ఉంది. అందుకే పూజలు, వ్రతాలు, నోములు, దానాలు, ధర్మాలు. బ్రహ్మ నుదుటిన రాసిన సుఖదుఃఖాలను సరిచేయగలిగేది శ్రీపతి మాత్రమే. పుణ్యమనే ధనం మీ వద్ద ఉంటే పర్వతాల మీదున్నా స్వర్గసుఖాలనుభవిస్తారు. ఆ పుణ్యమనే ధనమే మీ వద్ద లేకపోతే మేరునగరికొండ అనగా బంగారు కొండను చేరినప్పటికీ చిన్నముక్క కూడా వెనక్కి తీసుకురాలేరు.

దీపారాధన చేయటం ద్వారా
సకల శుభాలు.. మంగళ
ప్రదములు చేకూరుతాయి.
దుఃఖము దరిదాపులకు రాదు.
అష్టసిద్ధులూ లభిస్తాయి

సంపెంగి పువ్వు అంటే శ్రీమహావిష్ణువుకి ఎందుకంత ప్రీతి

సకల పూలపై తుమ్మెద వాలుతుంది. మకరందాన్ని గ్రహిస్తుంది. వానన చూసి సుఖిస్తుంది. కానీ మహాసుగంధ పరిమళాలను వెదజల్లేది సంపెంగి పువ్వు. అంతటి రమ్యమైన పూవు వైపు తుమ్మెద వెళ్ళదు. అందుకే సంపెంగులతో పూజ అంటే... శ్రీలక్ష్మీపతికి అత్యంత ఇష్టం. స్వామికి ఆ పూలతో పూజ చేసినట్టయితే కోరిన కోర్కె తీర్చటం తథ్యం.

పూజలూ, వ్రతాలు చేయగానే ఫలం రాదు

ఎంతటి యజ్ఞాలు చేసినా, మరెన్ని ధర్మకార్యాలు చేసినా అలాగే ఎంతటి పాపాలు చేసినా వాటి ఫలం మూడు సంవత్సరాలకి గానీ, మూడు నెలలకి గానీ, మూడు పక్షాలలో గానీ, మూడు రోజుల్లో గానీ మూడు నిమిషాల్లోగానీ జరిగి.. తగిలి తీరుతుంది. అది చేసే పూజను పట్టి. అవతలి వారు ఇచ్చే శాపాన్ని బట్టి.

పూజాది మొక్కుల నియమం

స్వగృహే పూర్ణ ఆచార పరగేహే తదర్ధక.. తదర్ధం చే వరగ్రామే.. అనగా నిత్య నియమవ్రత పూజాదికాలను, ఇంకా మొక్కులను నియమబద్ధంగా చేయాలి. అయితే ఒక్కోసారి ఏవో ఒక మానవజీవన సంబంధిత విషయాలు అడ్డువస్తాయి. అప్పుడు పూజలు, మొక్కులు ప్రదక్షిణలు చెయ్యాల్సిన విధుల గూర్చి పరాశర స్మృతి ఇలా చెబుతోంది... తమ గృహంలో అయితే సంపూర్ణంగా చేయాలి. అయిన వారింటికి వెళ్ళినప్పుడు సగం చేసినా చాలు. దూరప్రాంతాలకి వెళ్ళవల్సివస్తే అర్ధభాగం చేసినా చాలు. ఇక పుణ్యతీర్థక్షేత్ర దర్శనాలప్పుడు సదాచార నియమాలని పాటించకున్నా దోషం లేదు.

మాంసాహారం తింటే దోషమా

ఖచ్చితంగా దోషమనే శాస్త్రాలూ, పురాణాలూ చెబుతున్నాయి. వంశ సాంప్రదాయాలని విడిచిపెట్టి మాంసాహారం తినటమంటే తప్పే అని చెబుతున్నాయి. క్షత్రియ వంశంలో పుట్టినవారు మాంసం తినటము వారి సంప్రదాయం. ఆ సాంప్రదాయాల్ని అనుసరించే ఎందరో

మహాత్ములూ, పుణ్యపురుషులూ ఆయా కాలాల్లో మాంసాహారాన్ని స్వీకరించారు. అది దోషం కాదని. కానీ మాంసాహారం తినని వారి కుటుంబాల్లో పుట్టి తింటే అంతకు మించిన దోషం మరొకటి లేదని ధర్మ, పుణ్య పురాణాలు శెలవిస్తున్నాయి.

కానీ.. అని ముగించకండి

వైకుంఠములో పాలసముద్రంపై ఆదిశేషునిపై పవళించిన శ్రీమహావిష్ణువును శ్రీలక్ష్మీదేవి అడిగింది. 'స్వామీ.. బంగారానికి అంతటి వైభోగాన్నీ, గౌరవాన్నీ ఇచ్చారు. మంచి వాసనను కూడా ఇస్తే బావుండేది. చెరకు ఎంత మధురమైనది, దాన్ని పూజల్లో వుంచలేదు. చందన వృక్షం మీకెంత ప్రీతికరము.. కానీ పుష్ప జాతుల్లో లేదు. మహాపాండిత్యాన్ని ఇచ్చారు.. పాపం వారికి ధనమివ్వటం లేదు, అంతెందుకు అందమైన స్త్రీకి అందమైన భర్తనివ్వరు. అందమైన భర్తకు అనాకారి భార్యనిస్తారు. నాకెందుకో నచ్చలేదు' అన్నది. అప్పుడు శ్రీమహావిష్ణువు 'అయితే అందులో నీవు ఏది కోరితే అది మార్పు చేస్తాను'

అన్నాడు. శ్రీమహాలక్ష్మి ఆలోచించి 'అయితే అందమైన వానికి అందమైన భార్యా.. అందమైన స్త్రీకి అందగాడైనా భర్తనివ్వండి.. కానీ' అని 'ఆఁ చాల్లేండి.. ఇది చెయ్యండి' అన్నది. శ్రీమహావిష్ణువు తథాస్తు అని 'లక్ష్మీ చివరిలో 'కానీ' అన్నావు. అందుకే ఇద్దరూ అందమైన వారే అయినా వారి వద్ద ధనముండదు. నీవు కోరిక కోరినప్పుడు చివర్లో కానీ అన్నావు. కానీ అంటే మరో అర్థం తెలుసుగా...ఆలుమగలిద్దరూ అందమైన వారయితే(కానీ(ధనం) వుండదు.

తండ్రి కోపంతో అన్నా మంచే జరుగుతుంది

నచికేతుడిని పుత్రుడిగా పొందిన వాజశ్రవసుడు చేసిన యజ్ఞం విశ్వజిర్యాగ. ఆ యజ్ఞం ఒక్కరోజులోనే చేసెయ్యాలి. ఆ యజ్ఞంలో గొప్ప దానం సకల ఐశ్వర్యాలనీ ఇచ్చెయ్యాలి. ఆ క్రమంలో వాజశ్రవసుడు కోపంతో నచికేతుడిపై కోపించి మృత్యువుకిచ్చేస్తానంటాడు. దాంతో యముడు రాగా నచికేతుడు యముడిని మెప్పించి మూడు మహా వరాలను

పొందాడు. నచికేతుడి గాథలో ఉన్న మరో పరమార్థమే తల్లి, తండ్రి కోపంగా అన్నా, శపించినా సంతానానికి మంచే జరుగుతుంది. అట్టి వార్ని అనగా తల్లీ, తండ్రినీ పిల్లలు ఎలా గౌరవించాలో, లాలించాలో చెప్పటానికీ, వ్రాయటానికీ ఎన్ని కోట్ల మిలియన్ల పేజీలు కూడా సరిపోవేమో...

దరిద్రం ఎలా దూరమవుతుంది

అదత్త దానాచ్చ భవోద్దరిద్రో... దరిద్ర భావాచ్చ కరోతి పాపం.. దాన ధర్మాలు చెయ్యకపోవటం వల్లే దరిద్రం ఆవహిస్తుంది. పూజల వల్ల, వ్రతాల వల్ల... యజ్ఞయాగాదుల వల్ల దాన సంకల్పము వస్తుంది. ఆ దాన ఫలమే సంపద. పుణ్య కార్యాలప్పుడూ, తీర్థయాత్రల సమయంలో కాయో, పండో... ప్రసాదమో దానమివ్వటమంటే దరిద్రాన్ని దూరంగా ... అతి దూరంగా పంపటమే.

నిజంగా దురదృష్టవంతులు...

సిద్ధమన్నం, ఫలం, పక్వల.. నారీప్రథమ యౌవనమ్... సుభాషితం చ తామ్బూలం సద్యే.. గృహ్లాతి బుద్ధిమాన్

వేడి అన్నాన్ని... పండిన ఫలాన్ని, మగువ తొలి యవ్వనాన్ని, మంచి మాటలను, తాంబూలాన్ని వెంటనే తీసుకోవాలి. అనుభవించాలి. ఆలస్యమయితే వెనుకడుగు వేస్తే వాళ్ళు దురదృష్టవంతుల కింద లెక్కే.

పూజాదికాల్లో మంత్రాలను తప్పుగా పలికిస్తే...

సంస్కృత పరిజ్ఞానం భగవత్ వరం... అది అందరికీ వుండకపోవచ్చు. అంతమాత్రాన దోషం కాదు. మీలోని భక్తినే భగవంతుడు చూస్తాడు. పూర్వము కొందరు దొంగలు వనములో వుందాం అనటం రాక చరామః సంచరిద్దామనీ, ధనాన్ని దొంగలిద్దామని హరామః అనీ, నదులు అడ్డు వస్తే దాటేద్దామన్న అర్థంతో స్తరామో తరామః అనీ, వాటి గూర్చి భయమెందుకని నభయం స్మరామః అని సంస్కృతం మాట్లాడే రోజుల్లో వచ్చీ రానీ మాటలను మాట్లాడుకున్నారు.

చరామః హరామః తరామః స్మరామః అనే మాటల్లో అపురూపమైన పుణ్య భక్తిగల శ్రీరామ శబ్దాలుండటంతో వారికి అంతా మంచే జరిగింది. కాన పరమాత్ముడు వాసుదేవుడు మీలోని భక్తిని మాత్రమే చూస్తాడు.. మీరు

చదవటం రాక పఠిస్తే దేవుడు మిమ్మల్ని క్షమిస్తాడే గాని ఇబ్బందిపెట్టడు. సరిగా ఖచ్చితంగా మీకు అందించలేకపోతే శిక్షను మాకు(ప్రచురించేవారికి) వేస్తాడు.

తిథి తెలుసుకుంటే సంపద పెరుగుతుంది

తిథేశ్చ శ్రియమాప్నోతి.. వారాదాయుష్య వర్థనమే

నక్షత్రా ద్ధార్యతే పాపం యోగాద్రోగ నివారణమే

ప్రతిరోజు వచ్చే తిథిని తెలుసుకుంటే సంపద కలుగుతుంది. వారమును గర్తుంచుకుంటే ఆయుష్షు పెరుగుతుంది. నక్షత్రం తెలుసుకుంటే పాపాలు పోతాయి. అట్టి పంచాంగ జ్ఞానాన్ని తెలుసుకోవటంతో అనారోగ్యం దూరమవుతుంది. ఇక కరణము వల్ల కార్యసిద్ధి కలుగుతుంది. తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము తెలుసుకోవటమంటే భగవంతుడ్ని... ఆ పరమేశ్వరుణ్ని పూజించటమే. దాని వల్లనే ఆ ఫలములు.

ధనం ఎక్కడుండాలి

పుస్తకేషుచయావిద్యా పరహస్తే చ యద్ధనమే....

'పుస్తకంలో విద్యనుంచుకొని అలాగే ఇతరుల వద్ద ధనాన్ని వుంచితే అవసరమైనప్పుడూ... ఆకలి వేసినప్పుడు అక్కరకురావు. కాబట్టి పుస్తకంలోని విద్యని వంటబట్టించుకోవాలి, మీ ధనాన్ని మీ వద్దే వుంచుకోవాలి' అని చాణుక్యుడు స్పష్టంగా చెప్పాడు.

చిన్న అప్పు కూడా జ్వాలగా మారుతుంది

అగ్నేఃశేషం ఋణాచ్ఛేషం...

శత్రోశ్శేషం సశేషయేత్... అనగా అగ్ని, ఋణ, శత్రుశేషాలను ఉంచకూడదు. ఉపేక్షిస్తే నిప్పురవ్వ మహాగ్నిలా ఎలా మారుతుందో అలా మారుతుంది. చిన్న అప్పే కదా అని నిర్లక్ష్యం చేస్తే అది ఒక్కసారిగా నీ మూలధనానికి కూడా ఎసరు పెడుతుంది.

పురుషోత్తమ మాసంలో విష్ణుపూజ

నారదమహర్షికి శ్రీమన్నారాయణుడే స్వయంగా చెప్పిన అధిక మాస పూజా ఫలమిది. నారాయణుడు నారదునికి చెప్పినదాన్ని సూత మహాముని మహర్షులకి చెప్పాడు. ఈ పూజా వ్రతము చేసిన వారికి దుఃఖాలు పోతాయి. సమస్త దరిద్రాలు తొలగుతాయి. ఈనెలలో స్వామి ఆరాధన వల్ల సునాయాసంగా గోలోకము ప్రాప్తిస్తుంది. ఈ పురుషోత్తమ మాసంలో చేసిన పుణ్య దానం కోటిరెట్ల ఫలమునిస్తుంది. చాతుర్మాసాది యజ్ఞాలు చేసినా వారి పుణ్యం పోగానే మరల భూతలి యందు జన్మిస్తారు. ఈ పురుషోత్తమ మాసంలో ఆరాధన వల్ల పుణ్యం ఎన్నటికీ తీరనిది అవుతుంది. ఈ మాసానికి అధిపతి శ్రీమహావిష్ణువే. అందుకే ఆయన నామాన్నే ఆ మాసానికి పెట్టాడు. పురుషోత్తమ మాసంలో భక్తుల అపరాధాలు కూడా లెక్కకి రావు. ఈ మాసంలో ఆరాధనలు చేసిన వారి కోరికలను శ్రీమహావిష్ణువు ఒక్క కనురెప్పపాటు కాలం కూడా ఆలస్యం కాకుండా

తీర్చేస్తాడు. ఆ మాసంలో శ్రీమహావిష్ణువు పూజ సౌభాగ్యాన్నీ, చక్కని సంతానాన్నీ, ఇంకా సంపూర్ణ పతి సుఖాన్ని ఇస్తాడు. స్వర్గంలో జరిగే సకల భోగాలను ఇలలోనే ఇస్తాడు. అధికమాసం అంటే ఐశ్వర్యప్రాప్తి అని.

★ అధికమాసంలో పూజాదులు మరచినందుకే పాండవులకి అన్ని కష్టాలు వచ్చాయి.

★ అధికభయాదులు ఈ మాసంలో ఆరాధనము చేయకపోవటం ద్వారానే వచ్చాయని శ్రీకృష్ణుడు ద్రౌపదీదేవితో చెప్పాడు.

★ ఈ మాసంలో తీర్థస్నానం ఫలం చెప్పనలవి కానిది. శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతికరమైన ఈ మాసంలో తీర్థస్నానం చేసి సకల ఇష్టాలనూ తీర్చుకోమని దూర్వాస మహర్షి తనని ఆశ్రయించిన వారికి శెలవిచ్చాడు.

★ పురుషోత్తమ మాస పూజాదికాల వల్ల శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రం వేసినా వారిని ఏమీ చెయ్యలేదు. శత్రువులన్నవారు వుండరు.

★ పురుషోత్తమ వ్రత పూజాదికాల వల్ల చెడురోజులు సమసిపోతాయి.

★ దేవతలంతా పురుషోత్తమ మాస ఆరాధన చేసి తమ శక్తులను పెంచుకుంటారు.

★ మహేశ్వరుని సతి పార్వతీదేవి ఈ వ్రతాన్ని చేసి ముప్ఫయి తీపి పదార్థాలను దానం చేసింది.

వర్షాలు పడకపోతే చేసే ఓ యజ్ఞము

యజ్ఞమంటే లోకం కోసం చేసేది.. లోకకళ్యాణం కోసం చేసేది. యాగమంటే మన కోసం.. మన కుటుంబశ్రేయస్సు కోసం చేసేది. వర్షాలు పడకపోతుంటే గోవివాహం చేస్తే వర్షాలు పడతాయి. అనాదిగా వస్తున్న ఈ ఆచారంలో గృహవివాహంలాగే పెళ్ళిని జరిపించి సకల పదార్థాలతో భోజనాలు పెట్టించాలి.

'హరి ఓం' అని జపిస్తే

'ఓం'కారం జపించటం వల్ల ఇంద్రియాలపై ప్రభావం పడుతుంది. తద్వారా అనేకమైన శారీరక దోషాలు తొలగిపోతాయి. ఆరోగ్యంగా వుంటాము. 'హరిఓం' అని జపం చేస్తే చాలు అంతకన్నా శ్రీహరి

మన నుంచి ఏమీ కోరడు. ఇక 'శ్రీరామ రామ రామ' అనే తారక మంత్రాన్ని జపించండి. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇక కళ్ళకూ, వీర్యవృద్ధికీ, దీర్ఘాయుష్షుకూ 'ఓం సూర్యాయనమః' అని ప్రతిరోజు జపించండి.

హిరణ్యకశ్యపుడిని సంహరించిన సమయం

వైశాఖమాసశుక్ల పక్షంలోని పూర్ణిమనాడు ముందు వచ్చే చతుర్దశి నాడు ఉభయ సంధ్యలకు నడుమ అనగా సాయంకాల సంధ్యా కాలంలో ఇటు పగలూ, అటు రాత్రి కాని వేళ సగం నరుడూ, సగం జంతువు రూపంలో అటు భూమీ, ఇటు ఆకాశం కాని తన తొడలపై హిరణ్యకశ్యపుడిని ఉంచి వాని పొట్టను చీల్చి ప్రేగులను మెడలో వేసుకున్నాడు అవతారమూర్తి శ్రీనారసింహస్వామి. ఆ స్వామిని పూజిస్తే ఆపదలు తీరుతాయి. ప్రహ్లాదుడిని రక్షించినట్టు సదా పూజించిన వారిని రక్షిస్తుంటాడు శ్రీలక్ష్మీనరసింహ స్వామి.

మహాపుణ్యక్షేత్రాలను దర్శించిన ఫలం

గంగాసాగర సంగమం, కురుక్షేత్రం, కాశీ, ప్రయాగ, పుష్కరము వంటి పుణ్యక్షేత్రాల్లో పది సంవత్సరాల పాటు సేవించి, నివశించిన పుణ్యం మాఘమాసంలో మూడురోజులు స్నానపూజాదికాలను చేయటం ద్వారా పొందగలరు.

మహోన్నత సంతానం కోసం

రావిచెట్టు.. లేదా నిమ్మచెట్టు.. ఇంకా వేపమొక్కను నాటాలి. పది చింత చెట్లను పది ప్రదేశాల్లో గానీ అలాగే వెలగ, రేగు, ఉసిరిక చెట్లు మూడు మూడు చొప్పున గాని నాటితే ధనం, కీర్తి సాధించే సంతానం కలుగు తుంది. చెడు నడతలో వున్న సంతానం సరైనదారిలో వస్తారు. అలా మొక్కలు నాటిన వారికి యజ్ఞము, దానములు చేసిన ఫలం. ఇంకా తులసీ వృక్షము నాటితే సుందరమైనవాడూ, మంచి సంభాషణా పరుడూ అయిన

భర్త లభిస్తాడు. ఇంకా ఫల పుష్ప వృక్షాలనూ, నీడనిచ్చే వాటినీ నాటినందుకు శ్రీమహావిష్ణువు గరుడవాహనుడై వచ్చి మరీ వరాలిస్తాడు. ఈ ఫలం గూర్చి స్పష్టంగా పద్మపురాణంలో వివరించి వుంది.

సాలగ్రామ శిలాపూజ

సాలగ్రామ శిలాతీర్థంను శిరమున చల్లుకుంటే పవిత్ర పుణ్యక్షేత్రాలన్నింటిలోనూ తీర్థస్నానం చేసిన ఫలం. ఆ ఫలం వల్ల ఎంతటి అధోగతి పరిస్థితులైనా చక్కపడతాయి. మహా సంపదలు కోసం సాలగ్రామ శిలను అయిన వారికి దానంగా ఇస్తే ఆ ఫలం కలుగుతుంది.

సప్తగంగలు

జాహ్నవి.. వృద్ధగంగ, కాళింది, సరస్వతి, కావేరి, నర్మద, కృష్ణవేణి... ఇవే సప్తగంగలు. వైశాఖ మాసంలో కనీసం ఒక్క గంగలోనైనా స్నానమాచరించండి. శుభప్రదమవుతుంది.

ద్వాదశి తిథిలో తులసి పూజ

ఆ రోజున .. ఆ ద్వాదశి తిథిలో బ్రహ్మాది దేవతలు కూడా తులసి పూజను వైభోగంగా చేస్తారు. ఆనాటి తులసి పూజ మణులు, బంగారము, పుష్పాలు, ముత్యాల వంటివి దానం చేస్తే వచ్చే ఫలంతో పాటు మహాఫల సిద్ధి కూడా కలుగుతుంది.

మనుజుడు పదకొండు ఇంద్రియాల
ద్వారా చేసిన సకల పాపాలు
'ఏకాదశి వ్రతం' చేయటం ద్వారానే
సమసిపోతాయి. శ్రీమహావిష్ణువుకి
అత్యంత ప్రియమైన ఏకాదశి వ్రతం
చెయ్యటమంటే మహా సుఖసౌఖ్యాలు
మీకు అత్యంత చేరువలో ఉన్నట్టే
అని శ్రీలక్ష్మీ పురాణం శెలవిస్తోంది

అశూన్యశయన వ్రతం

ఇది శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవికి చెప్పినది. దుఃఖాలను పోగొట్టేది. శుభాలని ఇచ్చేది. శ్రావణమాసం శుక్ల పక్ష విదియనాడు చేయాలి. ఈ వ్రతంలో తప్పని సరిగా శ్రీమహాలక్ష్మీసహిత శ్రీమహావిష్ణువును పూజించాలి.

పూర్వీకుల ధనం తిరిగి పొందాలంటే

పూర్వము పాంచాల దేశ రాజు పురయశుడునకు ఇలాగే మహా సంపదలన్నీ అడుగంటి పోయాయి. దానికి తోడు అనారోగ్యం. మహా బాధలు పడ్డాడు. భార్య శిఖినితో అరణ్యాలపాలయ్యాడు. శ్రీవిష్ణు భక్తుడైన తనకు ఇంతటి అగత్యములు ఎందుకు ఏర్పడ్డాయని తాపసులను అడిగాడు. పూర్వజన్మ ఫలమని చెప్పి... వైశాఖ మాస పూజాదికాలు చేయటం ద్వారా సమస్త పూర్వజన్మ దోషాలు పోయి అన్నీ నీకు అమరుతాయని చెప్పారు. ఆ విధంగా వైశాఖ మాసంలో శ్రీవిష్ణుభగవానుడ్ని పూజించి అన్నింటినీ తిరిగి పొందాడు.

వాల్మీకి జననం

వైశాఖ మాసంలో పనస...జామ... మామిడి వంటి పండ్లచెట్లను నాటి వైశాఖ మాస ధర్మములు పాటించటం వల్లే వాల్మీకి వంటి పుత్రుడ్ని కన్నాడు కృణుడు. ఆ జన్మలో మహా తపస్సు చేయగా చుట్టూ పుట్ట పెరిగింది. తపము అయ్యాక సాంసారిక భోగాలపై మనసు పుట్టింది. దాంతో శుక్ర స్కలనము అయింది. దాన్ని ఓ ఆడపాము గ్రహించి మింగింది. దాంతో వనచరుడు జన్మించాడు. అతనే వాల్మీకి మహర్షి. ఈ వాల్మీకి మహర్షి పుట్టుక గాథను తెలుసుకున్నవారికీ, చెప్పిన వారికీ మహాపుణ్యము చేకూరుతుందని నారదుడు అంబరీషునితో చెప్పాడు.

స్కాంద పురాణం ప్రకారం అక్షయ తృతీయ నాడు చెయ్యాల్సిన విధులు

శృతదేవుడు ఇలా చెబుతున్నాడు. సూర్యోదయము ముందే స్నానం ఆచరించాలి. శ్రీమహావిష్ణువు పూజ చేయటమంటే మహా యజ్ఞం చేసిన ఫలం. స్త్రీ విషయంలో జరిగిన అన్ని దోషాలు పోయే పుణ్య తిథి ఈ అక్షయ

తృతీయ. బలిమహారాజును గెలిచిన ఇంద్రుడు విజయ అహంకారంతో ఉతథ్యముని భార్యని బలవంతంగా అనుభవించి మహా దోషాన్ని పొందాడు. దాంతో సమస్త సంపదలు పోయాయి. బృహస్పతి ఆదేశంతో మధు సూదనునికి ప్రీతికరమైన వైశాఖ మాసంలోని శుక్ల పక్షంలోని అక్షయతృతీయ నాడు స్నానపూజాదికాలు నిర్వహించి తిరిగి సకలం పొందాడు.

కొంగున కట్టేసుకోరాదు

మందూ మాకులతోనో, మరొక విధంగానో భర్తని వశపరుచుకున్న వారికి సంకల్పము కలుగదు. అట్టి స్త్రీ మహా నరకాల పాలవుతుందని స్కాంద పురాణం శెలవిస్తోంది. సూటిపోటి మాటలతో బాధలకు గురిచేసిన భార్య అనగా భర్తని బాధపెట్టిన స్త్రీ వైశాఖ మాసంలో శ్రీమహావిష్ణువుకి పూజ చేసి శరణు పొందితే ఆ దోషం పోతుందని పురాణాలలోకెల్లా పెద్దదైన పురాణం స్కాంద పురాణం శెలవిస్తోంది.

స్త్రీ శుభలక్షణాలు

ఎత్తులో తనకన్నా తక్కువదీ, సౌమ్యమైన ముఖము కలదీ, మృదువుగా మాటాడునదీ, పెద్ద స్తనములకలదీ, సన్నని నడుము కలదీ, సర్వనామము పేరు గలది. అలాంటి శుభలక్షణాలు ఎనిమిది... అవి శరీరము, సుడులు, గంధము, భామ, సత్త్వము, స్వరము, నడక, రంగు.... ఈ ఎనిమిది విధముల శుభలక్షణమున్న స్త్రీని లక్షణవతి అనీ ఇట్టి స్త్రీని వివాహము చేసుకున్నవాడు సుఖపడతాడని చెప్పాడు అగస్త్యుడు.

దీర్ఘాయువు కోసం

భుజిస్తున్న స్త్రీను చూడకూడదు. అలాగే దూడకు పాలిచ్చే గోవును చూడకూడదు. సంధ్యాకాలంలో పశ్చిమ ముఖంగా, ఉత్తరముఖంగా పడుకోకూడదు. నిలబడి నీళ్ళు త్రాగకూడదు. అధిక ఆయుష్షుకు తడిపాదాలతో, తడిచేతులతోనే భుజించాలి. నిలబడి దోసిలితో నీళ్ళు త్రాగరాదు. సూర్యచంద్ర నక్షత్రగమనములను

చూడరాదు. ఉల్లిపాయనూ, ఊరపందినీ, ఎల్లిపామును తినరాదు. వేళ్ళతో దంతధావనం చేయరాదు. (కొంతమంది ఉప్పుతో పళ్ళను చేతితో రుద్దుకుంటారు.. అది తగదు)

– అగస్త్య మహర్షి

వైశాఖ మాసంలో

శ్రీమహావిష్ణువును స్నాన,జప,పూజ

దానాదికాలు చెయ్యలేని

పరిస్థితిలో ఉన్న వారు కనీసం

వైశాఖ మాసము మూడు చివర

తిథులు త్రయోదశి, చతుర్దశి,

పూర్ణిమలలో పూజాదికాలు

చేయటం ద్వారా వైశాఖ మాసం

తిథులన్నింటిలోనూ చేసిన ఫలం

కలుగుతుంది.

వైశాఖమాసంలో చేయరాని పనులు

ఈ మాధవమాసంలో నువ్వులనూనె పూసుకొని స్నానం చెయ్యటం, పగటి పూట నిద్ర, కంచుపాత్రలో పదార్థాలను తినటం, వేళకాని వేళలో స్నానం... దుర్వ్యసనాలకి దూరంగా వుండటంతో పాటు విస్తరాకులో భోజనం చెయ్యాలి, రాత్రి భోజనము చేయరాదు.

భగవంతుడు ఎవరినీ బాధలకీ, కష్టాలకి గురిచెయ్యడు

సకల ప్రాణికోటి ఆ భగవంతుని సంతానమే. తల్లీ, తండ్రీ బిడ్డలని కష్టాలు పెడతారా? పిల్లలు చెడునడతతో బాధలు పడుతుంటే కన్నతల్లి, తండ్రి ఎలా బాధపడతారో అలా స్వామి బాధపతాడు. మొక్కు తీర్చలేదనో, తనను పూజించలేదనో ధనకష్టాలనూ, సమస్యలనూ రానీయడు. ఇదే విషయం శ్రీమహాలక్ష్మీదేవికి శ్రీమహావిష్ణువు చెబుతూ...'భృగుమహర్షి తెలిసీ తెలియక వక్షస్థలం మీద తన్నాడు. వదిలేయి దేవీ.. మన పిల్లవాడే కదా' అని అంటాడు. కాన దేవుడు మన కష్టాలకి కారణం కాడు. మనం చేసుకున్నదానికి మనమే అనుభవించాలి. లేదా స్వామిని వేడుకొని సరిచేసుకోవాలి.

తిరుమల పూలబావి

వైఖానసుడు అనే శ్రీకృష్ణభక్తుడు ఆ శ్రీకృష్ణుడిని చూడాలని మహా తపస్సు చేశాడు. శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయ్యాడు. ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. నిన్ను సదా చూస్తుండాలని కోరుకున్నాడు. దానికి ఆ స్వామి శేషాద్రిపై వరాహ క్షేత్రంలో అవతరించినప్పుడు నీ వరం పొందగలవని చెబుతాడు. ఆపై స్వామి కోసం చక్కని పూలతోటను పెంచేలా చేశాడు. నీటి కోసం బావిని తవ్వించాడు. ఆ బావే పూలబావి.

మాధవ(వైశాఖ)మాసంలో శ్రీమహావిష్ణువును ఎలా పూజించాలి

★ సంసారులు ఈ వైశాఖ మానంలో సూర్యోదయానికి ముందే స్నాన పూజాదికాలు ముగిస్తే శ్రీమహావిష్ణువు ప్రసన్నుడవుతాడు.

★ ఈ మాధవ మాసంలో సకల పుణ్య నదీ తీర్థాలు సకల ప్రదేశాల్లోని నీటిలో కలుస్తాయి.

★ ఈ వైశాఖ మాసంలో సూర్యోదయం నుంచి ఆరుఘడియలు వరకూ వైకుంఠవాసుని ఆజ్ఞతో సర్వతీర్థ దేవతలు భూమిపైనున్న జలంలో వుంటారు.

★ అనేక దోషాలూ, బాధలూ వున్నవారు ఈ మాసంలో గొడుగును దానం చేయటం ద్వారా సమసిపోతాయి.

★ దోసకాయ, బెల్లమును దానంగా ఇవ్వటం ద్వారా సుఖశాంతులు లభిస్తాయి.

★ కార్తీకమాసం కన్నా మాఘమాసం గొప్పది. మాఘమాసం కన్నా వైశాఖమాసం గొప్పది.

★ మాధవ మాస ప్రియుడైన శ్రీమహావిష్ణువుకి అనేక పూలతో అలంకరణను గుడిలో చేయిస్తే మొగలిపువ్వు వద్దకు తుమ్మెదలు ఎలా వెళ్ళవో, ఎలా ఆస్వాదించలేవో అలా మీ మకరందం అనే మీ ధనం, సుఖాలు భద్రంగా మీ వద్దనే వుంటాయి.

★ ఈ మాసంలో భాగవతం కొద్దిగా చదివినా, విన్నా మహాఫలము పొందుతారని స్కాందపురాణం శెలవిస్తోంది.

★ సకల తీర్థములు సంవత్సరం పర్యంతము పాపుల పాపాలని పోగొట్టిన ఆ పుణ్య తీర్థాలు ఈ వైశాఖమాసంలో శ్రీమహావిష్ణువుని పూజించి తమలో భక్తులు వదిలిపెట్టిన పాపాలను పోగొట్టుకుంటాయి.

★ ఈ వైశాఖ మాస మహత్మ్యం గూర్చి పార్వతీదేవి ఈశ్వరుణ్ని అడిగితే ఆ పరమేశ్వరుడు ఈ వైశాఖ మాస మహత్యం గురించి చెప్పటం ప్రారంభించాడు. వందసంవత్సరాల సమయం దాటిపోయినా పూర్తవ్వలేదు.

సుదర్శన మహామంత్రాన్ని పఠిస్తూ ఎర్రని తామరపూలతో శ్రీనివాసునికి పూజాదికాలు చెయ్యటం ద్వారా శత్రు నాశనం జరుగుతుంది. అలా చేసే సంహారుడనే రాక్షసుడ్ని సంహరించాడు మహాచక్రవర్తి.

అద్భుత సౌందర్యరాశి అయిన సతి కోసం

మాఘశుక్లద్వాదశి నాడు శంఖ,చక్ర, గదా పద్మధారి కౌస్తుభమణి విరాజితుడిని, వనమాలను ధరించిన శ్రీమహావిష్ణువును శంఖోదకముతో అభిషేకం చేస్తే ఎంతటి కోరికయినా సిద్ధిస్తుంది. పురుషులకి అప్సరస వంటి భార్య లభిస్తుంది.

అమృతం పుట్టిన తిథి

వైశాఖ శుక్ల ఏకాదశి తిథినాడే అమృతం లభించింది. త్రయోదశి తిథి నాడు శ్రీమహావిష్ణువు దేవతలకి అమృతం పంచాడు. చతుర్దశి తిథి నాడు రాక్షసులను సంహరించాడు మధుసూదనుడు.

భృగుమహర్షి చెప్పిన దివ్యస్నానం

కామధేనువు సకల కోర్కెలను ఎలా తీరుస్తుందో, చింతామణి ఎలా మనోరథములను తీరుస్తుందో అలా మాఘస్నానము సమస్త ఇష్టాలనీ, కోర్కెలనీ తీరుస్తుందని భృగుమహర్షి శెలవిచ్చి ఉన్నాడు. ఆ మాఘస్నాన పూజ

దివ్య స్నానమని దేవలోకంలోని గంగలో స్నానం చేసినంత ఫలమని ఆ మహాత్ముడు, ఆ పుణ్య పురుషుడు విద్యాధరునికి చెప్పాడు.

అశ్వమేధ యాగం చేసిన ఫలం

ఇబ్బందిపడుతున్న గోవును సంరక్షించిన వారికి.. రోగాలతో, రొప్పులతో బాధపడుతున్న వారికి వైద్యం అందించటమంటే అశ్వమేధ యాగం చెయ్యటమే...

ధనమనే యజ్ఞ ఫలం ఎవరిని చేరుతుంది

మహాపుణ్య ఫలాన్ని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఎవరికివ్వాలన్న సంశయం కలగటంతో నారదుని మాటలతో భృగుమహర్షి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని పరీక్షిస్తాడు. తుదకు రాజసగుణము, తామసగుణములు లేని సత్వగుణసంపన్నుడు శ్రీమహావిష్ణువే గాన వానికే ఇవ్వాలని భావించారు. కాన యజ్ఞ ఫలమనే మన ధనం ఆ రెండు గుణాలు లేని వారికే అందుతుంది.

మాఘమాస మహత్యము

★ ఈ మాఘస్నాన పూజల వల్లనే అరుంధతి శీలపరాయణురాలైనది. రోహిణి సౌభాగ్యవతయ్యింది.

★ ఇంద్రుని భార్య శచీదేవి యౌవనసంపన్నురాలైంది.

★ మాఘస్నానమనంతరం బెల్లము, తిలలు దానం చేస్తే కోరిన కోర్కె సఫలం అవుతుంది.

★ అన్ని దానాలలో కెల్లా సకల పాపదోష నివారణము తిలాదానమే. అందుకే మాఘమాసంలో తిలల దానము ఆయుష్షును, ఆరోగ్యాన్నీ పెంచుతుంది.

★ ఈ మాసంలో భోజనాలు పెడితే పితరులకి సంతృప్తి కలుగుతుంది.

★ పుణ్యం కోసం, పరలోక సౌఖ్యం కోసం చెప్పులు దానం చేయాలి. అంతేకాక ఇహలోక సౌఖ్యాలు కూడా దీని వల్ల సిద్ధిస్తాయని భృగువు చెప్పి వున్నాడు.

★ ఏకాదశీ వ్రతం చేసి ద్వాదశిలో నూనె రాసుకోకూడదు. పూర్వము పురూరవుడు ద్వాదశి రోజు తైల సేవనము చేసి అనారోగ్యం కొనితెచ్చుకున్నాడు.

★ మహా ఆపదలను, విపత్తులను సహితం మాఘమాస స్నానం నిలువరిస్తుంది.

★ మాఘమాస స్నానం చేయువారికి ఆరోగ్యము, ధనము గల మంచి భాగస్వామి లభిస్తాడు.

★ వ్రత, దాన, తపములతో కూడా ప్రసన్నుడవ్వని శ్రీమహావిష్ణువు ఈ మాఘమాస స్నాన పూజల ద్వారా ప్రసన్నుడవుతాడు.

★ తిలోత్తమ మహా సౌందర్యవంతురాలినవ్వాలనే కోరికతో ఈ మాఘమాస స్నాన పూజ చేసి అనుకున్నది సాధించింది. సూర్యుని రథంలో స్థానం సంపాదించింది.

★ సంతానం, సత్ప్రవర్తన కోసం చెడు నడతలోనున్న వారు ఈ మాసస్నానం చేయటం ద్వారా మంచి మార్గంలోకి వస్తారు.

★ మాఘమాసంలో ప్రయాగలో అనగా త్రివేణీ సంగమంలో ఒక క్షణం పాటు స్నానమాచరించటం అనేది ఎంతో పుణ్యం వుంటే గానీ సాధ్యపడదు.

★ శ్రీలక్ష్మీనారాయణులు, పార్వతీపరమేశ్వరులు, అదితి, దితి, సమస్త దేవతలు వారి వారి భార్యలతో ఇంకా దేవలోక అప్సరసలు ఘృతాచి, మేనక, రంభ, ఊర్వశి, తిలోత్తమ, మహర్షులు, ఋషులు ఈ మాఘమాసంలో త్రివేణి సంగమంలో స్నానం చేసి తరించటానికి తరలివస్తారు.

★ ఈ మాఘమాస స్నాన పూజ బదరీలో చేస్తే సకల దోషాలు పోతాయి. అధిక ధనం కోసం నర్మదా నదిలో చేయాలి. యమునా నదిలో స్నానం సమస్త కోర్కెలు నెరవేరుతాయి. సముద్రంలో కలిసే నదిలో స్నానం చేయటం ద్వారా కుటుంబ సౌఖ్యం కలుగుతుంది. నైమిశారణ్యంలో స్నానమాచరిస్తే శ్రీమహావిష్ణువు పరిపూర్ణ కరుణా కటాక్షాలు లభిస్తాయి.

కీర్తి ద్వారా ధనం రావాలి.. అధికారం రావాలి. కేవలం కీర్తి మాత్రమే వస్తే ఆ కీర్తి తాలూకు ఆనందాన్ని అనుభవించలేరు. 'పేరు గొప్ప ఊరు దిబ్బ' సామెతలా కీర్తి తెచ్చుకోవద్దు.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ఏ దీపం పెడితే ఎటువంటి ఫలం

★ వ్యాపారంలో వున్నవారు వ్యాపారాభివృద్ధికొరకు ఆవునేతి దీపాన్ని పెట్టాలి. ఆవుపాలను నివేదించాలి.

★ ధనం కోసం నువ్వుల నూనెతో దీపాన్ని పెట్టి దానిమ్మ, అరటి, కమలాల వంటి పండ్లను సమర్పించాలి.

★ దంపతుల్లో అన్యోన్యత లేకున్నా, లేనిపోని సమస్యలు వస్తున్నా ఆవునేతితో దీపం పెట్టి బెల్లాన్ని నివేదించాలి.

★ వివాహం కాని వారు వారి వారి మనోరథాలను తీర్చుకునేందుకు అరటిపండ్లను నైవేద్యంగా పెట్టి ఆవునేతి దీపాన్ని పెట్టాలి.

★ ఉద్యోగంలో సమస్యలూ, చీకాకులు వున్నవారు ఆవునేతి దీపం పెట్టి ఖర్జూరాలను స్వామికి సమర్పించాలి.

శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవిని భార్యగా ఎలా పొందాడు

సకల సృష్టి చేసిన బ్రహ్మదేవుడు యజ్ఞం చేసిన పవిత్ర పుణ్యప్రదేశం ప్రయాగ. బ్రహ్మదేవునికి సృష్టిచేసే శక్తి అక్కడ స్నానమాచరించుట ద్వారానే కలిగింది. శ్రీమన్నారాయణుడు సౌభాగ్య సతి కావాలని ఇక్కడ స్నానమాచరించే కోరుకున్నాడు. అందువల్లే అమృత మథనంలో జన్మించిన లక్ష్మీదేవి పత్నిగా లభించింది. ఇక్కడ మూడు రోజులు తపస్సు చేయటం ద్వారా త్రిశూలధారి త్రిపురాసురులను రాక్షసులను సంహరించాడు. పుత్ర సంతానం కోసం నహుషుడి పుత్రుడు యయాతి ఇచట స్నానం చెయ్యటం వల్లే సంతోషించే సకల సర్వోన్నతుడు జన్మించాడు. కుబేరుని సంపదలు స్థిరంగా వుండటానికి కూడా ఇక్కడ స్నానమహత్యమే కారణము.

'ఏకాదశి' అంతటి మహాత్మ్యాన్ని ఎలా పొందింది

మురాసురుడనే రాక్షసుడు దేవతలను మహాబాధలు పెడుతుండటంతో అంతా వైకుంఠవాసుడ్ని శరణువేడారు. శ్రీలక్ష్మీపతి వారికి అభయం ఇచ్చాడు. ఆపై తన సంకల్పంతో ఏకాదశి తిథిలో ఒక కన్యను సృష్టించి మురాసురుణ్ని సంహరించమన్నాడు. ఆ కన్య ఆ రాక్షసుడ్ని సంహరించింది. దేవతలు సంతోషించాడు. నారాయణుడి చేత ఆ ఏకాదశి తిథినాడు జన్మించిన కన్య శ్రీమహావిష్ణువును మూడు వరాలు అడిగింది.

★ తాను ఎప్పుడు జన్మించిందో ఆ తిథి పేరు అనగా ఏకాదశి సర్వతిథుల్లో అత్యంత ప్రధానమైనది అవ్వాలని.

★ తాను శ్రీమహావిష్ణువు భక్తురాలిగా శ్రీవిష్ణుప్రియగా సకల లోకాలచే గుర్తింపబడాలని.

★ ఆ ఏకాదశి తిథిలో విష్ణుపూజలు చేసిన వారి కోర్కెలు తీరాలని.

ఏకాదశితో శ్రీమహావిష్ణువు 'తథాస్తు' అన్నాడు. ఆనాటి నుంచి ఏకాదశి తిథి అత్యంత పుణ్యప్రదమైన తిథిగా లోకాలలో వ్యాప్తి చెందింది. పగటిపూట విష్ణువునీ, రాత్రి యందు శ్రీలక్ష్మినీ ధ్యానించి భజనలూ ఇంకా ద్వాదశి పారాయణాలూ, వ్రత నియమాలు ఆచరించే కుచేలుడు, రుక్మాంగదుడు వంటి ఎందరో చేసి అనంతమైన ఫలాన్ని పొందారు.

తప్పయినా, ఒప్పయినా
బలవంతులతో విరోధం
పెట్టుకోకండి... కానీ పరోక్షంగా
తెలివీ, లౌక్యాల్నీ ఉపయోగించండి.
ఎలాంటి ధనసంబంధిత, వ్యవహార
విషయాల్లో మీకన్నా వయసులో
ఒక్కరోజు పెద్దవారు చెప్పినా
వినకండి. ఆలోచించండి.
పెద్దవారంటే తల్లీ, తండ్రీ వంటి వారు
కాదు... అట్టి వారు దైవస్వరూపులు.

భూదేవి ప్రతిరోజూ

ఆశీర్వదిస్తుంది

బ్రహ్మీ ముహూర్తంలో నిద్రలేచి ఇష్టదైవాన్ని స్మరించి లేదా స్మరించకపోయినా పక్క మీద నుంచి కాలు నేలమీద పెట్టగానే భూదేవి అంటుంది 'నా మీద కాలు పెట్టినా పర్వాలేదు, జాగ్రత్తగా తీసుకెళ్ళు మళ్ళీ గృహానికి చేర్చు.' దానికి ఆ కాలు 'అమ్మా నేను సక్రమంగానే నా విధిని చేస్తాను. కానీ ఆయన నోరే నాకు సమస్యలు తెచ్చి పెడుతుంది. కాలికి వత్తాసుగా 'భూదేవి తల్లీ.. ఆయన నోటి వల్ల ఆ నోటికేం సమస్య, బాధ రాదు.. కాళ్ళకి కూడా ఏమీ కాదు. నా వీపుకే పడేది దెబ్బలు... కాన తల్లీ ఆ నోరు అదుపులో పెట్టుకుంటే మా అవయవాలన్నింటికీ సుఖం, శాంతి..' అని వీపు నిత్యం చెబుతుంది. కాన నోటిని....!?

దశమీవృద్ధి ఏకాదశి చేయకూడదు

ఏకాదశి శ్రీమహావిష్ణువుకి ప్రీతికరం. దీన్నే హరవాసరమని కూడా చెప్పుకుంటారు. దశమీవృద్ధితో కూడిన ఏకాదశి ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరాదు. దశమీవృద్ధితో ఏకాదశి చేస్తే ఎన్ని పుణ్యక్షేత్రాలు తిరిగినా ఆ పాతకం పోదు.

తిరుమల క్షేత్రపాలకుడు

ధ్వజస్తంభ మండపం దగ్గరలో బలిపీఠానికి ఈశాన్య మూల ఒకటిన్నర అడుగుల క్షేత్రపాలక శిల కలదు. అ శిలే శివుడు. తిరుమల క్షేత్రపాలకుడు శివుడు.

తిరుమల శ్రీవారి నైవేద్యాలు

ముఖ్యంగా లడ్డు... ఇంకా వడ.. పులిహోర, దోశ, చక్కెరపొంగలి, దద్యోజనం, బెల్లం దోశ, పోళీలు, ఉండ్రాళ్ళు, అప్పాలు, బూరెలు, కేసరిబాత్, జిలేబి, నువ్వులు బెల్లం కలిపి దంచిన పిండి, పొంగళ్ళు, పాయసం, పెద్ద పెద్ద నెయ్యి దోశెలు, కదంబం, బాగా కాచి చల్లార్చిన గోరువెచ్చని తియ్యని పాలు.. పంచామృతం. అట్టి వాటిని స్వామికి ఆరగింపు చెయ్యటం ద్వారా సమర్పించటం ద్వారా శ్రీనివాసుని దివ్యకటాక్షాలను పొందవచ్చని భవిష్యోత్తర పురాణం శెలవిస్తోంది.

24 ఏకాదశులు

ఏకాదశి ప్రతినెలలో రెండుసార్లు వస్తుంది. శుక్ల, కృష్ణ పక్షాలలో వస్తుంది. అలా పన్నెండు నెలల్లో రెండు చొప్పున ఇరవైనాలుగు ఏకాదశులు వస్తాయి.

★ చైత్రశుద్ధ ఏకాదశి : దీన్నే కామదైకాదశి అంటారు. సంగీత సాధన చేసే వారు ఈనాడు పూజని కావించిన మహా కీర్తిని పొందుతారు.

★ చైత్రబహుళ ఏకాదశి : దీన్నే వరూధిన్యేకాదశి అని అంటారు. ఈ తిథి వ్రతము మహా దాన ఫలం.

★ వైశాఖ శుద్ధ ఏకాదశి : దీన్నే మోహిన్యేకాదశి అంటారు. చెడు అలవాట్లతో సకలం పోగొట్టుకున్న వారు లేదా వారికోసం ఈ ఏకాదశి చేయటం ద్వారా మంచి మార్గంలో పడతారు.

★ వైశాఖ బహుళ ఏకాదశి : అపదైకాదశి అని పిలుచుకునే ఈ నాటి ఏకాదశిపూజ వల్ల పుణ్యక్షేత్రాల్లో చేసిన స్నాన ఫలం కలుగుతుంది.

★ జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి : దీన్నే నిర్జలైకాదశి అని అంటారు. ఈనాటి ఏకాదశి వ్రత పూజలో నీరు కూడా తాగరాదు. అలా చేయకుండా పూజాదికాలు చేయటం

ద్వారా ఇరవై నాలుగు ఏకాదశులూ పూజ చేసిన ఫలం కలుగుతుంది.

★ జ్యేష్ఠ బహుళ ఏకాదశి : యోగిన్యేకాదశి అని అంటారు. ఈనాటి పూజాదికాల వల్ల అనేక దోషాలూ, పాపాలూ సమసిపోతాయి. మీరు తెలిసీ తెలియక చేసిన పాపాలు అగ్నిలోపడ్డ ఎండిన ఆకుల్లా మాడిపోతాయి.

★ ఆషాఢ శుద్ధ ఏకాదశి : శయనైకాదశి అని అంటారు. దీనినే తొలిఏకాదశి అని కూడా అంటారు. చాతుర్మాస్య దీక్ష ప్రారంభించేది ఈ ఏకాదశి నాడే. శ్రీమహావిష్ణువు .... ఆ వైకుంఠవాసుడు ఈ నాడే క్షీరాబ్ధిశయనుడవుతాడు.

★ ఆషాఢ బహుళ ఏకాదశి : దీన్నే కామితైకాదశి అంటారు. ఈ తిథిలో పూజాదికాలు అభీష్టాలను నెరవేరుస్తుంది.

★ శ్రావణ శుద్ధ ఏకాదశి : పుత్రదైకాదశి అని పిలిచే ఈ ఏకాదశి నాటి పూజ మహా కీర్తిని తెచ్చే సంతానాన్ని కలగచేస్తుంది.

★ శ్రావణ బహుళ ఏకాదశి : ఈనాటి వ్రత పూజ తరలిపోయిన సమస్త సంపదలను తెచ్చి పెడుతుంది.

★ భాద్రపద శుద్ధ ఏకాదశి : ఈ ఏకాదశి నాడు చేసే వ్రత పూజ మహా పుణ్య ఫలమునిస్తుంది. వామనుడు బలిచక్రవర్తి గర్వాన్ని అణిచాడు.

★ భాద్రపద బహుళ ఏకాదశి. ఇంద్రైకాదశి అని పిలిచే ఈ ఏకాదశిని ఆచరించటం ద్వారా మహా బాధలూ, వ్యధలూ పోతాయి.

★ ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి : మహామోక్షదైకాదశి. కుటుంబమంతటికీ సుఖాలనే పుణ్యాలని అందిస్తుంది.

★ ఆశ్వయుజ బహుళ ఏకాదశి : రమైకాదశి అని పిలవబడే ఈ వ్రతమునాచరించటం వల్ల మహా స్వర్గ భోగాలు లభిస్తాయి.

★ కార్తీక శుద్ధ ఏకాదశి : ప్రబోధిన్యేకాదశి నాటి వ్రతం మహా మహా పుణ్య తిథి. వైకుంఠ ద్వారాలు తెరుచుకునే రోజు. శ్రీమహావిష్ణువు యోగనిద్ర నుంచి లేచే రోజు.

★ కార్తీక బహుళ ఏకాదశి : ఉత్పల్యైకాదశి అని పిలిచే ఈ వ్రతపూజ సాక్షాత్తు విష్ణుప్రీతిని పొందిన ఏకాదశి జన్మించిన రోజు. వంశానికి మహా మేలు చేసే పుణ్య తిథి.

★ మార్గశిర శుద్ధ ఏకాదశి : తల్లీ, తండ్రికి శుభాలను కలిగించే ఈ తిథినే మోక్షదైకాదశి అని పిలుస్తారు.

★ మార్గశిర బహుళ ఏకాదశి : సఫలైకాదశి అని అంటారు. వ్యవసాయదారుల కుటుంబాల వారు ఈ తిథి పూజ చేయటం ద్వారా మంచి దిగుబడి లభిస్తుంది.

★ పుష్య శుద్ధ ఏకాదశి : పుత్రదైకాదశి అని పిలిచే ఈ వ్రత పూజ ద్వారా చాలాకాలంగా సంతానం కలగని వారికి సంతానప్రాప్తి కలుగుతుంది. యాగం చేసిన ఫలం కూడా కలుగుతుంది.

★ పుష్య బహుళ ఏకాదశి: ఈ వ్రతపూజ ద్వారా జాగరణ చేస్తే వచ్చే తపఃఫలం వల్ల ఎంత తీరని కోర్కె అయినా తీరుతుంది. సఫలైకాదశి అని మరో పేరు కూడా దీనికి కలదు.

★ మాఘ శుద్ధ ఏకాదశి: జయైకాదశి అని పిలిచే ఈ తిథి నాడే శ్రీవిష్ణుసహస్రనామములను భీష్ముడు అంపశయ్యపై నుండి శ్రీకృష్ణుడి సాక్షిగా ధర్మరాజుకు చెప్పింది.

★ మాఘ బహుళ ఏకాదశి : విజయైకాదశి అని పిలిచే ఈ నాటి తిథి పూజ మహా విజయాన్నిస్తుంది. శ్రీరాముడు వానరులతో సేతువు నిర్మింపచేసిన రోజు ఇది.

★ ఫాల్గుణ శుద్ధ ఏకాదశి : అమలకైకాదశి అని పిలిచే ఈ తిథిలో ఉసిరికలతో పూజించాలి. పరశురాముణ్ని పూజించటం ద్వారా లక్ష్మీప్రదమవుతాయి కార్యాలు.

★ ఫాల్గుణ బహుళ ఏకాదశి : పాపయోచిత్యేకాదశిగా పిలిచే ఈ తిథి పూజ చేసిన సమస్త స్త్రీ సంబంధిత దోషాలను పోగొడుతుంది. సుఖాలనూ, శుభాలనూ ఇస్తుంది.

పట్టాభిషేక సర్గ ముఖ్యంగా

ఎప్పుడు చదవాలి

అయిదు వందల నదుల జలాలతో, చతుస్సముద్ర జలాలతో శ్రీరామచంద్రునికి పట్టాభిషేకం జరిగింది. ఆనాడు అనగా శ్రీరామనవమి రోజు పట్టాభిషేక సర్గ చదివితే... పఠిస్తే మహావైభోగాలు సిద్ధిస్తాయి. సకలం చల్లగా, శత్రువులన్న వారు లేకుండా అఖండ అధికారాన్ని పొందగలుగుతారు.

క్షీరాబ్ధి ద్వాదశి సముద్ర మథనంలో దొరికిన అమృతాన్ని దేవతలకి ఇచ్చేందుకు శ్రీమహావిష్ణువు మోహినీ రూపం ఎత్తిన రోజు. అందులకే ఆ తిథినాడు సకల విష్ణుఆలయాల్లో స్వామిని మోహినీ రూపంతో పూజించి అమరత్వాన్ని పొందుతారు.

కార్తీక మాస మహా మహా శ్రేష్ఠత

న కార్తీకసమో మాసః దేవః కేశ వాత్సరమే... న చ వేద సమం శాస్త్రం.. న తీర్థం గంగమాసమమే

కార్తీక మాసంతో సమమగు నెలగానీ లేదా సమమైన శాస్త్రం గానీ, గంగానదితో సమానమైన తీర్థము గానీ, శ్రీమన్నారాయణుడిని మించిన దైవంకానీ లేరని అత్రి మహర్షికి అగస్త్యమహర్షి శెలవిచ్చి వున్నారు.

మహాశివునికి ప్రీతికరమైన
మారేడు దళాలను ధనుర్మాసంలో
శ్రీవిష్ణుపూజకు వినియోగిస్తారు.
దాంట్లో అంతర్లీన పరమార్థం
పాపులను శిక్షిస్తాడనీ,
ఈశ్వరునిలా లయం చేస్తాడని
భక్తులకి ఎలాంటి సమస్యలు
లేకుండా చేస్తాడని భావం.

శ్రీవారి సంపదలను రక్షించేది

తిరుమల శ్రీవారి సంపదలను ద్వారపాలకులు శంబనిధి, పద్మనిధిలు రక్షిస్తారు. మహాద్వారానికి రెండు వైపులా వుండే పంచలోహ విగ్రహాలు... ఆ ద్వారపాలకులు శ్రీవారి సంపదలను, నవనిధులను రక్షించే రక్షక దేవతలు కూడా.

కంచిలో కచ్చపేశ్వరాలయాన్ని
దర్శించండి. శివ, కేశవుల
ఆలయాలు. శివుడు
శ్రీమహావిష్ణువు వంక చూసే
ఆ కంచి ఆలయాలని
దర్శించటమంటే
సకల బాధలను వదలిపెట్టడం
అనగా వదిలించుకోవటం వంటిదే.
దుఃఖం అన్నది ఇక దరిచేరదు.

సప్తవ్యసనములు

వేట... ఈ వేట అనే వ్యసనం వల్లే పాండురాజు మునిదంపతుల శాపానికి గురై సకల సుఖాలనూ, సందలనూ పోగొట్టుకున్నాడు.

జూదము... ఈ జూదం కారణంగానే ధర్మరాజు తమ్ములను తలవంచుకునేలా చేశాడు. భార్యని అవమానం పాలు చేశాడు. సకలం పోగొట్టుకున్నాడు. అరణ్య, అజ్ఞాతవాసాలని చేశాడు.

త్రాగుడు ... సాక్ష్యాత్తు శ్రీమహావిష్ణువు జన్మించిన యాదవవంశము ఈ త్రాగుడు వల్లే ఒకరితో ఒకరు కొట్టుకుని సమసిపోయింది.

కోపక్రోధమాటలు... చతుస్సముద్ర వేలావలయమైన ఈ సకల భూమండలాన్నీ ఏలే అవకాశాన్ని దుర్యోధనుడు తనకి కలిగిన ఈ కోపక్రోధ అహాల వల్లే పోగొట్టుకున్నాడు.

పగ, ప్రతీకారాలు : అలాంటి ప్రవర్తన వల్లే మాగధుడు సకలం పోగొట్టుకున్నాడు.

పరస్త్రీ వ్యామోహం : రావణుడు, కీచకుడు... ఒక్కరా... మహా మహులే స్త్రీ వ్యామోహంలో పడి ఏ వ్యసనంతో కూడా పోగొట్టుకోలేనన్ని ఈ వ్యసనం వల్ల పోగొట్టుకున్నారు.

అపాత్రదానము .... దీని వల్ల మన చుట్టూ వున్న వారే కాదు మహా దురవస్థలు పడింది, విశ్వామిత్రుడంతటి వాడు కూడా ఈ అపాత్రదానం వల్ల తపః ఫలాన్ని పోగొట్టుకున్నాడు.

సంపదలు ఎవరు పొందగలరు

అప్రతీతో జయతి సం ధనాని ప్రతిజన్యాని ఉత యా సజన్యా ।

అవస్యవే యో వరివః కృణోతి బ్రహ్మణే రాజా తమవన్తి దేవాః॥

అనగా వెనకడుగు వెయ్యనివాడు, వెన్నుజూపని వాడు సుఖసంపదలనైనా, ధనసంపదలనైనా.. అట్టి వారే పొందగలరు.

– ఋగ్వేదము

బ్రహ్మవైవర్త పురాణం ప్రకారం కార్తీకమాసంలో తులసిదళాలతో శ్రీమహావిష్ణువును పూజించిన వారికి మహా సంఖ్యలో గోవులను దానమిచ్చిన ఫలమని శెలవిస్తోంది.

ఉసిరిక చెట్టు ఎంతటి పుణ్యఫలములు కలది

★ కార్తీకమాసంలో సకల దేవతలు ఉసిరి చెట్టును ఆశ్రయించి వుంటారు. ఆనాటి ఉసిరిక వృక్ష పూజ సకల దేవతలకి చేసే పూజ అవుతుంది.

★ శ్రీమహావిష్ణువు పూజ ఉసిరిక చెట్టు క్రింద చేస్తే మహావిష్ణుక్షేత్రంలో చేసిన ఫలం.

★ ఉసిరిక చెట్టుకి పూజ చేయటమంటే అశ్వమేధ యాగం చేసినట్టే.

★ లక్ష్మీప్రదమైన తులసివలే ఉసిరిక చెట్టు ఆకుగానీ, కాయగానీ శిరస్సునందు, దేహమందు ధరిస్తే ఏకముఖి రుద్రాక్షని ధరించిన ఫలం.

★ ఉసిరిక ఆకులను నీటిలో వేసుకొని ఆపై స్నానం చేస్తే గంగానదిలో స్నానం చేసిన ఫలం.

★ ఉసిరిక పత్రితో శ్రీలక్ష్మీనారాయణులను పూజిస్తే రత్నాలతో పూజించిన ఫలం చేకూరుతుంది.

★ ఉసిరిక వృక్షమంటే కల్ప వృక్షమే. అందుకే ఉసిరి ఫలమును అమృత ఫలమంటారు. అందుకే కార్తీకంలో ఉసిరి వృక్షము క్రింద పూజ... చెట్టు కింద భోజనం. అలాగే ఆ మాసంలో దానం ఇస్తే దాని వల్ల కలిగే పుణ్యం చెప్పనలవికాదు.

మహా సంకల్పసిద్ధికై పఠించాల్సిన వేదమంత్రం

ఆ నో భద్రాః క్రతవో యన్తు విశ్వతోఽ దబ్ధాసో అపరీతాస ఉద్భిదః॥

దేవా నో యధా సదమిద్ వృధే అసన్న ప్రాయువో రక్షితారో దివే దివే ॥

అనగా సకల శ్రేష్ఠమైన సంకల్పము సదా సిద్ధింపుగాక. వాటికి ఆటంకములు లేకుండుగాక, పరిమితులు లేకుండా గాక. మంచి స్థితిని కలిగించుగాక. అనుక్షణం దేవతలు మమ్ము రక్షించెదరు గాక.

– ఋగ్వేదము

ఆంజనేయము మహావీరం

★ హనుమ అంజన, కేసరి దంపతుల పుత్రుడు.

★ ఆంజనేయుని గోత్రం కౌండిన్యస గోత్రం. వైశాఖమాసం, కృష్ణపక్షము, దశమి తిథి నాడు శనివారం జన్మించాడు. బుద్ధినీ, మనోబలాన్నీ ఇచ్చే హనుమ నక్షత్రము పూర్వాభాద్రము.

★ పుట్టుకతోనే స్వర్ణ కవచాలూ, మకర కుండలములతో జన్మించాడు.

★ గురువు సూర్యభగవానుడు. వాహనం ఒంటె.

★ వవనసుతునికి ఇష్టమైన రోజులు మంగళవారం.. శనివారం.

★ ఆకుపూజ (ఆకుల్లో శ్రేష్ఠమైనదీ, గొప్పదీ తమలపాకు... అందుకే అన్నింటిలోనూ శ్రేష్ఠమైన హనుమను ఆకుల్లో శ్రేష్ఠమైన తమలపాకులతో పూజించేది.. అదే ఆకుపూజ), వడమాల, శ్రీరామనామ స్మరణలన్న హనుమకు ఎనలేని ప్రీతి.

★ మృదుమధురుడు, శ్రీరామభక్తి పరాయణుడు, నవవ్యాకరణ పండితుడు, బ్రహ్మజ్ఞాని... అతిలోక

సుందరుడు.... అట్టి వానికి ఇష్టమైనవి అరటిపండ్లు, మామిడి పండ్లు. ఆ స్వామి ఆరాధనలో, పూజలో వాటిని తప్పక వుంచి స్మరించాలి.

★ అప్పములు, చిట్టిగారెలు.. బెల్లంతో చేసిన పొంగలి అన్న అత్యంత ప్రీతి అంజన కేసరిల పుత్రునకు.

★ గాయత్రీ మంత్ర ప్రియుడు. మంగళమూర్తిని పదకొండు మంగళవారములు పూజిస్తే విద్యా, ఉద్యోగ, ధన, కనక సుఖ భోగాదులు ఇవ్వటమే కాక శత్రువుల పీచమణిచి మీకు సుఖప్రశాంతతలను ఇస్తాడు. అనేక దీర్ఘ రోగాలను మటుమాయం చేస్తాడు.

వివాహం అయితేనే గౌరవం

పూజించాలన్నా, నమస్కరించాలన్నా, గౌరవించాలన్నా, ఉపాసించాలన్నా, ప్రార్థించాలన్నా వివాహం అయివుండాలి. వివాహం అయితేనే స్వామినైనా, మునినైనా పూజించాలి. బ్రహ్మచారి పూజించదగ్గ వాడు కాదు. లేదా సన్యాసత్వాన్ని స్వీకరించాలి. అట్టి వానికి నమస్కరించి పూజించవచ్చు.

పుణ్యతీర్థ ప్రయాణంలో పూజలు ఎలా చేసుకోవాలి

హృదయులక్ష్మీనవేతుడైన శ్రీనివానుణ్ని స్మరించినంతనే ఆనందాలు లభిస్తాయి. తూర్పు దిశగా తిరిగి శ్రీనివాసుణ్ని తలుచుకుంటే మీ పూజామందిరంలో పూజ చేసిన ఫలమే.

సకల యజ్ఞయాగాదులకన్నా,
వ్రతాలకన్నా, పూజాదికాల కన్నా
మహా పుణ్యమైనది ప్రాణదానం.
అనగా శరణు అన్న వార్ని
రక్షించటం. దానికి మించిన
పుణ్యదానం లేదని బ్రహ్మవిద్య
శెలవిస్తోంది.

శ్రీరామచంద్రుని జాతకాన్ని

పూజిస్తే

సకల సద్గుణ సంపన్నుడు, సకల శుభలక్షణ సంపన్నుడైన శ్రీరామచంద్రుని జాతకాన్ని పూజామందిరంలో పెట్టి పూజిస్తే సర్వశుభాలు జరుగుతాయి. భార్యాభర్తల అన్యోన్య దాంపత్యం మరింత వృద్ధి అవుతుంది. కలహాలతో విడిపోయిన వారు కలుస్తారు. ఇంకా గృహదోషాలు సమసిపోతాయి. మహామహాత్ముడు శ్రీరామచంద్రుని జాతకంలో జనన చక్రములో ఐదుగ్రహాలు ఉచ్ఛస్థానంలో వున్నాయి. దానివల్లే మహా శ్రేష్ఠమైన ఆ జాతకాన్ని మీ పూజా మందిరంలో ఉంచి పూజించండి. శుభాలూ, ఆరోగ్యమూ, దీర్ఘాయువులనూ ఇంకా అన్నింటికీ మించి శ్రీరాముని కృపను పొందండి.

తిరుమల శ్రీవారు

మూలవిరాట్టుగా ఆవిర్భవించింది

శ్రీలక్ష్మీవల్లభుడు.. శ్రీవైకుంఠవాసి శ్రీమన్నారాయణుడు ఆ శ్రీమహావిష్ణువు వేంకటాద్రిపై కన్యామాసం, శ్రవణానక్షత్రం రోజున స్వయుంభువుయై ఆనందనిలయంలో బ్రహ్మస్థాన దివ్య స్థలంలో శ్రీలక్ష్మీసమేత శ్రీనివాసునిగా మూలవిరాట్టుగా ఆవిర్భవించాడు.

శ్రీమహావిష్ణు పూజవల్లే శత్రు నాశనం...

తారకాసురుని పుత్రులు మూడు నగరాలు నిర్మించుకుని మునులనూ, ధర్మపరులనూ మహా యాతనలను పెట్టసాగారు. బ్రహ్మవరాలు పొందిన అంత బలాఢ్యులను ఎలా సంహరించాలో అర్థంకాక బ్రహ్మదేవుణ్ని శరణు వేడారు దేవతలు. బ్రహ్మదేవుని సలహాతో వ్యూహ రచన చేశారు.

భూమిని రథంగా చేశారు. చంద్రసూర్యులను చక్రాలుగా చేశారు. సముద్రాన్ని ఇరుసుగా చేశారు.

హిమాచల వింధ్యాచల, అస్తాచల, ఉదయాచలాలను ఆయా స్థానాల్లో భాగాలుగా పెట్టారు. త్రేతాగ్నులను మునికోల చివర్లో ఉంచారు. బ్రహ్మదేవుణ్ని సారథిగా చేశారు. ఈశ్వరుడు శత్రుసంహారం కోసం రథాన్ని అధిష్ఠించాడు. వేదాలు గుర్రాలయ్యాయి. సంవత్సరాన్ని ధనస్సుగా చేశారు. మేరుపర్వతాన్ని జెండాగా చేశారు. ఇక శత్రువుని చీల్చి చెండాడే బాణం కావాలి. అంతా శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. శత్రునాశనం కోసం, లోక కళ్యాణం కోసం బాణం కమ్మన్నారు. శ్రీమహావిష్ణువు బాణం అయ్యాడు.. కాన శ్రీమహావిష్ణు పూజ ధనసంపదలను ఇవ్వటమే కాక శత్రునాశనాన్ని కూడా చేస్తుంది.

కంచి గరుడ సేవ

కంచి గరుడ సేవంటే అందులో మీరనుకునే అర్థంలేదు. ఓ మహా భక్తుడు పూనవల్లి నుంచి విష్ణుకంచికి వచ్చి పుష్పకైంకర్యం చేసేవాడు. వృద్ధాప్యం కారణంగా ఓ రోజు ఆ భక్తుడు తన వద్దకు రాకపోయేసరికి స్వామివారే పూనవల్లి వైపు తిరిగారు. చాలాసేపు నుల్చుండి చేసే పూలసేవ కావటంతో కంచిగరుడసేవ అని సంబోధిస్తున్నాము.

పదితరాల వరకూ దరిద్రాన్ని మీ వారికి ఇవ్వకండి

భగవంతుణ్ని పూజించకపోయినా పర్వాలేదు. పుణ్యక్షేత్రాలకి వచ్చి చెయ్యకూడని పనులు చేస్తే ఎన్నో తరాల వరకూ అన్నానికీ, నీటికీ వ్యధ చెందాల్సివస్తుంది. అజ్ఞానంతో చెప్పిన వారి మాటలు లేదా, సమస్యలు కారణంగా ఆత్మహత్య చేసుకుంటే నరకప్రాప్తితో పాటు పాపఫలం పదితరాల వరకూ ఘోరంగా పట్టి పీడిస్తుందని ఋషులు శాస్త్రాల్లో బోధించి వున్నారు.

శ్రీవారి సుప్రభాతము ఎలా జరుగుతుంది

– బ్రహ్మముహూర్తమునకు 56 ఘడియలకు ముందుగా వాద్యకులు మృదు మధురంగా మృదంగాలను మ్రోగిస్తారు.

అర్చకస్వాములు సువర్ణ ద్వారంను మంత్ర పూర్వకంగా కుంచెకోలతో తెరుస్తారు.

యాదవుడు తలుపులు తెరుస్తాడు. త్రేతాయుగంలో విశ్వామిత్ర మహాముని శ్రీరాముణ్ని మేల్కొలిపిన విధంగా 'కౌసల్యా సుప్రజా రామా...' గీతాన్ని పఠిస్తారు. యాదవుడు ఆలయ ప్రవేశం చేస్తాడు.

శ్రీవేంకటేశ్వర స్తోత్రమునూ, శ్రీవేంకటేశ్వర ప్రపత్తినీ, శ్రీవేంకటేశ్వర మంగళా శాసనములనూ పఠిస్తారు.

శ్రీవారిని నిద్ర లేపిన తర్వాత దీపోద్దీపనము గావిస్తారు.... తెరను తీసి వెన్న, పాలు, పంచదారలను నివేదనము చేస్తారు.

తీర్థ, శఠారిలు అయ్యాక సువర్ణ ద్వారము వద్ద గల భక్తులకు స్వామి దర్శనార్థం కర్పూరహారతి ఇచ్చి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీవేంకటశ్వరుడు భక్తులకు తన దర్శన భాగ్యాన్ని అలా నిత్యం కలిగిస్తాడు.

ఎన్ని పూజలూ, వ్రతాలూ, నోములూ చేసినా సమస్యలు తీరటం లేదా

మహాపూజలు సంవత్సరాలుగా చేస్తున్నారు. అయినా తీరటం లేదు. దానికి కారణం మీరే... ధర్మంగా ప్రవర్తిస్తున్నారా...? శక్తి ఉండి కూడా సాటి వారు బాధపడుతుంటే మనకెందుకులే అని అనుకుంటున్నారా? దానం చెయ్యగలిగి ఉండీ, సహాయం చెయ్యగలిగి ఉండీ ఎందుకు చెయ్యాలి అనుకుంటున్నారా? అలానే పరమాత్ముడూ మీ విషయంలో భావిస్తాడు. ఎన్ని పూజలు చేసినా, యజ్ఞాలు చేసినా చేయగలిగీ పాత విషయాలు గుర్తుపెట్టుకొని సహాయనిరాదరణ మీరు చేస్తుంటే మీ సమస్యలని కూడా ఏవీ దేవుడు తీర్చడు. అన్ని పూజలకన్నా ధర్మబద్ధ జీవితం చాలా ముఖ్యం.

సప్త స్వరాలు ఎందులోంచి వచ్చాయి

నెమలి కూత షడ్జమము గానూ అనగా 'స' గానూ, వృషభధ్వని రిషభము అనగా 'రి' గానూ, మేకశబ్దము గాంధారము అనగా 'గ' గానూ, క్రౌంచపక్షి పలుకులు మధ్యమము అనగా 'మ' గానూ, వసంతఋతువు నందలి కోకిలకూత పంచమము అనగా 'ప' గానూ, గుఱ్ఱపు ధ్వని దైవతము అనగా 'ద' గానూ, ఏనుగు ఘీంకారము నిషాదము అనగా 'ని' గా పుట్టినవి.

27 నక్షత్రాల్లో రోహిణి, మృగశిర, ఉత్తర, స్వాతి.. ఈ నాలుగు నక్షత్రాలు కళ్యాణ శుభ నక్షత్రాలు. ఆయా నక్షత్రాల్లో వివాహం సకల శుభ సంతోష సుఖదాయకములు.

కృష్ణాష్టమి నాడు చేయాల్సిన విధి

★ బాలకృష్ణుణ్ని ... ఆ శంఖ చక్రగధాధారిని చక్కగా అలంకరించి పూజించాలి.

★ పగలు పూర్తిగా ఉపవాసం ఉండాలి. తులసి తీర్థం ఉపవాస సమయంలో తీసుకుంటుండాలి.

★ తిలామలకపిష్టం ... అనగా నూగులు, ఉసిరికలు కలిపి దంచి చేసిన ముద్దను ధరించి స్నానం చేయాలి.

★ నైవేద్యంగా బాలింతకు తిన్పించే సొంఠి బెల్లం కలిపి దంచి చేసిన పదార్థాన్నీ, అటుకులు, వెన్న, పండ్లు, తీపిపదార్థాలను నివేదించాలి.

★ పూలు, దర్భ, గంధం కలిపిన నీళ్ళను శంఖంలో నింపి చంద్రునికి అర్ఘ్యం ఇవ్వాలి.

ఉడిపిలోని శ్రీకృష్ణుడు

★ సాక్షాత్తు శ్రీరుక్మిణీ దేవి నిత్యం చందనం రాసి పూజించిన విగ్రహం.

★ ద్వారక మునిగిపోయినప్పుడు తాను పూజించే శ్రీకృష్ణుడి విగ్రహానికి రుక్మిణీదేవి చందనం రాయటం వల్ల ఆ విగ్రహం తేలుతూ వుంది. ఆపై వర్తకుల నౌకలోని వారు ఆ విగ్రహాన్ని చూసి తమ నౌకలో పెట్టుకున్నారు.

★ ఓసారి ఆ నౌక ప్రమాదానికి గురైతే... రక్షించిన మధ్వాచార్యుల వారిని తమ నౌకలో ఉన్నవాటిలో దేనినైనా స్వీకరించమని ప్రార్థిస్తే ఆయన చందన బాలశ్రీకృష్ణుణ్ణి తీసుకున్నారు. చందనం కడిగేయటంతో శ్రీకృష్ణుని విగ్రహం బైటపడింది. ఆ విగ్రహమును ప్రతిష్టించిన స్థలమే ఉడిపి.

★ మంగళూరు నుంచి కాశి, బెంగుళూర్ల నుంచి 422 కి.మీ దూరంలో ఉన్న ఉడిపి శ్రీకృష్ణుని దర్శనం పుణ్యం, పాపహరణం.

★ నవరంధ్రాల నుంచి గర్భాలయంలో స్వామిని దర్శించుకోవటం విశేషం.

శృంగార రసం ఎలా అనుభవించాలి

నవరసాలని అనుభవించేటప్పుడు ఏ రసాన్ని ఎప్పుడు చెయ్యాలో అప్పుడు ప్రదర్శించాలి. యుద్ధానికి వెళుతూ దుర్యోధనుడిలా భార్యతో శృంగార రసాన్ని ఆస్వాదించకూడదు. ఓ సందర్భంలో సీతమ్మ అనసూయతో అంటుంది.... 'మా వివాహం అయ్యాక అయోధ్యలో పన్నెండేళ్లు గడిపాం. ఆయా ఋతువులకి లభించే వస్తువులతో హాయిగా అన్ని రకాల సుఖాలను నాకందించాడు శ్రీరామచంద్రుడు.' అనగా శృంగారాన్ని సమయం, ఋతువూ.. రాత్రులయందే అనుభవించాలి.

సోమవారం చంద్రగ్రహణం వచ్చినప్పుడు లేదా ఆదిత్యవారం సూర్యగ్రహణం వచ్చినా అది 'చూడామణి' యోగమవుతుంది. ఆ రోజుల్లో చేసే నదీస్నానం, దానం, జపం కోటి రెట్ల ఫలాలని ఇస్తుందని వ్యాసుల వారి వచనం.

ఎన్ని పూజలు చేసినా

కలిసిరావటం లేదంటే....

సీతాన్వేషణకు లంకకు వెళ్ళినప్పుడు హనుమంతునికి ఆ నగరమంతా నిత్య వేద ఘోషలు విన్పిస్తుండేవి. ప్రతి ఇంట మహా శివపూజలూ, అభిషేకాలూ జరిగేవి. హనుమకీ అన్పించింది. ఇంతటి మహాపూజలు చేస్తున్న ఆ లంక నగరాధిపతినీ, వేదఘోషతో పునీతమవుతున్న ఈ లంకను జయించి సీతమ్మను ఎలా శ్రీరాముడు తీసుకెళ్ళగలడని? అంతే వెంటనే శ్రీరాముడ్ని తలచుకున్నాడు. అప్పుడర్థమైంది. ఎన్ని పూజలు చేసినా రావణుడు ధర్మం తప్పాడు. ధర్మం తప్పి ఎన్ని యజ్ఞాలు, పూజలూ చేసినా నాశనం తప్పదని.

అష్టమదములు

ధనమదము, విద్యామదం, సౌందర్యమదం, తపోమదం, యవ్వన మదం, కులమదం, శీలమదం... అధికార మదం. ఇవే అష్టమదములు. ఎవ్వరైనా సరే కష్టాల్లో వున్నారంటే, సమస్యలు పడుతున్నారంటే వీటిలోని ఏదో ఒక మదం కారణం అయ్యే వుంటుంది.

అరుంధతి వశిష్ఠుల వివాహం

ఓసారి వశిష్ఠుడు దళిత పల్లెలో ఓ స్త్రీకి ఇసుకను చూపించి 'ఈ ఇసుకను వండి అన్నం పెట్టగలవా?' అని అడిగాడు. దానికాస్త్రీ కుండలో ఇసుకపోసి దైవాన్ని ధ్యానించింది. ఆమె పవిత్రత వల్ల ఇసుక అన్నంగా మారింది. వశిష్ఠునికి వడ్డించింది. అప్పుడు వశిష్ఠుడు ఆ స్త్రీని అనగా ఆకాశంలో నక్షత్రరూపంలో వున్న ఆ అరుంధతిని ఆమె తండ్రి, తల్లిని అడిగి వివాహం చేసుకున్నాడు. వారికి కలిగిన వాడే 'శక్తి'. వాని పుత్రుడే పరాశరుడు.

గృహంలో తాబేలు బొమ్మని వుంచండి

పూర్వము ఆలయాల బావుల్లో, గృహావసరం కోసం వాడుకునే బావుల్లో, సరస్సులలో తాబేళ్ళను వుంచేవాళ్ళు పెద్దలు. అలా వుంచేది తాబేలు శ్రీమహావిష్ణువు అవతారమైన కూర్మావతారమని. కాన తాబేలును చూస్తే ఆ రోజంతా శుభమంగళమవుతుంది. అపజయమన్నది వుండదు. దుష్ట రాక్షస పీడలు వుండవు. అలాగే బావుల్లో తాబేలుండటం వల్ల కోట్లాది క్రిములు ఆ నీటిలో చేరవు. తద్వారా ఆ నీరు అమృతమయమవుతుంది. అనారోగ్యాలన్నవి దరిచేరవు.

కంచి ఎంతటి దివ్యక్షేత్రం

జాతుల్లో పుష్పాలు, పురుషుల్లో శ్రీమహావిష్ణువు, స్త్రీలలో రంభ, నగరాల్లో కంచి మహోన్నతములైనవి. ఈ క్షేత్రం 108 దివ్యదేశాల్లో ఒకటి. ఇక్కడి విష్ణుకంచి బ్రహ్మదేవుని తపోభూమి. కంచిక్షేత్రంలోని 'క' అనగా బ్రహ్మ, 'అంచి' అనగా పూజించటం. వెరసి కంచి లేదా కాంజీవరమయ్యింది.. కంచిక్షేత్రం విష్ణుశివులకి ప్రీతికరమైనది.

పెనుగాలి వీస్తున్నా, గద్దలు ఎగురుతున్నా, కాకులు విపరీత ధ్వనులతో సాగుతున్నా, వాహనం మొరాయించినా కార్యసిద్ధి కోసం బయలుదేరకూడదు. కురుక్షేత్ర కదన రంగంలో కర్ణుడికి ఈ అపశకునాలు ఎదురొచ్చినా పట్టించుకోక యుద్ధానికి వెళ్ళాడు. ఫలితం....

'నారాయణా' అని పిలిస్తే చాలు

అజామిళుడనే రాజు మహా వ్యసనపరుడు. మద్య మాంసాలను నిత్యకృత్యంగా తీసుకునేవాడు. భార్యని కూడా కాదని వ్యభిచారులతో తిరిగేవాడు. ధర్మకార్యాలంటే అస్సలు గిట్టదు. ఆఖరికి ఓ సానితో ఆమెని భార్యగా తలచి మరీ పదిమంది సంతానాన్ని కన్నాడు. విషయలోలుడయ్యాడు. వృద్ధాప్యం వచ్చింది. శరీరంలో శక్తి పోయింది. చుట్టాలూ, పక్కాలూ, స్నేహితులూ ఎవరూ లేరు. వెలయాలి కడగంటి చూపుకోసం అప్పుడు కూడా అర్రులు చాస్తున్నాడు. అతని ఆయుష్షు తీరే సమయం దగ్గర పడటంతో యమదూతలు వచ్చారు. పాశాలు వేశారు. అప్పుడే అజామిళుడికి అక్కడ తన పుత్రుడు నారాయణుడు కనిపించాడు. అజామిళుడు ఆతడిని 'నారాయణా.. నారాయణా..' అని పిలిచాడు. ఆ పిలుపుకే ఆ మరణ సమయంలో చేసిన ఆ నారాయణ నామస్మరణకే ఎంతో పుణ్యాన్ని పొందాడు. ఇదంతా చెబుతుంది అన్ని వ్యసనాలతో మునిగితేలి చివర్లో 'నారాయణా' అని అనమని కాదు. దేవుడు కష్టాలు పెడుతున్నాడని అనుకుంటుంటారు. దేవుడు ఏ చిన్న ధర్మపూజ చేసినా, ఎలాంటి వాడికయినా అనంతమైన

ఫలాన్ని అందిస్తాడు. మనకొచ్చే సమస్యలకీ, కష్టాలకీ ఆ దేవదేవుడు కారణం కాదని ఈ గాథ చెబుతోంది. అలాగే మీరెన్ని పూజలు చేసినా, యజ్ఞయాగాలు చేసినా ధర్మంగా వుండకపోతే ఆ ఫలాలు రావు. ధర్మం చాలా చాలా గొప్పది. భగవంతునికన్నా గొప్పది ధర్మం.

శ్రీరామచంద్రుడు అరణ్యవాసానికి వెళ్ళటానికి సిద్ధపడుతూ లక్ష్మణుడితో చెప్పాడు...'లక్ష్మణా.. రాజ్యాధికారం కన్నా, మహా భోగాలకన్నా, వైభోగాలకన్నా తండ్రి మాట గొప్పది. పితృవాక్య పరిపాలనకన్నా ఎక్కువైనదిగానీ, గొప్పదిగానీ ఏదీ లేదు'. వాటిని పాటించినందుకే శ్రీరామచంద్రుడు ఆదర్శ పురుషుడు అయ్యాడు.

సూర్యపుత్రి యమున నదిలోని నీరు కింద ఒక వర్ణంలో, పైన మరొక వర్ణంలో కనపడుతుంది. దానికి కారణం బలరాముడు యమునా నదిలో స్నానం చెయ్యటానికి వెళ్ళి నదిని మరింత దగ్గరికి రమ్మన్నాడు. త్వరగా రాకపోవటంతో ఆదిశేషుడైన బలరాముడు బుసకొట్టాడు. ఆ కారణంగానే సూర్య,సంజ్ఞాదేవిల పుత్రికయిన యమునానది ప్రవాహం కింద తెల్లగానూ, పైన ఇంద్రనీలమణి కాంతితో నల్లగానూ కనపడుతోందని భాగవత సారాంశము.

నదీస్నానం ఎంతటి ఫలమని వేదం చెబుతోంది

★ నదీస్నానం ఏకాగ్రతని పెంచుతుంది.

★ శరీరం లోపల, బైట ఉన్న మహా మాలిన్యాలన్నీ తొలగిపోతాయి.

★ సాధ్యమైనంత వరకూ నిండు ప్రవాహం వున్న వద్ద, అదీ ఒడ్డుకు ఆనుకొని స్నానం చెయ్యటం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అట్టి స్నానం ఇంద్రియ లోపాలను తగ్గిస్తుంది. శుచిని తెచ్చిపెడుతుంది.

★ మహా మహా తపస్సుల దీక్షా ఫల శక్తి నదీజల్లాల్లో వుంటుంది. గాన పుణ్య రోజుల్లో స్నానం చెయ్యమని వేదం శెలవిస్తోంది.

★ గంగానది అరవై పాపాలను హరించి వేస్తుంది. యమునానది ఇరవై పాపాలను నశింప చేస్తుంది. అందులోని పరమార్థం చూస్తే గంగానది అరవై

యోజనాల పవిత్ర ప్రదేశం. అలాగే యమునా నది ఇరవై యోజనాల గల పవిత్ర ప్రదేశం. అలాగే సరస్వతీ నది ఇరవై నాలుగు పాపాలను హరించి వేస్తుంది.

★ నదిలో కొత్త నీరు వచ్చినప్పుడు స్నానం చేయరాదు.

★ నది అంటే పుణ్యస్త్రీ. అలాంటి నదీమతల్లిని పసుపు, కుంకుమ, పూలు, గంధాలతో పూజిస్తే మహా సౌభాగ్యసుఖసిద్ధి.

శ్రీభాగవతం చదవండి...

అలసత్యము, కోపం, ద్వేషం, పగాప్రతీకారాలు, ఈర్ష్యా ... కామం ఒక్కటా... ఈ కలియుగంలో పైవాటి వల్ల శరీరం కలుషితమవుతుంది. అనారోగ్యాల పాలవుతుంది. తినే తిండి కంటే వైద్యం గుళికలనే ఎక్కువ తినే స్థితి. ఆశ, క్రోధం, పగలు మిమ్మల్ని నాశనం చేస్తాయి. శ్రీభాగవతం చదవటం వల్ల అనారోగ్యం వల్ల కలిగే అల్పాయుష్షు కూడా తొలగిపోతుంది.

గరుడ పురాణం అంటే నరకలోక శిక్షలు మాత్రమే కాదు....

శత్రువు నాశనం కోసం గరుడపురాణంలోని శ్రీవిష్ణుపంజరం స్తోత్రం పఠిస్తే సకల శత్రునాశనంతో పాటు సకల విధాలుగా రక్షిస్తుందని ఆ మహా పురాణం శెలవిస్తోంది. గరుడ పురాణంలో ఆయుర్వేద, రత్న, ఆరోగ్య, భక్తి ప్రపత్తులకి సంబంధించినవి ఎన్నో వున్నాయి. నరకం పాపులకి విధించే శిక్షలు తెలిపేది ఓ ఖండంలో మాత్రమే... నరకలోక శిక్షలు గరుడ పురాణంలోని అంతర్భాగమే. సంపూర్ణ గరుడ పురాణ పఠనం సమస్త మంగళాలను అందిస్తుంది.

తులసీ, శ్రీమహాలక్ష్మీదేవిలలో ఎవరు మిన్న

తులసితో శ్రీమహావిష్ణువుకు పాదపూజ చేసి తరిస్తుంటారు భక్తులు. చల్లదనం, మార్దవం, పరిమళం అను పవిత్రమైన మూడు గుణాలు గల తులసిని చూసి శ్రీమహాలక్ష్మీదేవి... 'చూశావా.. నీ స్థానం ఎక్కడో. నా స్థానం స్వామి వక్షస్థలం' అని అంది. దాంతో తులసి

దిగులుపడింది. ఆ పరిహాసానికి చిక్కిపోయింది. నిత్య యవ్వనం తగ్గింది. వాడిపోయింది.దాంతో విషయం తెలుసుకుని శ్రీమహావిష్ణువు తన భక్తుల చేత తులసిని మాలగా కట్టి తన కిరీటానికి అలంకరించేలా చేశాడు. తులసి శిరోభాగాన్ని అలంకరించటంతో లక్ష్మీదేవి ఖిన్నురాలయ్యింది. ఆమెకన్నా గొప్పగా వుండాలంటే ఏం సేవ చెయ్యాలని స్వామిని అడిగింది శ్రీమహాలక్ష్మి. ఆ క్రమంలో తులసి వనంలో జన్మించిందే లక్ష్మీదేవి అనగా గోదాదేవి.

సంపదల కోసం శ్రీమహావిష్ణువును పూజించాలి

పూర్వము పద్మాక్షుడనే రాజు శ్రీమహాలక్ష్మీదేవికి పూజలూ, వ్రతాలూ.. ఇంకా తపస్సులు చేసి దేవిని మెప్పించాడు. వాని దీక్షకు శ్రీమహాలక్ష్మీదేవి ప్రత్యక్షమైంది. తనకు పుత్రికగా జన్మించమని అడిగాడు ఆ రాజు. దానికి లక్ష్మీదేవి 'రాజా.. నేను స్వతంత్రురాలను కాను. పరాధీనను. శ్రీమహావిష్ణువు భార్యను. ఆయన చెప్పిందే చేస్తాను. శ్రీహరిని ప్రార్థించు. ఆయన కటాక్షిస్తేనే నేను ధనసంపదలనైనా, వరములనైనా ఇచ్చేది' అని చెప్పింది.

గృహంలో కల్పవృక్షాన్ని వుంచుకోండి

సుఖసౌఖ్యాలనిచ్చే సాధనాలు బంగారము, ధనం. సకల భోగాలనిచ్చే వస్తువులు అన్నీ శాశ్వతంగా వుండాలంటే వాటిని నిలిపే శక్తి కల్పవృక్షానికే వుంది. ఇంద్రుని వనంలోని కల్పవృక్షం కన్నా పవిత్రమైనదీ, దోషాలన్నవి నమీవంలోకి రాకుండా చేసేది శ్రీరామాయణం, శ్రీమహాభారతం, శ్రీదేవీభాగవతం, శ్రీభాగవతము. కనీసం ఇందులో ఒక్కటైనా మీ గృహంలో వుందా...? గృహంలో వుంచితే సకల గృహ, గ్రహ, వాస్తు దోషాలను దూరంగా వుంచుతుంది ఆ కల్పవృక్షము. అనగా తనలోని కొమ్మలతో అనగా స్కంధాలతో బలంగా వీస్తూ ఆరోగ్యకరమైన వాటిని అందిస్తూ, గృహంలోని అశుభదోషాలను బైటికి వెళ్ళగొడుతుంది. వాటికి నమస్కరించినంతనే పూజ చేసిన ఫలం కలుగుతుంది. చూసినంతనే దైవదర్శనం ద్వారా కలిగే ఫలం లభిస్తుంది.

గో పుష్ప తులాభారం చేయిస్తే

వర్షాలు కురవటానికి గోపుష్పతులాభారం తూయాలి. వాటిని ముత్తైదువులకు పంచిపెట్టాలి. అలా గోపుష్ప తులాభారం తూచిన పూలని ధరించిన స్త్రీ యెక్క గృహంలో ధనానికీ, సౌభాగ్యానికీ కొరత వుండదు. కమలాలతో పుష్ప తులాభారం తూయిస్తే పోయిన ధనం తిరిగి వస్తుంది. చామంతులతో తూయిస్తే భర్తతో విబేధాలు తొలగిపోతాయి.

తెల్లని శరీరంతో గుర్రపు తలతో శ్రీమహావిష్ణువు శ్రీమహాలక్ష్మీదేవిని ఎడమ తొడపై కూర్చు బెట్టుకుని చిన్ముద్రతో తెల్లని పద్మంలో కూర్చుని వుండే హయగ్రీవుడ్ని దర్శించేటప్పుడు 'హయగ్రీవ.. హయగ్రీవ.. హయగ్రీవ...' అని ముమ్మారు జపించటం వల్ల ఐశ్వర్యాదులు కరతలామలకాలవుతాయని ఋషి వచనం.

శత్రువు ఇంట ఎడమకాలు పెడితే...

కొత్త పెళ్ళికూతురు గృహంలోకి వస్తుంటే కుడికాలు పెట్టి రామ్మా అని నొక్కి మరీ చెప్పేది ఆ ఇంట సకల శుభాలు జరగాలని. హనుమంతుడు సీతా అన్వేషణకు లంకానగర ముఖద్వారం చేరినప్పుడు లంకిణికి శాపవిమోచనం కలిగించి లంకలోకి ప్రవేశించబోయాడు. కుడికాలు పెట్టబోయి ఆగుతాడు. వేద ధర్మ శాస్త్రాల ప్రకారం కుడికాలు పెట్టి లోపలికెళితే మహాశుభాలు. అయితే రావణుడి వంటి లోకకంఠకుడికి ఏ శుభాలూ జరుగకూడదని వీరాంజనేయుడు ఎడమకాలు పెట్టి లంకలోకి అడుగిడతాడు. చాలామంది శత్రుత్వము ఎవరితో ఉంటుందో వారి ఇంట్లోకి ఎడమకాలు పెట్టి వస్తుంటారు. ఈసారి పరీక్షగా చూడండి. ఎవరు హితులో, ఎవరు సన్నిహితులో మీకే అర్థం అయిపోతుంది.

ఏ ఆలయాల్లోని ప్రసాదాన్ని గృహంలోకి తెచ్చుకోకూడదు

కలశంలోని కొబ్బరి కాయను, మళ్ళీ దైవానికి అర్పించకూడదు. అలాగే నదీస్నానం చేసి తడిబట్టలతో దైవదర్శనానికి వెళ్ళకూడదు. అలాగే ఈశ్వర ఆలయంలో

ప్రసాదాన్ని గృహానికి తీసుకురాకూడదు. తీసుకోవాల్సి వస్తే పార్వతీదేవి వద్ద స్వీకరించాలి. ఈశ్వరాలయంలో ప్రసాదం తీసుకున్నా దాన్ని నంది వద్ద వుంచాలి. అలాగే శ్రీమహావిష్ణువు ఆలయానికి వెళ్తే అక్కడ ఇచ్చిన ప్రసాదాన్ని కొద్దిగానైనా తిని ఇంటికి తెచ్చుకోవాలి.

ప్రదక్షిణలోని పరమార్థం

'ప్ర' అనగా సకల పాపనాశనం, 'ద' అనగా సకల కోరికలు తీరటం, 'క్షి' అనగా జన్మ జన్మల ఫలం, 'ణ' అనగా అజ్ఞానం నుంచి విముక్తి. సకల పాపాలను కడిగి జన్మజన్మల పుణ్య ఫలముల ద్వారా కోరికలను తీర్చి అజ్ఞానాన్ని పోగొట్టమనీ.. స్వామి పాదాలను స్మరించే పుణ్యఫలాన్ని ప్రదక్షిణం ద్వారా ఇవ్వమనేది 'ప్రదక్షిణ' లోని పరమార్థం.

అష్టలక్ష్మి వరాలు

సంతోషంలో వాగ్దానాలు చెయ్యకండి.... ధనం పోతుంది.

ఆవేశంతో మాట్లాడకండి..... అపజయం ఎదురవుతుంది.

అనవసరమైన చోట అబద్ధం చెప్పకండి.... నమ్మకం పోతుంది.

మిమ్మల్ని విమర్శిస్తే..... సమాధానం చెప్పకండి,

ఎదుటి వారి మాటలకి అడ్డురాకండి

... వారి బలహీనతలు వాళ్ళే చెప్పేస్తారు.

ఇతరులు చేస్తానన్న పని మీరు చెయ్యకండి... శత్రుత్వం, పగ కలుగుతాయి.

మీ వద్ద ధనం లేదన్న విషయం చెప్పకండి.. రుపాయి కూడా అప్పు పుట్టదు.

కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకోండి... మీరెక్కడ నష్టపోయారో తెలుస్తుంది.

పై ఏడింటిని సదా గుర్తుంచుకోండి... సుఖసంతోష సంపదలు మీకు తప్పక కలుగుతాయి.

చిలుకూరు బాలాజీని దర్శిస్తే

– ఈ స్వామిని దర్శించి **11** ప్రదక్షిణలు చేసి కోర్కెను కోరుకుంటే ఖచ్చితంగా తీరుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. కోర్కె తీరిన తర్వాత **108** ప్రదక్షిణాలు చేస్తారు భక్తులు.

★ దేవాలయంలో **11** లేదా **108** ప్రదక్షిణలు చేస్తున్నంత సమయం గోవిందనామాలు స్మరిస్తూ సాగండి. చాలా ముఖ్యం అది. కోరిక తీరిన వారూ, కోర్కె కోరుకునే వారూ ఈ పద్ధతిని పాటించండి.

★ ఈ ఆలయంలో హుండీ ఉండదు.

★ తిరుపతి దాకా రాలేని ఒక భక్తుడి కోసం నీ చెంతే ఉంటానని చెప్పి స్వామి వెలిసిన క్షేత్రం చిలుకూరు బాలాజీ.

★ ఆలయంలో స్వామిని దర్శించే వారూ, ప్రదక్షిణలు చేసేవారు కనులు మూసుకోకుండా దైవకార్యాన్ని పూర్తి చేయాలి. అప్పుడే దర్శనం సఫలం అవుతుంది.

★ అతి పురాతనమైనదీ ఆలయం. వీసా బాలాజీగా పేరొందిన ఈ దేవాలయ దర్శనం అనిర్వచనీయమైన అనుభూతిని ఇస్తుంది.

★ ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలుండవు. అందరూ సమానులే స్వామి ముందు.

★ హైదరాబాద్ మెహదీపట్నం నుంచి అనేక బస్సు రవాణా సౌకర్యాలు ఉన్నాయి.

హైదరాబాద్ నుంచి చిలుకూరు వెళ్ళే వాళ్ళు హైదరాబాద్‌లోని పెద్దమ్మ ఆలయాన్ని దప్పక దర్శించండి.

అక్కడ ధ్వజస్థంభం వద్ద రూపాయి బిళ్ళని నుంచో బెడితే త్వరగా మంచి జరుగుతుంది. అమ్మ కటాక్షిస్తుందని భక్తుల నమ్మకం. విశాలమైన ఆలయం మిమ్మల్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తుతుంది.

యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దర్శిస్తే

★ అఖండ విజయం తథ్యం...

★ యాద అనే మహర్షి ఇక్కడ తపస్సు చేసి నారసింహుని దర్శించాడు. స్వామి వరంతో ఆయన పేరుతో యాదగిరి గుట్టగా పిలవబడుతోంది.

★ హైదరాబాద్ నుంచి అరవై కి.మీ దూరం.

★ ఋషులు తపస్సు చేసిన పుణ్యప్రదేశం.

★ హిరణ్యకశ్యపుణ్ని సంహరించి ఆపై ఉగ్రనరసింహుడు ప్రహ్లాదునికి దర్శనమిచ్చిన పవిత్ర పుణ్య గుహ.

★ అనేక బాధలూ, వ్యధలూ, రుణాలున్న వారు ఈ క్షేత్రానికి వచ్చి స్వామి దర్శన భాగ్యం వల్ల స్వామి దీవెనలతో, కటాక్షాలతో భయభీతులనూ, అనారోగ్యాలనూ దూరం చేసుకుంటున్నారు.

★ అంగరంగ వైభోగంగా జరిగే బ్రహ్మోత్సవాల్లో ఎదుర్కోలు, కళ్యాణము, విమాన రథోత్సవాలు జరుగుతాయి.

★ శ్రీలక్ష్మీ సమేత నారసింహ ఆలయానికి వెళ్ళే దారిలో కుందా సత్యన్నారాయణ కళాధామం వుంది. తప్పక దర్శించండి.

భయంకరమైన బాధలూ, వ్యధలూ ఉంటే

పాలసముద్రం చిలుకుతున్నప్పుడు శ్రీమహావిష్ణువు కూర్మావతారుడై పాలనముద్రాన్ని మోసాడు. భయంకరమైన హాలాహలం జన్మించినప్పుడు ఆ వేడికి దేవతలూ, రాక్షసులూ పారిపోయినా తాను అలాగే వుండి భరించాడు. ఆపై ఆ మహా బాధను పోగొట్టుకోవటానికి ఈశ్వరుణ్ణి ప్రార్థించాడు. పరమేశ్వరుడు ఆయన వంక తిరిగాడు. చల్లని చంద్రుడి వెన్నెలలు శ్రీమహావిష్ణువుకి వచ్చేలా చేశాడు. మహా బాధలున్న వారు ఒకేరోజు శ్రీమహావిష్ణు, శివాలయాలలో పూజలు చేయించుకోవాలి. ప్రదక్షిణలను చేయాలి.

సువర్ణ గన్నేరు పూలతో స్వామిని పూజిస్తే

శ్రీమహావిష్ణువుని బంగారు పూలతో పూజిస్తే వచ్చే ఫలం మహా ఫలం. అసలు సిసలు ఆనందం అంటే, భోగాలంటే ఏంటో తెలుస్తుంది. శ్రీలక్ష్మీదేవి ప్రీతి కొరకు శ్రీమహావిష్ణువును సువర్ణ గన్నేరు ఇంకా పచ్చటి పూలతో పూజించటం, మాలను కట్టి శ్రీలక్ష్మీనారాయణులకు అలంకరించటం ద్వారా సకల సుఖాలను పొందచ్చు. మాలను శ్రీలక్ష్మీనారాయణులకు విడివిడిగా కాకుండా ఏకమాలతోటి ఇద్దరికీ అలంకరిస్తే మహాసౌభాగ్యం కూడా కలుగుతుంది.

నరసింహ స్తోత్రాన్ని
ముప్పయిరోజులు పఠించి కోరుకున్న
ఏ కోరిక అయినా తీరటమే కాదు
గతంలో చేసిన దోషాలూ,
పాతకాలు సమసిపోతాయని
నారసింహ స్తోత్రం ఫలశ్రుతి
శ్లోకాల్లో స్పష్టంగా వుంది.

శ్రీమన్నారాయణుడే

మోహించిన స్త్రీ

శూర్పణఖ.. ఆదికాలంలో ఓ అప్సరస. శ్రీమహావిష్ణువు దర్శనార్థమై వైకుంఠం వచ్చింది. ఆమె అందానికి ముగ్ధుడై శ్రీమన్నారాయణుడు చూపు మరల్చుకోలేకపోయాడు. అది గ్రహించి లక్ష్మీదేవి భగ్గున వుడికి పోయింది. ఇదంతా చూస్తున్న ఆదిశేషుడు ఆదిదంపతుల మధ్య గొడవలొస్తాయని తన పడగలను అడ్డుగా వుంచాడు. తనకి అడ్డు తెరగా నిలిచిన ఆదిశేషుడిపై కోపించింది. అలా నా ఎదురే నా భర్తను అలా చూస్తుంటే ముక్కూ, చెవులూ కోయక అడ్డుగా పడగలను ఉంచుతావా? అని లక్ష్మీదేవి ఆదిశేషుడిని ప్రశ్నించింది. ఆదిశేషుడు తలవంచుకున్నాడు. ఆపై అదే ఆగ్రహంతో ఆ అప్సరసను అసురకన్యవై జన్మించమని శపించింది. అలా జన్మించిందే శూర్పణఖ. అనాటి లక్ష్మీదేవి కోపమే... ఆ కారణముగానే ఆదిశేషుడైన లక్ష్మణుడు అనాడు వైకుంఠంలో చేయాల్సిన పనిని వనవాస సమయంలో లక్ష్మీదేవి ముందు అనగా సీతాదేవి ముందు శూర్పణఖ ముక్కూ, చెవులూ కోసాడు.

అడుగు ప్రదక్షిణ చేస్తే

భార్యాభర్తల మధ్య అపోహలూ, చికాకులూ ఇంకా చెప్పనలవి గాని సమస్యలు వదలిపోవాలంటే శ్రీలక్ష్మీనారాయణుల ఆలయంలో అడుగు ప్రదక్షిణలు చేయటం వల్ల అన్నీ తొలగిపోతాయి. అడుగు అడుగు మధ్య ఖాళీ లేకుండా మీరు అనుకున్న ప్రదక్షిణలు పూర్తి చేయాలి. పదకొండు తగ్గకుండా చేయాలి. లేదా నూట ఎనిమిది చేయాలి. స్వామివారికి పూలు, పండ్లు సమర్పించాలి. ఆ రోజు వీలయినంత సమయం మౌనవ్రతం పాటించాలి.

ఆళ్వారు అనగా లోతుకుపోయిన వాడు.. లోతును సమగ్రంగా ఎరిగిన వాడు అని. పరమాత్ముని సేవలో నిత్యం అలౌకికానందాన్ని పొందే వాడని అర్థం.

రోజుకి 1440 నిమిషాల్లోని అయిదు నిమిషాల్లో గోవింద నామాలను చదవండి.

సీతాదేవి సమర్త...

లోకమాత సీతాదేవి జనకుని పుత్రిక జానకి పంచమి, సోమవారం, హస్తా నక్షత్రమున ఆ మహాశుభలగ్నాన సమర్తాడింది. అప్పుడు పంచాంగాలు పరిశీలించారు పండితులు. పంచమి, సోమవారం పరమపతివ్రత అగు లక్షణాలు అని శెలవిచ్చారు. ఆదివారం అయితే రోగాల బాధనీ, సోమవారం మహా పతివ్రత అవుతుందనీ, మంగళవారమయితే సమస్యలెక్కువనీ, బుధవారం అయితే మహా బుద్ధిశాలి అవుతుందనీ, గురువారం అయితే సంపదలకి అధినేత్రి అనీ, శుక్రవారమయితే నుదతి నుఖాలను అనుభవిస్తుందనీ, శనివారమయితే ధనం తప్ప మిగతా విషయాల్లో సుఖాలెక్కువని శెలవిచ్చారు.

శుభకార్యాల్లో, సన్మానాలలో మీకు వేసిన పరిమళభరితమైన పూలదండను మీరే స్వయంగా తీయకూడదు. ఎవరి చేతనైనా తీయించుకోవాలి.

దేవతలే కాదు చెట్లూ వరాలిస్తాయి...

సీతమ్మ తల్లికి చెట్లంటే ఎంతో ప్రీతి. మిథిలలో బంతి నారు పోసి పెంచి మురిపెంగా చూసుకునేది. వాకిట్లో సిరిమల్లె చెట్లును నాటించింది. చిలుకలు వంటి వాటి కోసం సెనగతోట వేయించింది. వృక్షాలని రత్నాలతో, పట్టుచీరలతో అలంకరించి పూజించేది. వనవాస సమయంలో సీతాదేవి వృక్షములకి మొక్కుకుంది. అయోధ్య చేరగానే నా భర్తతో చెప్పించి మిమ్మల్ని ఎవరూ కొట్టకుండా, కూల్చకుండా చేస్తాను అని వరాలిచ్చింది. అలా చేస్తే రాక్షసులుగా తలచి కఠినంగా శిక్షించేలా చేస్తాను అంది. అంతఃపురంలోలా.. అయోధ్యలా ఇక్కడ కూడా సుఖాలకి కొదవలేకుండా చేయి' అని ప్రార్థించింది. కాన సీతమ్మలా వృక్షాలని పూజించకపోయినా పర్వాలేదు... వృక్షాలని రక్షించండి. ఆ శ్రీరాముడే సీతాదేవికి ఇచ్చిన వాగ్దానం ప్రకారం చెట్లని భంగ పరిస్తే శిక్షిస్తాడు, పెంచితే మిమ్మల్ని రక్షిస్తాడు. మీకు ఆపదలు కలిగించిన వార్ని కూడా ఆలస్యం చెయ్యకుండా శిక్షిస్తాడు.

వేదవతి పూర్వ గాథ

వేదవతి మాలావతీ కుశధ్వజుల పుత్రిక. వేదం పఠిస్తుండగా జన్మించినందు వల్ల వేదవతిగా నామకరణం చేశారు. యుక్త వయస్సు రాగానే ఓ రాక్షసుడు వేదవతిని తనకిమ్మంటే కాదన్నందకు వేదవతి తండ్రిని సంహరించాడు. ఆమె తల్లి భర్తతో సహగమనం చేసింది. దాంతో వేదవతి శ్రీమహావిష్ణువుకై తపస్సు చేయసాగింది. అప్పుడు ఆమెను చూశాడు రావణాసురుడు. కామించాడు. శ్రీహరికే తాను అర్పితమంది. అయినా వినలేదు ఆ కాముకుడు రావణుడు. దాంతో అతడు తన వల్లే నాశనం అవుతాడని శాపం ఇచ్చి తాను అగ్నికి ఆహుతి అయ్యింది. ఫలితంగా అయోనిజయై పద్మంలో రావణాసురుడి లంకలో జన్మించింది. చేటు తెచ్చిపెట్టింది. అలా లంకలో పుట్టిన అయోనిజే మిథిలలో జనకుడికి దొరికిన సీతమ్మ తల్లి.

అధిక ధనరాసుల కోసం

తిరుమల శ్రీవారి హుండీ నుంచి బైటికి రాగానే ఎడమవైపు ప్రాకారానికి నిలువెత్తు బంగారు వరలక్ష్మి

ప్రతిమ వుంటుంది. ధనరాసులను కురిపించే అమ్మ.. స్వామి వారికి ఈశాన్యంలో వుంటుంది. ఆమెను ధ్యానించటం ద్వారా భక్తులకి ధనసంపదలను కురిపిస్తుంది. అంతటి మహత్యం గల ఆ ప్రదేశంలో ఆమెకి నమస్కరించి ధ్యానించటం మరవద్దు. అలాగే బైటికొస్తున్నప్పుడు వెండి వాకిలి ఎదురు సాష్టాంగ పడి నమస్కరించటమంటే 'స్వామి! మళ్ళీ నీ దర్శనాన్ని నీ మనోహర దివ్యరూపాన్ని చూసే భాగ్యాన్ని ఇవ్వమనీ.... అనుగ్రహించమని'. అనగా ఆయుష్షును వృద్ధి చేయమని. కాన సాష్టాంగ నమస్కారం చేసి సంతృప్తిగా బైటికి రండి.

తిరుమలలో స్వామిని బ్రహ్మోత్సవాల సమయంలో రోజూ ఒక్కో వాహనంపై చూసి దర్శిస్తాము. కానీ రథసప్తమి నాడు శ్రీవారు సప్తవాహనాలపై తిరుగాడుతూ దర్శనమిస్తారు. అలా ఆనాడు స్వామిని దర్శించటానికి రాసిపెట్టి వుండాలి.

ఏ విధంగా ధనాన్ని సంపాదించాలి

మీరెలా సంపాదిస్తారన్న విషయాన్ని మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను. డబ్బు సంపాదించటం మాంసాన్ని అమ్మి కూడా సంపాదించవచ్చు. అదే డబ్బుని పూలమ్మి కూడా సంపాదించవచ్చు. నిర్ణయం తీసుకోవాల్సిందే మీరే. ధర్మం గొప్పది. సంపాదించే ధనాన్ని బట్టే సుఖాలూ, సౌభాగ్యాలూ, ఆనందాలూ ఉంటాయి. అధర్మ సంపాదన ంటే తాత్కాలిక సుఖమే.

గట్టిగా మాట్లాడితే.. పూజా భంగమే

★ విద్యాలయంలో గట్టిగా మాట్లాడితే జ్ఞాన భంగం

★ వైద్యాలయంలో గట్టిగా మాట్లాడితే ఆరోగ్యభంగం (వైద్యుడు స్టెతస్కోప్‌తో పరీక్షించేటప్పుడు సున్నితమైన స్పందనల ద్వారా ఆరోగ్య పరిస్థితి తెలుస్తుంది. గట్టిగా మాట్లాడితే స్పందనలు అర్థంకాక ఇచ్చే మందు నిర్ణయం మారుతుంది. తద్వారా మనకే మన వారికే మీ తోటి వారికే అనారోగ్యం)

★ ధనం రావాల్సిన చోట గట్టిగా మాట్లాడితే ధనం సంగతి అటుంచి, గట్టిగా మాట్లాడితే సమస్య పెద్దదవుతుంది. రావాల్సిన ధనం విషయం చిన్నదవుతుంది. ధనం ఇస్తే ముళ్ళ మీద గుడ్డ వేస్తే ఎంత జాగ్రత్తగా తీసుకోవాలో అంత జాగ్రత్తగా లౌక్యంగా తీసుకోవాలి.

★ పూజలో, ఆలయాలలో గట్టిగా మాట్లాడితే ఏకాగ్రత దెబ్బతింటుంది. తద్వారా ప్రశాంతత పోయి ఆందోళన ఎక్కువవుతుంది.

★ గృహాలయంలో భాగస్వామితో గట్టిగా మాట్లాడితే చికాకుతో రోజువారీ కార్యకలాపాల్లో తప్పుడు నిర్ణయం జరిగి ధన నష్టం జరుగుతుంది. కాన గట్టిగా, ఆవేశంగా మాట్లాడితే ధనం, ఇంకా సుఖశాంతులని నష్టపోతాము.

ధనుర్మాసంలో శ్రీమహావిష్ణువు పూజా విధి

ముల్లోకాధిపతి అయిన శ్రీమహావిష్ణువు ఆషాఢము నుంచి కార్తీకము వరకూ నిద్రిస్తాడు. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన తర్వాత శ్రీవిష్ణుస్తోత్రాలతో స్వామిని మేల్కొలిపి షోడశోపచారములతో పూజించాలి. అలాగే పులగం, పొంగలి, శర్కర పొంగలిని నివేదించాలి.

ఈ ధనుర్మాసంలో శ్రీమహావిష్ణువుని సూర్యోదయానికన్నా ముందు, అనగా అరుణోదయానికి ముందే పూజించాలని ధర్మసింధు శెలవిస్తోంది.

మహాదరిద్రం పోవాలంటే

కార్తీమాసంలో తులసీదళాలతో శ్రీమహావిష్ణువుని పూజించి, ఇంటి వద్ద ఒక స్థంభం పాతి దానికి ఓ పాత్రని వేలాడదీసి అందులో ఎనిమిది దిక్కులు కనిపించే విధంగా ఓ దీపాన్ని పెట్టాలి. ఆపై పూలతో పూజించాలి. అలా చేస్తే ఎంతటి దరిద్రమైనా తీరిపోతుంది. అప్పుడు చేసే శ్రీమహావిష్ణుపూజ మహా ప్రశస్తము.

శ్రీమహావిష్ణువు ఆనతి ప్రకారము శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంపై తొండమాన్ చక్రవర్తి విమాన వేంకటేశ్వరస్వామిని నిర్మాణం చేశాడు. ఈ మూర్తి దర్శనం మూలమూర్తి దర్శనంతో సమానం, శుభప్రదం.

అపజయములు పదే పదే ఎదురవుతున్నప్పుడు

అలాంటి పరిస్థితి ఇంద్రుడికి వచ్చింది.. అపజయం మీద అపజయం. అలాంటి స్థితిలో విశ్వరూపుడి నుంచి నారాయణ కవచమును ఉపదేశం పొంది మహా విజయాన్ని సాధించాడు. నారాయణ కవచం పఠించటంకన్నా ఆ నారాయణ కవచం ఉన్న శ్రీభాగవతము అనగా ఆరవ స్కంధంలో ఎనిమిదో అధ్యాయంలోని భాగాన్ని భక్తిగా చదవండి. భయం పోతుంది. శక్తి వస్తుంది. విజయం అలవోకగా సిద్ధిస్తుంది.

సనాతన ధర్మ లక్షణాలు

సత్యాన్ని పలకటం, మహా నిగ్రహం.. తపస్సు.. శుభ్రంగా వుండటము.. ఆనందంగా వుండటం... సంబంధించిన విషయాల్లో సిగ్గు కూడా కలిగి వుండటం.. సహనం... సత్ప్రవర్తన.. జ్ఞానం.. శమం.. కరుణ.. ధ్యానం.. ఇవే సనాతన ధర్మానికి ముఖ్య లక్షణాలు.

మరిచిపోతున్న ఉగ్గు

బిడ్డల ఆయురారోగ్యాల కోసం తల్లి ప్రతిరోజు ఉగ్గు పెట్టేది. బిడ్డను కాళ్ళపై పడుకోబెట్టుకుని బంగారం, వెండి, లోహ గిన్నె వంటి దేనితోనయినా సరే ఉగ్గును మెల్లగా పోస్తూ పాటలు పాడేది. దాని వల్ల ఐశ్వర్యాన్ని పొందేందుకు కావాల్సిన శక్తి, ఆలోచన ఉగ్గు ద్వారా వస్తాయి. కాన ఈ తరం వారు ఉగ్గును మరవద్దు.

బీబీనాంచారమ్మ...

చాలా మంది అనుకునేటట్టు సాధారణ స్త్రీకాదు.. ఢిల్లీ సుల్తాను గారి పుత్రిక. ఓ సందర్భంలో ఢిల్లీ ఖజానాకి చేరిన సంపత్కుమార స్వామి మూర్తిని చూసి బీబీనాంచారమ్మ భక్తితో పులకించిపోయింది. అంతఃపురంలో తన కళ్ళ ఎదుటే ఆ మూర్తిని ఉంచుకుంది. ఆ తర్వాత ఆ విగ్రహం చేరాల్సిన చోటుకి చేరినా ఆ విగ్రహం ప్రతిష్ఠించిన ప్రాంతం వద్దకే వచ్చి పూజాదికాలు చేసింది. శ్రీరామానుజాచార్యులు బీబీనాంచారమ్మ విగ్రహం చేయించి శ్రీరంగనాథస్వామి సన్నిధిలో ప్రతిష్ఠింప చేశారు. బీబీనాంచారమ్మ విగ్రహాన్ని చూడాలనుకుంటే శ్రీరంగం వెళ్ళాల్సిందే.

మడి బట్టలు శుచి ఎలా అవుతాయి

తీర్థయాత్రలప్పుడూ, పుణ్యకార్యాలప్పుడు తడి బట్టలు ధరించాల్సి రావచ్చు. అలాంటి సమయంలో సూర్యుని ఎదుట ఆరుసార్లు విదిలించి ధరించాలి. అలాగే పొడి వస్త్రాలను ఏడుసార్లు సూర్యుని ముందు విదిలించితే శుచి అవుతాయి. అవకాశం లేనప్పుడు మాత్రమే అలా చేసి ధరించాలి.

మహా సమస్యలూ, బాధలూ, దరిద్రాలూ తీరటానికి

శ్రీమహావిష్ణువు ఆలయంలో పూజాదికాలు చేయించి పులిహోరను నైవేద్యంగా సమర్పించి ఎంత వీలయితే అంత ఎక్కువ మందికి పంచితే పై సమస్యలు తీరుతాయి. పులిహోర శనీశ్వరునికి మహా ప్రీతికరం. పులిహోరను పంచటం వల్ల దోషాలు పోతాయి. పులిహోరలో పచ్చి మిరపకాయలను ఎక్కువగా వేయండి. అలాగే కేసరిని నైవేద్యంగా పెట్టి పంచితే భయభీతులు పోతాయి. శత్రువులు సమసిపోతారు.

మరీచి... అంగిరసుడు.. అత్రి.. పులస్త్యుడు.. పులహుడు..క్రతువు.. వశిష్ఠుడు.. వీరే సప్త ఋషులు.

వ్రత పూజాదికార్యాలలో వుండగా గడప దాటవద్దు

పూజ, వ్రతం ఏదైనా దైవ సంబంధిత కార్యము సమయంలో ఎట్టి స్థితిలోనూ మధ్యలో ఆపి గడప దాటకూడదు. అలా చెయ్యటం వల్ల భార్యాభర్తల మధ్య అన్యోన్యత దెబ్బతింటుంది. మహా సాధ్వీమణి సీతాదేవి వాల్మీకి ఆశ్రమంలో వ్రతం చేస్తూ తప్పక శ్రీరామ కుశలవుల మధ్య పోరు ఆపటానికి వ్రతభంగం అయినా పర్వాలేదని వెళ్ళింది. కాన వ్రతము పూర్తి అయిన తర్వాతే ఎంతటి కార్యమయినా...

ఏది శాకాహారము

పండ్లు, కూరలు.. ఇత్యాదివన్నీ తినటం, కోయటం హింస కిందకు రాదు. ప్రాణులు రెండు రకాలు. చరములు అనగా కొట్టినా, బాధించినా విలవిలలాడేవి. వాటిని హింసిస్తే హింస క్రిందకు వస్తుంది. రెండోవి అచరములు వాటికి చరముల వలే శరీర బాధలు లేవు. వాటిని కోసి తినటం హింస కిందకు రాదని శాస్త్రం శెలవిస్తోంది.

శ్రీమహావిష్ణు పూజకు వినియోగించే తులసిని ఎప్పుడు కోయరాదు

ఆదివారం, శుక్రవారం, యాగాదుల సమయంలో, సంక్రాంతి, పూర్ణిమ, అమావాస్యలు.. ఏకాదశి ద్వాదశి రాత్రులలో.. సంధ్యాకాల సమయాల్లోనూ, మధ్యాహ్నమూ తులసిదళాలను కోయరాదు.

సకల దోషాలనూ సమసిపోయేలా చేసే క్షేత్రం

ముక్తినాథ్ క్షేత్రం... నేపాల్ నుంచి దాదాపు వందల కొండలను దాటితే దర్శనమిచ్చే యోగనారాయణుడ్ని దర్శించుకుని అక్కడి నూట ఎనిమిది దివ్య ధారల్లో పునీతం అయితే మహా ఘోరాలూ, పాపాలూ, దోషాలూ కూడా కనుమరుగవుతాయి. చిత్రగుప్తుడి చిట్టాలో పుణ్యాలు మాత్రమే మిగులుతాయి. పాపాల పద్దులు మాయమవుతుంటాయి. రోజుకి నలభైవేల సార్లు జీవితాంతం శ్రీకృష్ణనామాన్ని జపిస్తే కలిగే ఫలం ముక్తినాథ్ క్షేత్ర దర్శనం కలుగుతుందని స్థల పురాణం.

అష్టదిక్పాలకులు

★ ఇంద్రుడు... తూర్పుకి అధిపతి. భార్య శచీదేవి. వాహనం ఐరావతం.

★ అగ్ని... ఆగ్నేయానికి అధిపతి. భార్య స్వాహాదేవి. వాహనం పొట్టేలు.

★ యముడు... దక్షిణానికి అధిపతి. భార్య శ్యామలాదేవి. వాహనం మహిషం.

★ నిఋతి.... నైఋతికి అధిపతి. భార్య దీర్ఘాదేవి. వాహనం నరుడు.

★ వరుణుడు... పడమరకు అధిపతి. భార్య కాళికాదేవి. వాహనం మకరం.

★ వాయువు... వాయువ్యానికి అధిపతి. భార్య అంజనాదేవి. వాహనం జింక.

★ కుబేరుడు.. ఉత్తరానికి అధిపతి. భార్య చిత్రలేఖ. వాహనం శ్వేతాశ్వం.

★ శివుడు... ఈశాన్యానికి అధిపతి. భార్య లోకమాత పార్వతీదేవి. వాహనం వృషభం.

అత్రి, అనసూయ పుత్రులు

సంతానం కోసం ఋక్ష పర్వతంలో తపస్సు చేసిన అత్రి, అనసూయ దంపతులకి త్రిమూర్తులు సంతాన వరప్రసాదం అందిస్తారు. శ్రీమహావిష్ణువు దత్తాత్రేయునిగానూ, బ్రహ్మ చంద్రుడిగానూ, శివుడు దూర్వాస మహర్షిగానూ వారికి బిడ్డలుగా జన్మిస్తామని. ఆ వరప్రసాదంగానే వారికి జన్మించారు. శ్రీరామాయణంలో సీతారాములు వనవాసానికి వచ్చినప్పుడు ఎప్పుడూ వాడిపోని పూలనూ... మంగళకరమైన వస్త్రాలనూ కోడలికి బహూకరించింది అనసూయాదేవి.

త్రిమూర్తులే సూర్యుడు

ఉదయం పూట బ్రహ్మ రూపం, మధ్యాహ్నం ఈశ్వర రూపం, సాయంవేళ విష్ణు రూపం. రథసప్తమి రోజు బెల్లంతో చేసిన పొంగలిని చిక్కుడు ఆకులలో ఉంచి సూర్యునికి నైవేద్యం పెడితే అపూర్వమైన అధికారం కలుగుతుంది.

అతిగా నెయ్యి వాడకండి

అతిగా నెయ్యి వాడరాదు. అలా అతిగా నెయ్యి గ్రహించినందుకు సాక్షాత్తు అగ్నిదేవునికే అగ్నిమాంద్యం ఏర్పడింది. బ్రహ్మదేవుని మాటతో అనేక వనమూలికలు గల ఖాండవవనాన్ని దహించి గాని ఆ వ్యాధిని పోగొట్టుకోలేకపోయాడు హవ్యవాహనుడు.

సూర్యదేవుణ్ణి ఎలా పూజించాలి

ఆదివారం నాడు ఓంకార రూపుడగు సర్వజగత్కారియైన వాడూ, శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన వాడూ, అదితి గర్భమున జన్మించిన వాడూ అయిన సూర్యభగవానుడికి నెయ్యి, దానిమ్మ పండ్లను సమర్పించితే అనుకున్న కార్యాన్ని శుభంగా, విజయవంతంగా పూర్తి కావిస్తాడు. అలాగే సూర్య భగవానుడికి మినుములు, ఎండుద్రాక్ష, పచ్చిద్రాక్ష, నెయ్యిలను ముఖ్యంగా నైవేద్యంగా సమర్పించాలి.

ఆపదలని గట్టెక్కించే

ప్రణవ మంత్రం

'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ప్రణవ మంత్రాన్ని పన్నెండు వేలసార్లు ఏడుశనివారాల్లోపల వ్రాస్తే మహా ఆపదలని సహితం శ్రీవేంకటేశ్వరుడే వచ్చి చేయి పట్టుకుని దాటిస్తాడు. అంతటి మహత్తరమైనది ఆ మంత్రం.

ప్రతిరోజు 108 సార్లు ఇష్ట దైవాన్ని స్మరిస్తే

'ఓం భాస్కరాయనమః' అనే సూర్యదేవుని మంత్రాన్ని చదివితే ఆయువు, బలం, తేజస్సు, కీర్తి వృద్ధి అవుతాయి.

'ఓం సరస్వత్యైనమః' అని పఠిస్తే విద్య.. గౌరవం, యశస్సు కలుగుతాయి.

'శ్రీవేంకటేశ్వరాయ నమః' అని జపిస్తే సకల సౌభాగ్యాలు, సంపదలు... సౌఖ్యాలు కలుగుతాయి. ఆ మంత్ర శబ్ద పఠనం అంతటి ఫలాన్ని అందిస్తుంది.

రోలు, రోకలిని

గృహంలో ఉంచాలి

ఎన్ని అత్యాధునికమైన పరికరాలు అందుబాటులోకి వచ్చినా రోలు, రోకలి చిన్నివాటినైనా సరే గృహంలో వుంచాలి. ఆ రెండూ లక్ష్మీ స్వరూపాలు. అందుకే పెద్దలు చెప్పేది.. రోలు, రోకలిని ఇంట్లో వుంచండి అని. లేదంటే శుభకార్యాలు అలస్యమవుతాయి. అడ్డంకులు వస్తాయి. శుభకార్యాల వంటివి జరుగుతున్న సమయంలో చికాకులొస్తాయి.... గొడవలొస్తాయి. కాన గృహంలో రోలు, రోకలి తప్పక ఉంచండి.

ఆర్థికంగా దెబ్బకొడితే అంతే..

పగ, కోపం, ద్వేషం, అసూయలతో గానీ, మహా అవమానాన్నీ, ద్రోహాన్నీ చేసిన వారిపై పగ తీర్చుకోవటానికి కొట్టినా, తిట్టినా.. ఏం చేసినా తిరగబడే ప్రమాదం ఎక్కువగా వుంది. అదే ఆర్థికంగా కొడితే... జన్మలో లేవలేడు. అన్ని దశల్లోనూ పతనం ప్రారంభమవుతుంది. నిరాశా, నిస్పృహలతో వెనక్కి వెనక్కి పోవటమే. అందుకే ఎక్కువ మంది ఆర్థిక మూలాల మీదే కొడతారు. అలాంటి వాళ్ళు దెబ్బ కొడితే ఆర్థిక స్థితిపై

కొడితే తేరుకోవటానికి పాండవులకే అసాధ్యమైంది. పక్కన వాసుదేవుడు వుండబట్టి మళ్ళీ తేరుకోగలిగారు. కాన ఆర్థికంగా జాగ్రత్త. మొత్తం పోతేగానీ మీరు ఆర్థికంగా దెబ్బతిన్నారని తెలీదు. చేసేవాళ్లు ఆస్థాయిలో చేస్తారు. జాగ్రత్త.

ఏ గరుడ పురాణం గృహంలో ఉంచుకోవచ్చు...

అష్టాదశపురాణాలను వ్యాసుడు రాసింది సకల విషయాల జ్ఞాన సమపార్జనను మానవులకి అందించాలనే.. గరుడ పురాణం అంటే మీరనుకున్నట్టు నరకలోక శిక్షలు ఒక్కటే కాదు రత్నాల పరీక్ష.. రాజనీతి.. శ్రీమహావిష్ణువు అవతారాల విశిష్ఠత.. రోగవిధానాలు.. ఇలా ఎన్నో 18 వేల శ్లోకాలు గలది. శ్రీమహావిష్ణువు గరుడుడికి చెప్పిన ఆయుర్వేద, యజ్ఞ, పూజా ఆరోగ్యం విషయాలతో పాటు మానవులు పాపం చేస్తే ఏ ఏ శిక్షలు అనుభవిస్తారో గరుడ పురాణంలో ఓ ఖండంలో అనగా ప్రేత ఖండంలో చెప్పి వున్నాడు. ఆ ఖండం గరుడ పురాణంలోని ఓ ఖండం మాత్రమే కాని మొత్తం గరుడ

పురాణమే ఆ ఖండం కాదు. ఇంట్లో గరుడ పురాణం ఉంచుకోవచ్చు. నరలోక పాప శిక్షలు గల ప్రేత ఖండము కాదు... మొత్తం గరుడ పురాణాన్ని గృహంలో వుంచుకోండి.

దుస్వప్న నాశన మంత్రము

సహస్ర పరమా దేవి శతమూలా శతాంకురా

సర్వం హరతుమో పాపం దుర్యా దుస్వప్ననాశనీ ॥

మంచి విషయాలు మాట్లాడుకుంటే మనసు బాగుంటుంది. ఫలితంగా ఆరోగ్యం... చెడ్డ విషయాలు మాట్లాడుకుంటే అనారోగ్యం.. ఆరోగ్యమంటే గంగానది ఒడ్డున వుండటం, అనారోగ్యమంటే మురికి కాలువ పక్కనుండటం.

పంచదశీ మంత్రం

క ఏ ఈ ల హ్రీం - హ స క హ ల హ్రీం - స క ల హ్రీం

సహస్రనామాలతో ఆనంతుణ్ని

కీర్తించేదెందుకు

శతం, సహస్రం మహా దివ్య శబ్దాలు. పరమాత్ముని దివ్యశక్తి వాటిలో ఉంది.. అనంతనామముడు, అనంతరూపుడూ అయిన నారాయణుడ్ని సహస్రంలో పూజించి కీర్తించటం సాధ్యం. వేయి నామాల విష్ణువుని మనల్ని అన్ని విధాలుగా రక్షించమని **108** అష్టోత్తరనామాలతో, **1008** సహస్రనామాలతోను పూజిస్తున్నాము. జయశీలుడు మహావిష్ణువు ఆ వైకుంఠవాసుడ్ని జ్యోతిష్య ప్రకారం కూడా **108, 1008** ఇంకా సంఖ్యాశాస్త్ర ప్రకారం **9** వచ్చేలా పఠిస్తే, పూజిస్తే గ్రహ శక్తులు కూడా శుభాలనిస్తాయనీ, వంద ఎనిమిది కలిపి నూట ఎనిమిది నామాలతో అష్టోత్తర పూజ మరియు వెయ్యి ఎనిమిది నామాలతో సహస్రనామాలుగా కీర్తిస్తున్నాము. అలా చెయ్యటం వల్ల... పూజించటం వల్ల... కీర్తించటం వల్ల యజ్ఞం చేసిన ఫలం వస్తుందని చాలా మందికి తెలీదు.

శివ విష్ణువులకి భేదం చూపించకండి

శివరూపుడే విష్ణువు. విష్ణు రూపుడే శివుడు. శివహృదయం విష్ణువు. విష్ణు హృదయం శివుడు. శివకేశవులకి భేదం చూపించనంత వరకే ధనం, ఆయుష్షు నిలిచి వుంటాయి. విష్ణు సహస్రనామాలను భీష్ముడు ఉపదేశిస్తే, శివసహస్ర నామాలను శ్రీకృష్ణ పరమాత్ముడే ఉపదేశించాడు. శ్రీకృష్ణుడ్ని వివాహం చేసుకోవటానికి రుక్మిణీదేవి మహేశ్వరుడ్ని ప్రార్థించింది. శ్రీరామ జపాన్ని గౌరీదేవికి ఉపదేశించాడు శివుడు.

భక్తి యొక్క శక్తే ఉపవాసాన్ని పూర్తి గావిస్తుంది

శ్రీరాముడు అరణ్యాలకి వెళ్ళినప్పుడు అయోధ్యలోని చెట్లు, పూలు, ఫలవృక్షాలు మొలకలతో సహా వాడిపోయాయిట. వనవాసమనంతరం వచ్చే దాకా అలానే వున్నాయి. ఆపై చిగురించి, పూలు పూసి ఆనందం చెందాయి. అంతకాలం వాటికా శక్తినిచ్చింది ఎవరు.. ఇంకెవరు.. ఆ శ్రీరాముడు. ఏడు అహోరాత్రాలు

అన్నపానాలను గోవులకూ, గోకుల వాసులకీ ఇచ్చింది ఎవరు? యశోదాకృష్ణుడు. గోవర్ధన గిరినెత్తి ప్రజలను రక్షించటమే కాక తన అమృతపు చూపులతో ప్రాణశక్తిని నిలిపిన ఆ గోవిందుడు ఆ శ్రీకృష్ణభగవానుడు. ఉపవాసం చేసేటప్పుడు ఆ పరమాత్ముడే మహాశక్తినిస్తాడు. అదే భక్తి, శక్తిల రహస్యం.

కష్టాల్లోని వారి వద్దకి దేవదేవుడే దిగి వస్తాడు

తన భక్తులకి కష్టం వస్తే.. ఆ దేవదేవుడే దిగి వస్తాడు. వాయువు ఎలా అయితే అడ్డు ఆపూ లేకుండా వచ్చేస్తాడో... అలాగే భగవానుడు మన చెంతకి ఏదో రూపంలో వచ్చి రక్షిస్తుంటాడు. శ్రీరాముడు తనకై తపిస్తున్న అహల్య.. శబరి.. భరద్వాజ, గుహుడు, సుగ్రీవుల వద్దకు వెళ్ళాడు. లోకకంటకుడైన రావణుడి వద్దకూ తానే వెళ్ళి సంహరించాడు. రక్షించాలన్నా, శిక్షించాలన్నా, భక్షించాలన్నా తనే కదలి వస్తాడు. కాకపోతే పాపం.. పుణ్యం పండాలి.

వైదిక విద్యలు

నాలుగు వేదాలు... ఆరు వేదాంగాలు.. మీమాంస, న్యాయశాస్త్రం, పురాణం, ధర్మశాస్త్రం ఇవే పధ్నాలుగు వైదిక విద్యలు. హయగ్రీవ రూపంలో మధుకైటభుల్ని వధించి వేదాది విద్యలను బ్రహ్మదేవునికి ఉపదేశించాడు శ్రీమహావిష్ణువు.

కీర్తి తర్వాత అహం తగదు

శ్రీలక్ష్మీనారాయణులు వస్తే తలుపెయ్యటమే. శత్రువులైనా ఇంటికొస్తే గౌరవించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. పురాణ ఇతిహాసాలు వల్లిస్తున్నాయి. ధనం, కీర్తి ఏవీ శాశ్వతం కావు. ధనం ద్వారా వచ్చిన అహాన్ని శ్రీలక్ష్మీదేవి పోగొట్టి అహాన్ని అణుస్తుంది. విద్య ద్వారా వచ్చిన జ్ఞానం ఆ ద్వారా వచ్చిన కీర్తితో అహం ప్రదర్శిస్తే శ్రీమహాలక్ష్మి వారిని భరించలేని స్థితికి తీసుకువచ్చి అణగారుస్తుంది. 'నేనే' అన్న అహం ఎప్పటికైనా పతనమే. ప్రతి తరంలో కూడా మహాత్ములు పుడతారు. అదొక్కటి గుర్తుపెట్టుకుంటే... నేనే అన్న అహం సామాన్యుల మీద, ధర్మపరుల మీద చూపించరు.

నాలుగు దుఃఖాలు

గర్భ, జనన, మరణ దుఃఖాలు. ఆ దుఃఖాల ముందు మామూలు బాధలు ఎంత. స్త్రీ పడే గర్భ దుఃఖం ముందు సకల కష్టాలు ఎంత? జన్మించేటప్పుడు శిశువు పడే బాధ ముందు ధన కష్టాలు ఎంత... ముసలితనంలో పడే కష్టాలు.. ఎంతటి కష్టం. ఆఖరికి మరణ కష్టం. అరోగ్యంగా తిరుగుతూ తిరుగుతూ పోవాలని కోరుకుంటారు. కానీ మరణ సమయంలో ఎవ్వరికైనా మహా బాధ, వ్యధ తప్పదు. మంచంలో పడ్డా.. తిరుగుతున్నా.. ఆ క్షణంలో శాస్త్రాల్లో చెప్పినట్టు శరీరంలోని సకల నాడులపై ఏకకాలంలో వెయ్యి తేళ్ళు కుడితే ఎంత బాధ వుంటుందో అంత బాధతోనే అందరమూ పోతాం. కాన కష్టము, కష్టాలు అని ఆలోచించద్దు. కాన జీవిత జీవన ఆర్థిక, కుటుంబ, మానసిక కష్టాలు పోవు.

శ్రీభాగవతం చదివితే వివాహం అవుతుంది

శ్రీకృష్ణుని సోదరి కాత్యాయనీ వ్రతం చెయ్యటం, ఇంకా గుండ్రాయికి పసుపు రాసి పూజించటం చేస్తే వివాహం త్వరగా అవుతుందని మన పెద్దలు యుక్త

వయస్సు వచ్చిన ఆడపిల్లల చేత తప్పకుండా చేయించేవారు. ఈ యాంత్రిక జీవితంలో అవన్నీ చెయ్యక చెయ్యలేక పోయినా కనీసం శ్రీభాగవతంలో శ్రీకాత్యాయని భాగాన్నయినా చదివించండి. త్వరగా వివాహం అవుతుంది.

మోక్షం అంటే మీరనుకునేది కాదు

భగవంతుడు మీకు మోక్షము ఇవ్వదలిచాడు. కొన్నివేల లక్షల కోట్ల సంవత్సరాల మీ పూర్వీకులు చేసిన సకల పాప దోషాలు ప్రక్షాళనము అయినప్పుడే మీ వంశాన్ని మీతో ఆపేస్తాడు. మీది అద్భుతమైన జన్మ. ధర్మ, న్యాయ జీవ పద్ధతులలో జీవితాన్ని ముగిస్తే అదే మోక్షము. సకల వేద శాస్త్రాల్లో మోక్షము వచ్చేది అలాంటి సందర్భంలోనే. మోక్షము అంటే మరణం కాదు. అద్భుతమైన సౌందర్య రాశి పెదవి, రత్న భాండాగారం, కామధేనువు, కల్పవృక్షము, వ్యభిచారి, మట్టి పెళ్ళ, కుక్కమాంసం అన్నింటినీ సరిసమానంగా చూడటమూ మనకి అనిపించటమే మోక్షము. మోక్షము ఇవ్వమని భగవంతున్ని కోరుకునేది ప్రాణాన్ని తియ్యమని కాదు.

కుబేరుణ్ని పూజిస్తే లభించేది

కుబేరుడు శ్రీవేంకటేశ్వర స్వామి వద్ద ఠంచనుగా వడ్డీ వసూలు చేస్తున్నాడు. అలాంటి వడ్డీ వ్యాపారస్థుడ్ని పూజిస్తే వడ్డీకి అనగా అప్పులు బాగా దొరుకుతాయి. పురాణ ఇతిహాసాల్లో ఎవ్వరూ కుబేరుణ్ని పూజించి ధన సంపదలని పొందిన దాఖలాలు లేవు.

ఏ జన్మ తర్వాత మానవ జన్మ

భగవంతుడి సృష్టిలో **64,000** వేలకోట్ల ప్రాణులు ఉన్నాయి. మనం మాత్రమే మనుషులగా జన్మించాము. మిగతా ప్రాణులన్నీ అనగా కుక్క, నక్క, ఎలుక, ఈగ, పాము, తేలు, చీమ ఇత్యాదివన్నీ అనగా **64,000** కోట్ల ప్రాణులూ భగవంతుని సృష్టిలో సరిసమానమే. మానవ జన్మ **64,000** కోట్ల ప్రయాణాన్ని దాటిన తర్వాతే వస్తుంది. మానవ జన్మకి ముందు జన్మ 'వృక్షము'. ఆ తర్వాతే మానవ జన్మ. ఈ మానవ జన్మ పూర్తి అయ్యాక మళ్ళీ **64,000** కోట్ల ప్రాణులుగా పాప పుణ్యాల ప్రకారం వైకుంఠపాళిలో, చదరంగంలోలా అన్ని జన్మలూ ఎత్తాల్సిందే. 'నా కొడుక్కి మా నాన్న పుట్టాడు... మా తాతగారు పుట్టారు... మా అమ్మమ్మ పుట్టింది..'

అనుకోవటం కేవలం భ్రమ. అలా ఎప్పటికీ జరుగదు. ఎవ్వరికో గాని... మహా మహా అదృష్టపుణ్యవంతులకు గాని అలా జరుగుతుంది. ఇది నేను చెప్పింది కాదు. శాస్త్రం చెప్పినదే. ఎవరైనా బాధపడితే, ఏదైనా అనుకుంటే నేను చెయ్యగలిగింది ఏమీ లేదు. కాన వృక్షాల్ని ప్రేమించండి. కొట్టకండి, నరకకండి, ఎంగిలి చేయకండి. ఎందుకంటే రేపొద్దున భగవంతుని శాసనం ప్రకారం ఆ చెట్టే జన్మల విధి ప్రకారం మన కుటుంబంలోనే పుట్టవచ్చు.

కొండలెక్కేటప్పుడు

తీర్థ పుణ్యయాత్రల్లో ఒక్కోసారి ఎక్కువ దూరం నడవటం.. కొండలెక్కటం వంటివి చేయాల్సి రావచ్చు. అలాంటప్పుడు దాహం తీర్చుకోవటానికి తులసీ, పుదీనా వేసి కాచిన నీటిని దగ్గరుంచుకోండి. స్వామి సన్నిధికి చేరి హాయిగా దర్శించుకోండి.

హవిష్యము అనగా బియ్యాన్ని కడగకుండా శాకములు కలిపిన బియ్యమును ఒకేసారి ఉడికించి పెట్టే అన్న నైవేద్యము.

స్వస్తి చెప్పేదెందుకు

'స్వామీ.. ఈనాడు విధిగా నీ పూజాదికాలను చేశాను. ఈ రోజు నేను చెయ్యాల్సిన గృహ ధర్మాలూ, వాణిజ్య వ్యాపార ఉద్యోగ ధర్మాలన్నింటినీ సక్రమంగా జరపటానికి తగు శక్తిని నీవే ఇవ్వాలి. సకల కుటుంబ ధర్మాలన్నింటినీ నెరవేర్చి మళ్ళీ నీ పూజాదికాల వద్దకు వస్తాను. ఈ రోజుకి స్వస్తి' అని చెబుతారు. తద్వారా ఆనాటి విధులన్నీ సంపూర్ణ సుఖఫలాలనిస్తాయి.

దక్షిణామూర్తికి చేసే స్మరణ

పుణ్యాలని ఇస్తుంది. శక్తినిస్తుంది. అవసాన దశలో నారాయణా అంటే సకల పాపాలూ, దోషాలూ సమసిపోతాయి. అవసాన దశలో ఆస్తుల గూర్చీ, కుటుంబ బంధనాల గూర్చీ మాట్లాడకుండా 'నారాయణా, నారాయణా' అని తలచుకునేలా జ్ఞప్తికి తెచ్చి అనిపించేలా చేసేది దక్షిణామూర్తి. ఆలయంలో ప్రదక్షిణలయ్యాక గోపురం వైపు చూసి దక్షిణ దిశగా చూస్తుండే దక్షిణామూర్తిని తప్పక స్మరించి నమస్కరించండి.

అష్టలక్ష్మి అనుగ్రహం కోసం

★ బంగారు ఆభరణాలు ధరించటం వల్ల.. ఆయుష్షు పెరుగుతుంది.

★ శాంతంగా, సౌమ్యంగా వుంటే... ఆరోగ్యం.

★ నూలు వస్త్రాలు ధరిస్తే... తేజస్సు

★ చిరునవ్వు చెదరకుండా వుంటే.. శ్రీలక్ష్మీనిధి

★ పక్కవారికి చేతనయినంత సాయం ... కుటుంబమంతటికీ శ్రీరామరక్ష.

తృప్తి వుంటే... యవ్వనం నిలకడగా వుంటుంది.

సంకల్పంతో పని చేస్తే... మహావిజయం.

మంచి మాటలు మాట్లాడితే.. మంగళప్రదము.

మిత భోజనం.. మహాసౌందర్యము.

అవమానంతో వెనక్కి తగ్గద్దు

సుఖం హ్యవమతః శేతే సుఖం చ ప్రతిబుధ్యతే

సుఖం చరతిలోకేఽస్మి న్నవమంతా వినశ్యతి

అవమానం పొందిన వాడికే తెలుస్తుంది ఆ బాధ.

అయితే కొంతకాలం తర్వాత సుఖంగా వుంటాడు. చేసిన వాడు మాత్రం పాపఫలాన్ని జీవించి వున్నంత వరకూ అనుభవించక మానడు. అవమానంతో తలవంచితే ముఖ్యంగా ధనం దూరమవుతుంది.

తిరుమల

శ్రీవేంకటేశ్వరస్వామి వారి

ఆభరణాలు

సువర్ణపద్మపీఠము – శ్రీపాదముల క్రింద

సువర్ణపాదములు – శ్రీపాదములకు

నూపులములు

(చిరుగజ్జెలతో కూడుకున్నవి)

– శ్రీపాదములకు పైన పాదాభరణములు

పాగడాల్ – నూపురములకు పై పాదాభరణములు

కాంచీగుణము – మధ్యమాభరణము (మొలనూలు)

ఉదరబంధము (నాగఫణ యుతము) – మధ్యాభరణము (బెల్టు)

దశావతారరశనా(చిరుగంటలతో కూడినది)

– దశావతారములు, పంచవ్యూహములు, శ్రీభూదేవులు, స్వామివారు, 18 విగ్రహములతో కూడిన చిరుగంటల మొలత్రాడు

చిన్నకంఠాభరణము – కంఠభూషణము

పెద్దకంఠాభరణము – వక్షస్థల పర్యన్తము

బంగారు పులిగోరుహారము – హృదయపర్యన్తము

గోవుహారము – నాభి పర్యన్తము అయిదు పేటల హారము

సువర్ణయజ్ఞోపవీతము – రత్నగ్రంథులు గల ఆరుపేటల ఉపవీతము

సాధారణ యజ్ఞోపవీతము – షణ్ణవతిచే తయారైన యజ్ఞోపవీతము

తులసీపత్రహారము – కటిహస్తపర్యన్తము 108 పత్రములు హారము

చతుర్భుజలక్ష్మీహారము – జానుపర్యన్తము 108 లక్ష్మీప్రతిమలతో కూడిన హారము

అష్టోత్తరశతనామహారము – జంఘాపర్యన్తము

(108) అష్టోత్తర శతనామములుగల బిళ్ళలతో కూడిన హారము.

సహస్రనామ హారము – పాదవర్యన్తము **(1000)** వెయ్యి నామములుకల వెయ్యి బిళ్ళలతో కూడిన ఐదువరుసల హారము

సూర్య కఠారి – నాభ్యాది పాదపర్యన్తము కఠారి వస్త్రమునకు సంబంధించినది

వైకుంఠ హస్తము – దక్షిణ హస్తము

కటి హస్తము – వామహస్తము

కడియములు – కర భూషణములు

నాగాభరణములు – భుజదండ భూషణములు

భుజకీర్తులు – భుజభూషణములు

కర్ణపత్రములు – కర్ణభూషణములు

చక్రశంఖములు – ఇతర హస్తములయందు

కిరీటము – శిరోభూషణము పరత్వ వ్యంజకము

– తిరుమల వారి శ్రీవేంకటేశ్వర వైభవం ఆధారంగా.

గంగానదీ స్నాన సమయం

సూర్యచంద్రుల గ్రహణ కాలమున అన్ని నదులలో నీరు గంగానది నీటితో సమానమైనది, ఆ సమయంలో స్నానం సాక్షాత్తు గంగానదీ స్నానంతో సమానమే. అందులో ఎట్టి సందేహం వలదు.

డబ్బు తీసుకుని జ్యోతిష్యం చెబితే

జ్యోతిష్యాన్ని ధనం తీసుకుని చెప్పటం వల్ల నాగవేష్టమను నరకానికి వెళ్ళాల్సి వస్తుంది. వేల సంవత్సరాలు సర్పముల చేత కాటు వేయించకుంటూ బ్రతకాల్సి వస్తుందని బ్రహ్మవైవర్త పురాణం శెలవిస్తోంది.

అందుకనే జ్యోతిష్య, వాస్తు శాస్త్రాలు శిష్యులకి బోధించే గరువులు ధనం తీసుకోకుండా నేర్పిస్తారు. అవి చెప్పేవాళ్లు దక్షిణగా తీసుకోవచ్చు.

తాళి కట్టిన వాడు

భర్త... భరించటం వల్ల భర్త అనీ, పాలించటం వల్ల పతి అనీ... శరీరానికి ఈశుడు కాన స్వామి అనీ, కామమును తీర్చటం వల్ల కాంతుడు అనీ, ఐశ్వర్యాన్ని ఇవ్వటం వల్ల ఈశుడు అనీ, సుఖబంధాలతో తోడు కాన

బంధువు అనీ, ప్రియాలని ఇస్తాడు కాన ప్రియుడు అనీ, ప్రాణేశుడు కాన ప్రాణ నాయకుడు అనీ, రతిని ప్రేరేపించటం వల్ల వరుణుడు అనీ పిలవబడుతున్నాడు.

కల్పవృక్షము వలే కోరికలు తీర్చే మంత్రం

ఓం సర్వేశ్వరాయ సర్వ విఘ్న వినాశినే మధుసూదనాయ స్వాహాః

ఈ మంత్రం నిగూఢమైనది. సర్వ కోరికలను సంకల్పించుకుని జపించిన, కల్పవృక్షమువలే తీర్చుతుంది. సకల సిద్ధులను ప్రసాదిస్తుంది. కాశీ లోని మణికర్ణికలో అనగా ఆ నారాయణ క్షేత్రంలో జపిస్తే ఎంతటి సిద్ధి అయినను కలుగుతుందని స్కందుడు శెలవిచ్చి ఉన్నాడు బ్రహ్మ వైవర్త పురాణంలో.

హిరణ్యాక్ష.. హిరణ్యకశిపులు భూమిని గోళంగా చేసి గుప్పిటలో ఉంచుకోవటానికి ప్రయత్నించటంతో శ్రీమహావిష్ణువు వార్ని సంహరించి భూమిని రక్షించాడు. ఆపై భూదేవిని వివాహం చేసుకున్నాడు.

కృతయుగంలో నృసింహ నామం...
త్రేతాయుగంలో రామనామం...
ద్వాపర యుగంలో శ్రీకృష్ణ నామం
అత్యం పుణ్య శ్రేష్ఠమైన ఫలలాను
ఇస్తుంది. ఈ కలియుగంలో గోవింద
నామం పరమ పుణ్య పవిత్రము.
సకల కోరికలను తీర్చు కామధేనువు
క్షీరముతో సమానం గోవిందనామం.

బలం, బుద్ధి, చేవ ఇవన్నీ కాలం
అనుకూలంగా ఉన్నప్పుడు ప్రకాశిస్తాయి.
కాలం వికటిస్తే అన్నీ నశిస్తాయి. కాలం
బాగున్నప్పుడు పొంగిపోవటం,
కలసిరానప్పుడు కృంగిపోవటం విజ్ఞులు
చెయ్యదగ్గది కాదు.

- మౌసల పర్వము

రాజరాజేశ్వర సాలగ్రామాన్ని పూజిస్తే

ఏడు చక్రములు, ఛత్రము, బాణము కలిగిన మధ్యమాకారమున ఉండే సాలగ్రామాన్ని పూజిస్తే మహా మహా సంపదలు కలుగుతాయి. అలాగే వెడల్పయిన రంధ్రము, వనమాల, రెండు చక్రములు గల సాలగ్రామాలను పూజించటం వల్ల గృహశాంతితో పాటు సుఖాలనూ, ధనాలని కూడా కలిగిస్తుంది. గుండ్రని సాలగ్రామం కూడా శుభకరం, ధనలాభం కూడా. తులసి గండకీ నదిలో జన్మించింది. నదీ తీరమున శ్రీహరి అంశ వల్ల మహా పుణ్యమైన పర్వతమే ఏర్పడింది. ఆ పర్వతమందు శిలలను కీటకములు తొలచటం వల్ల నల్లని శిలలు గండకీ నదిలో పడుతున్నాయి. అవే పూజనీయములు. తెలిసీ తెలియక ఏవో ఒకటి కొనకండి.

స్త్రీకి చేసిన ద్రోహము పోవటానికి

శ్రీహరిని మొగలి పూలతో, శివుణ్ని ఉమ్మెత్త పూలతో రాత్రి సమయంలో పూజిస్తే స్త్రీకి చేసిన ద్రోహం

సమసిపోతుంది. కోరికలు తీరటానికి నువ్వుల నూనె లేదా ఆవునేతితో దీపం పెడితే సన్నిహితులకి చేసిన ద్రోహ ఫలం కొంతయినా తగ్గుతుంది.

– నారద పురాణం

ఎవరికి ఎన్ని ప్రదక్షిణలు చేయాలి

అమ్మవారికి ఒక ప్రదక్షిణము.. సూర్యునికి ఏడు ప్రదక్షిణలు, వినాయకునికి మూడు ప్రదక్షిణలు.. విష్ణువుకి నాలుగు ప్రదక్షిణలు చేయాలి.

ప్రదక్షిణలు చేసేటప్పుడు వేళ్ళతో లెక్కపెట్టుకోవటం వంటి వాటి కంటే ఎన్ని ప్రదక్షిణలు చేస్తున్నామో అన్ని పూలను తెచ్చుకొని ఒక్కొక్క ప్రదక్షిణ అనంతరం ఒక్కొక్క పూవును ధ్వజ స్థంభం వద్ద ఉంచుతూ ప్రదక్షిణలు పూర్తి చేయాలి. ఈ విధంగా చేయటం వల్ల పుణ్యంతో పాటు మనస్సు పూర్తిగా ఆ వైకుంఠవాసునిపై నిలిచి వుంటుంది.

సంతానం కోసం తులసీ పూజ

కార్తీక పౌర్ణమి నాడు తులసి జన్మించింది. తొలుత పూజ చేసింది శ్రీహరి. తులసి పూజా, అష్టోత్తర

నామాలతో స్మరించటం వల్ల సమస్త దుఃఖాలు పోయి సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది.

పారిజాత పుష్ప పూజ ఎంతటి ఫలాన్నిస్తుంది

పోయిన సంపదలనీ, కీర్తినీ, ఆరోగ్యాన్నీ, గౌరవాన్నీ తెచ్చి పెడుతుంది. పూజానంతరము ఆ పారిజాత పుష్పమును ధరిస్తే ఆ కుటుంబంలోని వారి దోషాలన్నీ పోతాయి. సర్వదా విజయమే లభిస్తుంది. ఇంతటి మహా మహిమాన్వితమైన విషయాన్ని దూర్వాస మహర్షి దేవేంద్రునికి బోధించాడు. పారిజాత పుష్పమాలతో పూజిస్తూ శ్రీమహాలక్ష్మీ స్తోత్రాన్ని పఠిస్తే తానూ శ్రీలక్ష్మీదేవితో పాటు ఆ ఇంట కొలువై ఉంటానని సాక్షాత్తు శ్రీమహావిష్ణువు బ్రహ్మవైవర్త పురాణంలో నారదునితో శెలవిచ్చి వున్నాడు. పారిజాత పుష్ప పూజ మృత్యువుని దూరంగా ఉంచుతుంది. అనేక దీర్ఘ రోగాలను పోగొడుతుంది. సకల దుఃఖాలను దూరం చేస్తుంది పారిజాత పుష్ప పూజ.

ఏ కార్యాలు చేయకూడదు

గోళ్లతో భూమిని రాయకూడదు. నడుం క్రింద భాగంలో నూనె రాసుకుని ఆపై తలంటు కోకూడదు. అక్కా, చెల్లెళ్ళు అతిథి గృహం నుంచి కోపంగా, దురుసుగా వెళ్ళకూడదు.

ఆదివారం పూట... సూర్యసంక్రమణము రోజున, అమావాస్య నాడు, శ్రార్థ కార్యాలు చేసే రోజు బట్టలు ఉతకరాదు. అలా చేస్తే కోరి మహా అనారోగ్యం, బాధలూ తెచ్చుకున్నట్టే. ఈ విషయాన్ని యమధర్మరాజు సావిత్రీ దేవితో చెప్పి వున్నాడు.

నదీ, బావుల్లో, సముద్రాలలో పుణ్యస్నానాలు చేసి ఇంటికి వచ్చాక కాళ్ళు కడుక్కొని లోనికి వెళ్ళండి. లేదంటే ఆ నదీ సముద్ర స్నానాలు చేసిన వారి దోషాలూ, పాపాలూ మీ కాళ్ళకి అంటుకొని మీ గృహంలోకి వచ్చేస్తాయి.

నారాయణ క్షేత్రమంటే

నదీ తీరములో నాలుగు హస్తముల దూరంలో శ్రీమన్నారాయణుడు నివశించి వుంటాడు. దాన్నే నారాయణక్షేత్రమంటారు.

తిరుమల, కేదార్.. ముక్తినాథ్‌లకి వెళ్ళేటప్పుడు నడక మార్గం ద్వారా వెళ్తున్నారా...

★ నడక సకల వ్యాయామాలకి రాణి.

★ రక్తం పరిశుభ్రమవుతుంది. వాతపిత్త శ్లేష్మాలు సమూలంగా సమసిపోతాయి.

★ నడుస్తూ కొండెక్కటం వల్ల అక్కడి మొక్కలలోని ఔషధ గుణాలు మలయమారుతాలుగా మనుజుని శరీరాన్ని శుద్ధి చేస్తుంది. కాయ కల్ప చికిత్స చేసి ఆయుష్షును పెంచుతుంది.

★ మెట్లు ఎక్కేటప్పుడు ముక్కుతో గట్టిగా వినపడేలా గాలి పీల్చకూడదు. అలా ముక్కుతో పీలిస్తే ఊపిరితిత్తులు ఆయాసానికి గురవుతాయి. అలాగే నడిచేటప్పుడు మాట్లాడకూడదు.

★ నడిచేటప్పుడు సోడాలూ, పానీయాలూ, తినుబండారాలు ఇంకా చెప్పాలంటే మంచినీళ్ళు కూడా తాగకూడదు.

★ నడకద్వారా ఎక్కినప్పుడు పట్టుకున్న పిక్కలు.. దిగేటప్పుడు సడలిపోతాయి. సాధ్యమైనంతవరకు ఎక్కడం, దిగడం రెండూ చేయండి.

★ వేకువజామున కొండెక్కటం మంచిది.

★ మరీ దాహం వేస్తే, ఆకలి వేస్తే నడకను రెండు భాగాలుగా విభజించుకుని మధ్యలో ఆగి కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని కావాల్సింది త్రాగి, తిని మరికొంత సేపు ఆగి, ఆపై నడక ప్రారంభించాలి. వేగంగా నడవటానికి ప్రయత్నించకండి. దానివల్ల పదిమెట్లకే... పది అడుగులకే ఆయాసం వస్తుంది. మెల్లగా ఓ పద్ధతి ప్రకారం నడవండి, ఎక్కండి. మీ ఆరోగ్యం దృష్టిలో వుంచుకొని వైద్యుని సలహాపై చేయండి.

పతివ్రత ప్రధాన లక్షణము

ఆరుగురి కన్నా ఎక్కువమందితో తిరిగితే మహా వేశ్య. ఆరుగురితో కలిసి తిరిగినది యుగ్మీ. నలుగురితో సంపర్కం పెట్టుకున్నది పుంశ్చలి. అయిదుగురితో సంపర్కం పెట్టుకున్నది వేశ్య. ముగ్గురితో కూడినది ధర్మిణి. ఇక భర్త కాక మరొకరితో తిరగినది కులట. భర్తను తప్ప పరపురుషుని తలచనిది పతివ్రత. ధర్మము, అర్థము, కామము, మోక్షములు పతివ్రతకు మాత్రమే అందుతాయని అదే అసలు సిసలు సౌఖ్యమనీ, అది

అనుభవిస్తేనే తెలిసే మహదానందం అని ధర్మ వచనము. పతివ్రతా ధర్మమును వదలిన వారు ఎన్ని యాగాలూ, పూజలూ, దానాలూ చేసినా ఫలం వుండదని బ్రహ్మ వైవర్త పురాణం శెలవిస్తోంది.

వీటితో ప్రమాణాలు చేయకండి

తులసినీ, సాలగ్రామాన్నీ పట్టుకుని ప్రమాణం చెయ్యటంగానీ, చెయ్యమనటం గానీ చేయవద్దు. సకల పాపాలకన్నా మహా పాపకర్మ అది. అది పట్టుకుని అబద్ధం చెబితే చెప్పిన వారికి 50 శాతం, చెప్పించిన వారికి 50 శాతం తగులుతుంది. అసలు ఒట్టు అనేది వెయ్యకండి, వేయించకండి.

వేప, తులసిలను గృహంలో ఎక్కడ నాటాలి

వేప మొక్కను ఇంటి బైట నాటాలి, తులసి మొక్కను పెరట్లో నాటాలి. పూజ చేసుకునే తులసి కోటనైనా లేదా గృహావరణలో పెంచే తులసి వనమైనా పెరట్లోనే పెంచాలి.

ఏ వ్రతము ఎప్పుడు చేయాలి

మహాలక్ష్మీవ్రతము ప్రతి సంవత్సరం భాద్రపద మాసం శుక్ల పక్షము అష్టమి తిథినాడూ, ప్రతి మంగళవారం మంగళ చండికా వ్రతమునూ, ప్రతి మాసం శుద్ధ షష్ఠి తిథినాడు షష్ఠీదేవి వ్రతము, అలాగే ఆషాఢ మాసం వచ్చే సూర్య సంక్రమణము రోజున మానసాదేవి వ్రతము చేయాలి. ఇంకా ప్రతి సంవత్సరము కార్తీకమాసంలో శ్రీకృష్ణునికి అత్యంత ప్రియమైన రాధికా వ్రతమ చేయాలి. అనేక వరములు ఇచ్చునదీ, బాధలను పోగొట్టునదీ అయిన దుర్గాదేవీ వ్రతాన్ని ప్రతి మాసము శుద్ధఅష్టమి నాడు ఆచరించాలి. అలా చేసినవారికి పూర్తి ఆయుర్ధాయము, ఐశ్వర్య సుఖప్రదములు లభిస్తాయి.

– సావిత్రితో యుమధర్మరాజు

ఏ తిథి నాడు ఎవర్ని పూజిస్తే

శుభకరం, ధనలాభం

వరాహ పురాణం ప్రకారం శ్రీమహావిష్ణువు భూదేవికి చెప్పిన పుణ్య ఫలాలివి. ఆయా తిథిలో ఆయా జన్మతిథిగల స్వామిని స్మరించి పూజిస్తే రెండింతల ఫలితం చేకూరుతుంది.

పాడ్యమినాడు దేవతలలో తొలుత జన్మించిన అగ్నిదేవుణ్ని పూజించాలి.

విదియనాడు అశ్వినీ దేవతలను పూజించాలి.

తదియనాడు సకల మంగళప్రదాయిని గౌరీదేవిని పూజించాలి.

చతుర్దశి నాడు అనగా వినాయకుడు జన్మించిన చవితి రోజు విఘ్నేశ్వరుడిని పూజించాలి.

అన్ని తిథులు జన్మించిన పంచమిరోజు నాగపూజ చేయాలి.

షష్ఠినాడు కుమారస్వామి జన్మించాడు గాన సుబ్రహ్మణ్యేశ్వరుడ్ని పూజించాలి.

సప్తమినాడు సూర్యభగవానుడు జన్మించాడు కాన ఆ రోజు సకల జీవకోటికీ అన్నప్రదాత, ప్రత్యక్ష నారాయణుడైన సూర్యభగవానుడ్ని పూజించాలి.

అష్టమి అష్టమాతృకలు జన్మించిన తిథి. కాన దుర్గాదేవిని పూజించాలి.

నవమి నాడు దుర్గాదేవికి ఉపవాసంతో చేసే పూజ మహా ఫలాన్నిస్తుంది.

దశమి నాడు దిక్కులు జన్మించాయి. కావున ఆనాడు దిక్పాలకులను పూజించాలి.

ఏకాదశి తిథి నాడు ఏకాదశి జన్మించింది. ఆనాడు శ్రీమహావిష్ణువును పూజించాలి.

ద్వాదశి నాడు కూడా శ్రీమహావిష్ణువుని పూజించాలి. ఈ తిథిలోనే వామన మూర్తిగా అవతారమెత్తాడు శ్రీహరి.

త్రయోదశి నాడు ఇష్టదేవత పూజ చేయాలి.

చతుర్దశి నాడు రుద్రాభిషేకం శుభకరం.

అమావాస్య నాడు పితృదేవతలకి ఇష్టం కాన ఆ రోజున ఆ కార్యాలను నిర్వహించాలి.

పౌర్ణమి నాడు ఉపవాసం ఉండి రాత్రి పూజ చేస్తే సకల శుభాలు కలుగుతాయి.

సంకష్టచతుర్దీవ్రతము చేయటం వల్ల సంకటములన్నీ తొలగిపోతాయి. శ్రీకృష్ణుడు, ధర్మరాజు.. బలిచక్రవర్తి, సీతారాములు ఈ వ్రతం చేసే తమ సంకటములన్నింటినీ పోగొట్టుకున్నారని వ్రతరత్నాకరం శెలవిస్తోంది.

అమావాస్య రాత్రి వేళల్లో భుజించరాదు.
పౌర్ణమి నాడు రాత్రి సమయంలో
పండ్లను మాత్రమే ఆహారంగా
తీసుకోవాలి. ఇంకా అమావాస్యనాడు
బట్టలను కొనకూడదు. ఇవి పాటించటం
వల్ల ఆయుష్షు పెరుగుతుంది.
ధనం వృద్ధి అవుతుంది.

- బ్రహ్మవైవర్త మహా పురాణం

పరమాత్ముని ఆలయంలోనే కాదు
తులసీ, బిల్వములను
పూజించేటప్పుడు కూడా ప్రదక్షిణ
చేసే దర్శించి పూజించాలి.

తాంబూలం అనగా మూడు
ఆకులు.. రెండు వక్కలు.. రెండు
అరటిపండ్లు. ఆడపడుచులు, పెద్దలు,
కూతురు వంటి వారు

ఇంటికొచ్చినప్పుడు చకచకా చేతికి దొరికిన వాటిని తాంబూలంలో పెట్టి ఇస్తుంటారు. కానీ శాస్త్ర ప్రకారం తాంబూలాన్ని పై ప్రకారంగా ఇవ్వాలి.

పిసినారితనం మించిన దుర్గుణం లేదు.

పక్కవారి గూర్చి చాడీలు చెప్పటం కన్నా మించిన పాపం లేదు.

సత్యవ్రతుడయితే పుణ్యం కోసం ఏ తపస్సు చేయనవసం లేదు.

మంచి విద్య వుంటే ధనం అవసరం లేదు.

అపకీర్తి కలిగితే మరణం కూడా వృధానే.

నిర్మలమైన మనస్సు వుంటే తీర్థసేవలవసరం లేదు.

నాగలాపురం... సోమకాసురుని సంహరించి వేదములను బ్రహ్మకిచ్చిన పుణ్యప్రదేశం. ఇక్కడ స్వామి వేదనారాయణస్వామిగా కొలవబడుతున్నాడు.

ఆవుపాలతోగానీ, కొబ్బరినీళ్ళతోగానీ, చెరుకురసంతోగానీ శివునికీ, శ్రీమహావిష్ణువుకీ అభిషేకం చేయించినవారు యమపురిని దర్శించరని బ్రహ్మదేవుడు స్వయంగా యమునికి చెప్పాడు.

తులసికోటలోని తులసి దళాలనూ, పసుపునూ నీటిలో కలిపి గృహమున చల్లితే అనేక సంవత్సరాల నాటి ఆ గృహ, స్థల దోషాలన్నీ పోయి ఆ గృహంలో నివశించేవారికి ఎలాంటి భయభీతులు లేకుండా వుంటాయి.

100 ఏళ్ళ ఆయుష్షు ఎలా తగ్గుతుంది

★ అతిగా తినటం వల్ల, తిన్నదానికి తగ్గ పని చెయ్యకపోవటం వల్ల.

★ అవతల వాళ్ళకి చేసే ద్రోహాలూ, అపకారాల కారణంగా ఆ కుటుంబ సభ్యులు అనగా బాధితులు పెట్టే శాపాల వల్ల.

★ సప్త వ్యసనాల వల్ల.

★ అతి ఆవేశమూ, ద్వేషమూ, పగలూ శరీరంలో వుండటం వల్ల.

★ అసత్యాలు చెప్పటం ద్వారా (అసత్యము చెప్పినవారికి వారికే తెలియకుండా లోపల ఒకరకమైన ఆందోళన వుంటుంది. అది ఏదో ఒక వ్యాధిగా మారి మనిషిని కృంగదీస్తుంది.)

★ ఇంకా ధర్మబద్ధంగా కాకుండా చేసే ప్రతిచర్య ఆయుష్షును క్షీణింప చేస్తుంది.

శమీవృక్షం ఎంత పవిత్రం...

★ శమీవృక్షమంటే అగ్నివృక్షమే. వేళ్ళలోనూ, ఆకుల్లోనూ అగ్ని వుంటుంది.

★ శత్రునాశనం కోసం వెళ్ళేవారు శమీవృక్షాన్ని పూజించి వెళితే అఖండ విజయం.

★ విజయదశమి రోజు శమీ ఆకుల్ని ఒకరికొకరు ఇచ్చుకుంటే సకల శుభాలు కలుగుతాయి.

★ పూర్వము కౌత్సుడనే శిష్యుడు గురువు అడిగిన గురుదక్షిణ ఇవ్వటానికి పధ్నాలుగు కోట్ల బంగారు నాణాల కోసం రఘు మహారాజుని ఆశ్రయిస్తాడు. అది లభించకపోవటంతో మహాయుద్ధం జరుగుతుంది. దాంతో ఇంద్రుడి ఆదేశంతో కుబేరుడు శమీవృక్షము వున్న చోట బంగారు నాణాల వర్షం కురుపిస్తాడు. దాంతో కౌత్సుడు గురుదక్షిణ చెల్లించి, మిగతా ధనాన్ని ప్రజలకిచ్చేశాడు. దాని వల్లే విజయదశమి నాడు శమీ ఆకులని గృహంలో భద్రపరుచుకుంటారు.

★ యజ్ఞయాగాదులకి శమీవృక్ష వ్రేళ్ళు, బెరడు ఆకులతోనే అగ్నిని వెలిగించి హోమాన్ని వెలిగిస్తారు.

★ మహాసంపదలున్న చోట శమీవృక్షం వుంటుంది. అందుకే పూర్వము ఖజానాలో శమీ ఆకులను పెట్టి పూజించేవారు. ధనం వుంచిన చోట శమీ ఆకులని వుంచటం వల్ల ఆ ధనానికి చలనం వుండదు. అనగా 'పరుల వద్దకు వెళ్ళదు' అని.

సముద్రం ఎంతటి గొప్పది

★ సిరికి పుట్టినిల్లు.. రత్నాలకి నెలవు. శ్రీమహావిష్ణువుకి శయ్యాస్థానం. భూదేవికి పట్టుచీర.. పర్వతాలు దాగే చోటు.. బడబానలం నివశించే చోటు.. మేఘాలకి నీటిని అందించేది.. చంద్రుని పుట్టుకకు స్థానం.. దేవతాస్త్రీలకి చల్లని భవనం.. గంభీర గుణానికి నిలయము.. మహిమలకి ఉనికిపట్టు అయిన సముద్రం గూర్చి చెప్పటానికి నాలుగు నోర్లు కలిగిన బ్రహ్మకీ, రెండువేల నాలుకలు గల ఆదిశేషునికే సాధ్యం కాదు. అట్టి సముద్ర స్నానం మహత్యము చెప్పుట ఎవ్వరి తరము.

అమూల్యమైన రత్నం...

ఓ నిరుపేద 'స్వామీ.. తపస్సు, యాగాలు చెయ్యలేను. నాకు పరమానందం కలిగించు' అని వేడుకున్నాడు. దాంతో భగవంతుడు ప్రత్యక్షమై 'నీకు

మహా శక్తినిస్తున్నాను. ఆశక్తితో అమూల్యమైనది నాకు అర్పించు' అన్నాడు. దాంతో ఆ నిరుపేద ఆ మహాశక్తితో అంతా శోధించి నవరత్నఖచితమైన కిరీటాన్ని తెచ్చి ఇచ్చాడు. దానికి భగవంతుడు ఇలాంటివి నాలోకంలో దారిపొడవునా వున్నాయన్నాడు. ఈసారి నవరత్న ఖచితమైన ఆయుధాన్ని తెచ్చి ఇచ్చాడు. దానికి భగవంతుడు నవ్వి శక్తి ఆయుధంలో కాదు, నాలోనే వుంది.. నీ ఆయుధం దేనికీ పనికి రాదు అని అన్నాడు. ఏం చెయ్యాలో అర్థం కాక వెదుకుతుంటే ఆకలితో నీరసపడి లేవలేక దాహం... దాహం అని అరుస్తున్న వానిని చూసి.. కనుచూపులో నీరు దొరకకపోతే చాలా దూరం వెళ్ళి నీరు తెచ్చి వాని గొంతు తడిపి ఆపై భగవంతుని వద్దకొచ్చి 'స్వామీ నీకేం ఇవ్వాలో నాకర్థం కావటం లేద'ని చెప్పాడు. భగవంతుడు అల్లన నవ్వి 'మహా సుఖాలు అనుభవించే సకల సిద్ధులను నీకు ప్రసాదిస్తున్నాను' అన్నాడట. 'మీరడిగిన అమూల్యమైనది నేను ఇవ్వలేదు కదా స్వామీ' అని నిరుపేద అడిగితే 'ఇచ్చావు దాహంతో అల్లాడుతున్న వానికి దాహం తీర్చావే. అట్టిదే అలాంటిదాని వల్లే మహా యజ్ఞాలకు మించినదయిన ఆనందం నాకు కలుగుతుంది. అంతకు

మించిన పూజ లేదు. సేవ లేదు. సకల పూజాదికాలకన్నా గొప్పది.. నాకు పూజలూ, యజ్ఞాలూ కావాలి.. సేవా కావాలి' అని అదృశ్యుడయ్యాడు.

బతుకమ్మ పండుగ విశిష్టతలు

★ వినాయక చవితి నుంచి దసరా వరకు జరిగే పండుగ.

★ అనేక రకాల అడవి పూలతో అలంకరించి పూజించటంతో పెద్దలు పెట్టిన ఆరోగ్య రహస్యం వుంది. బతుకమ్మ పండుగలో అలంకరించే అడవి పూల సువాసన వల్ల చుట్టూ హానిచేసే ఎన్నో హానికరమైన క్రిములు నశించి ఆరోగ్యాన్ని కాపాడతాయి.

★ అత్తింటికి వెళ్ళిన ఆడపడుచులు పుట్టింటికి వచ్చి ఆనందంగా గౌరమ్మ పూజలు చేసి బతుకమ్మను చేసి ఉరేగించి సంబరాలు జరిపే ఈ పండుగ వల్ల లక్ష్మీప్రాప్తి, సౌభాగ్యప్రాప్తి, సౌఖ్యప్రాప్తి.

★ ధర్మాంగదుడనే రాజుకూ, ఆయన భార్య సత్యవతికీ నూరుగురు పుత్రులు కలిగారు. ఆ పుత్రులెవ్వరు బ్రతకకపోవటంతో ఆ దంపతులు లక్ష్మీదేవిని పూజిస్తే ఆమె వరప్రసాదంగా ఓ ఆడబిడ్డ జన్మించింది. ఆ పుత్రికకే బతుకు అమ్మ అనగా బతుకమ్మ అని నామకరణం చేశారు. ఆ గాథప్రకారమే ఆడపడుచులు బతుకమ్మ ఆడతారు.

★ తంగేడు, గునుగు, కట్ట, బీర, గుమ్మడి, రుద్రాక్ష పూల మధ్యలో గౌరమ్మని ఉంచి పూజించి ఆటపాటలతో అందరినీ అలరించే పండుగ. ఈ పండుగ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు అశ్వయుజ నవమి వరకూ చేస్తారు.

★ ప్రకృతి అందించే పూలను ప్రకృతికే అర్పించే పండుగ బతుకమ్మ.

★ బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేస్తారు. తద్వారా నీరు ఆరోగ్యకరమవుతుంది.

భారతాన్ని వ్రాయించటానికి వ్యాసుడు వినాయకుడినే ఎందుకు ఎన్నుకున్నాడు

వ్యాసుడు వినాయకుడి భక్తుడు. భారతము వ్రాయటానికి పూనుకున్నప్పుడు నారదుడ్ని చక్కని వ్రాతకాడు కావాలని అడిగాడు. వినాయకుడు సర్వసమర్థుడని చెప్పటంతో వేదవ్యాసుడు తన కోరికను చెప్పాడు. అందుకు వినాయకుడు తను వ్రాస్తాననీ అయితే తను చేత ఘంఠము నిలుపకుండా వుండే విధంగా భారతము చెప్పాలని నియమము పెట్టాడు. వ్యాసుల వారు సరేననటంతో వినాయకుడు తన దంతాన్ని పీకి భారతము వ్రాసి ఏకదంతుడు అయ్యాడు. భారతము రాస్తున్నప్పుడు సరస్వతీ నది కూడా తన గల గల శబ్దాలని ఆపి నెమ్మదిగా, నిశ్చలంగా పారుతూ ముందుకు సాగింది. ఆ అపూర్వమైన అద్భుతమైన దృశ్యాన్ని బదరీనాథ్‌లో చూడచ్చు. వినచ్చు. ఆప్రదేశంలోనే భారతం రచన జరిగింది.

నమస్కారము అనగా అర్థం
నారాయణుని కొరకు అని....
అర్థం... పరమార్థం.

పాతచింతకాయ పచ్చడి.. అని
శాస్త్రాల గూర్చీ, పురాణాల గూర్చీ
మాట్లాడేవాళ్ళు
గుర్తుపెట్టుకోవాల్సింది ఒక్కటే.
సూర్యుడు 500 కోట్ల సంవత్సరాల
నాటివాడు. అంత పాతవాడైన
సూర్యుడి వెలుగును ఎందుకు
స్వీకరిస్తున్నట్లు ఆ పాత
చింతకాయపచ్చడి పండితులు.

సకల అరిష్టములను తొలగించే ఒకే
ఒక వ్రతము సత్యనారాయణస్వామి
వ్రతము. పధ్నాలుగు లోకాల్లో చేసే
ఈ వ్రతము అనేక దుఃఖాలను
పోగొడుతుంది. సుఖాలను ఇస్తుంది.

- నారదునితో శ్రీమహావిష్ణువు.

తుమ్ము ఏ దిక్కు నుంచి వచ్చినా మంచిది కాదు. గోవు తుమ్మితే ఆ కార్యం వాయిదా వేసుకోవాలి. గృహానికెళ్ళి స్నానమాచరించి పూజాదికాలు చేయాలి. పదిరోజుల పాటు గృహాన్ని అనగా ఉన్న ఊరిని వదలకూడదు. పిల్లలు, వృద్ధులూ, రోగగ్రస్థులూ, వడ్డీలకి తిప్పేవేరు తుమ్మితే కార్యవిఫలం అవుతుంది.

- సనందన మహర్షి

మాసాలన్నింట్లో శ్రావణమాసంనే మహాలక్ష్మి ఆశ్రయించింది. అలాగే ప్రతి మంగళ, శుక్రవారములు కూడా అంతటి లక్ష్మీప్రదములే.

ఆంజనేయుడే శివుడు

ఖరాసురుడనే రాక్షసుణ్ని సంహరించటానికి శివకేశవులు పందెం వేసుకుంటారు. ఓడినవారు సేవచేయాలి. అదీ పందెం. అందులో శ్రీమహావిష్ణువు గెలవటం వల్ల రాక్షస సంహారం చెయ్యటం వల్ల పందెం ప్రకారం పరమేశ్వర అంశతో శ్రీరామావతారంలో ఆంజనేయునిగా శ్రీమహావిష్ణువుకి అనగా శ్రీరామునికి సేవ చేసి ఉన్నాడు.

శ్రీరామ శ్రీరామ

ఓసారి శ్రీరాముడు వశిష్ఠుల వారి తలుపుకొట్టాడు. లోపల్నించి వశిష్ఠులవారు శ్రీరాముడ్ని ఆటపట్టిద్దామని 'ఎవరు?'అని అడిగాడు. 'నేనే స్వామి' అన్నాడు శ్రీరాముడు. 'నేనంటే ఎవరు..?' రెట్టించారు వశిష్ఠులవారు. 'అది తెల్సుకోవటానికే స్వామీ మీ వద్దకు వచ్చిందన్నాడు' దశరథరాజు తనయుడు అత్యంత వినయవిధేయతలతో.



మంగళం కోసలేంద్రాయ మహనీయ
గుణాత్మనే।
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ
మంగళమ్।
శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

.....